




ఒంగోలులోని 37వ డివిజన్‌లో జరిగిన చర్చా కార్యక్రమంలో పాల్గొన్న స్థానిక ప్రజలు (ఇన్‌సెట్‌లో) మాట్లాడుతున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

సమస్య.. పరిష్కారం

ఇటు సమస్యల ప్రస్తావన.. అటు పరిష్కారానికి ఆదేశాలు.. ఒకే వేదికపై రెండూ జరిగిపోయాయి. అందుకు ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ చేపట్టిన చర్చా కార్యక్రమాలు దోహదం చేశాయి. భారీ వ్యయంతో కూడిన అభివృద్ధి పనులతోపాటు రోడ్లు, డ్రెయిన్‌లు లాంటివే కాక అనేక రకాల వ్యక్తిగత సమస్యలపై కూడా జనం గళం విప్పారు. కార్యక్రమంలో పాల్గొన్న శాసనసభ్యులు, అధికారులు కూడా కొన్ని పనుల పరిష్కారానికి అక్కడికక్కడే ఆదేశాలు జారీ చేసి, మరికొన్ని కార్యక్రమాలకు నిర్దిష్ట కాలపరిమితితో హామీలు ఇచ్చారు. ఒంగోలులోని 37వ డివిజన్‌లో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పక్షం రోజుల్లో ఎన్టీఆర్ పార్క్ అభివృద్ధి, డ్రైనేజీ సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. మొత్తం రూ.10 కోట్లతో డివిజన్‌లో అభివృద్ధి ప్రణాళికను ప్రకటించారు. మార్కాపురంలో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి... చప్టా నిర్మాణం, పైపులైన్లు, రోడ్ల మరమ్మతులతోపాటు రూ.10 కోట్లతో చెరువుకట్ట రోడ్డును ట్యాంకు బండ్ తరహాలో అభివృద్ధి చేసే ప్రణాళికను ప్రకటించారు. దీంతో 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా' పేరుతో ఆంధ్రజ్యోతి నిర్వహించిన కార్యక్రమాలకు ఆయా ప్రాంత ప్రజల నుంచి పూర్తిస్థాయిలో అభినందనలు లభించాయి.

భారీగా తరలివచ్చిన ప్రజలు



ఆరంభం నుంచి అక్షరాన్ని ఆయుధంగా మార్చి ప్రజలకు అండగా ముందుకు సాగుతున్న 'ఆంధ్రజ్యోతి' తాజాగా ప్రజలు, ప్రభుత్వం మధ్య వారధిగా వారి సమస్యల పరిష్కారం, ఆయా ప్రాంతాల అభివృద్ధి కోసం నడుం బిగించిన విషయం విదితమే. అందులో భాగంగా మంగళవారం ఉదయం మార్కాపురంలోని 7,8 డివిజన్‌లలో, సాయంత్రం ఒంగోలులోని 37వ డివిజన్‌లో చర్చా కార్యక్రమాలు నిర్వహించారు. ఒంగోలులో దాదాపు 600 మంది, మార్కాపురంలో 300 మంది హాజరయ్యారు. ఎమ్మెల్యేలు, అధికారుల ముందు పలువురు సమస్యల గళం విప్పారు.

అక్షరమే.. అంకుశమై..



'అక్షరమే అండగా.. పరిష్కారమే అజెండాగా...' అనే నినాదంతో ప్రజల పక్షాన ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ మొదలు పెట్టిన మరో ప్రయత్నం సఫలమైంది. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఒంగోలు, మార్కాపురంలలో మంగళవారం నిర్వహించిన చర్చా వేదికలు విజయవంతమయ్యాయి. రెండు చోట్లా పెద్దఎత్తున ప్రజలు తరలివచ్చి సమస్యలను విన్నవించారు. ఒంగోలులో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, నగరపాలక సంస్థ అధికారులు, మార్కాపురంలో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, పురపాలక శాఖ అధికారులు హాజరయ్యారు. ప్రజలు ప్రస్తావించిన సమస్యలను సావధానంగా విని పరిష్కారానికి నిర్దిష్టమైన హామీలు ఇచ్చారు. కొన్నింటిని వెంటనే పరిష్కరిస్తామని ప్రకటించారు. ఇంకొన్నింటిపై అధికారులకు ఎమ్మెల్యేలు అక్కడికక్కడే ఆదేశాలు జారీ చేశారు. - ఆంధ్రజ్యోతి, ఒంగోలు

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా జిల్లాలో 'ఆంధ్రజ్యోతి' చర్చావేదికలు

మార్కాపురం, ఒంగోలులో విజయవంతం

- హాజరైన ఎమ్మెల్యేలు కందుల, దామచర్ల
- తరలివచ్చిన అధికార యంత్రాంగం
- పెద్దఎత్తున కదిలివచ్చిన స్థానిక జనం
- సమస్యలపై గళం విప్పిన ప్రజానీకం
- నిర్దిష్ట హామీలిచ్చిన ప్రజాప్రతినిధులు
- కొన్ని తక్షణమే పరిష్కారానికి చర్యలు



మార్కాపురంలోని పీర్ల మకానాలో జరిగిన చర్చా కార్యక్రమంలో పాల్గొన్న స్థానిక ప్రజలు (ఇన్‌సెట్‌లో) మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

ఒంగోలులో ప్రజలు చెప్పిన సమస్యలు.. పరిష్కారానికి నిర్ణయాలు ఇవీ..

- ఒంగోలు 37వ డివిజన్‌లోని చెన్నకేశవ లేఅవుట్‌లో ఉన్న ఎన్టీఆర్ పార్క్‌లో జరిగిన కార్యక్రమానికి 600 మంది స్థానికులు హాజరయ్యారు. 70 మందికి పైగా ముందుకు వచ్చి సమస్యలను ప్రస్తావించారు. 30కి పైగా సమస్యలపై లిఖిత పూర్వక వినతిపత్రాలు సమర్పించారు. అనంతరం ఎమ్మెల్యే జనార్దన్ పలు నిర్ణయాలు తీసుకున్నారు.
- ఎన్టీఆర్ పార్క్ అభివృద్ధి, అక్కడి డ్రైనేజీ సమస్యను ప్రధానంగా ప్రజలు ప్రస్తావించారు. దీనిపై స్పందించి ఎమ్మెల్యే జనార్దన్ పక్షం రోజుల్లో సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. డివిజన్‌లోని అన్ని ప్రాంతాల్లో డ్రైనేజీ సమస్యను ప్రజలు వివరించగా.. రూ.7.34 కోట్లతో డ్రైనేజీ సమస్యను పరిష్కరించేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు ప్రకటించారు. దాన్ని రానున్న మార్చి, ఏప్రిల్ నుంచి అమలు చేయడం జరుగుతుందన్నారు.
- కొన్ని ప్రాంతాల్లో రోడ్ల ఆక్రమణలను ప్రజలు ప్రస్తావించగా వాటన్నింటినీ తొలగించాలని అక్కడే ఉన్న కమిషనర్‌ను ఆదేశించారు.
- మార్చి 3 నుంచి 8వ తేదీ వరకు డివిజన్‌లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.
- రెవెన్యూ కాలనీలో గుడి నిర్మాణానికి స్థలం కేటాయించే విషయంతోపాటు సుజాతనగర్ రెవెన్యూ కాలనీలో ఉన్న విద్యుత్ లైన్ల మరమ్మతులు, స్తంభాల మార్పు లాంటి అనేక సమస్యలను తక్షణం పరిష్కరించాలని అక్కడే ఉన్న విద్యుత్ అధికారులను ఆదేశించారు.
- మూడు ప్రాంతాల్లో ఆక్రమణల తొలగింపు, మంగమూరు రోడ్డులో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి తగు ఆదేశాలు ఇచ్చారు.
- ముంగమూరు రోడ్డు సర్కిల్‌లో ట్రాఫిక్ నియంత్రణ, ప్రమాదాల నివారణ కోసం అండర్ పాస్ నిర్మాణం నెలరోజుల్లో చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే ప్రకటించారు. సుజాత నగర్ నుంచి అంజయ్య రోడ్డు వరకు రహదారి ఏర్పాటుకు ప్రయత్నిస్తానని చెప్పారు.
- సుజాతనగర్ ప్రాంతం 22సీలో ఉండటం

మిగతా 4లో...

మార్కాపురంలో ప్రజలు చెప్పిన సమస్యలు.. పరిష్కారానికి నిర్ణయాలు ఇవీ..

- మార్కాపురంలో జరిగిన కార్యక్రమంలో ప్రజలు ప్రస్తావించి సమస్యల్లో కొన్ని తక్షణ పరిష్కారానికి ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అక్కడికక్కడే నిర్ణయం తీసుకున్నారు. కొన్నింటి విషయంలో పక్కనే ఉన్న మునిసిపల్ కమిషనర్‌తో మాట్లాడి పరిష్కారానికి హామీ ఇచ్చారు.
- ప్రజలు చెప్పిన కూడలి ప్రాంతంలో బలహీనంగా ఉండి, ఆక్రమణలు జరిగి.. ట్రాఫిక్‌కు కూడా ఇబ్బందిగా ఉన్న చప్టాను పునర్నిర్మించనున్నట్లు అక్కడికక్కడే ప్రకటించారు.
- మంచినీటి సరఫరా పైపు లీకై మురుగునీరు కలుస్తున్న విషయాన్ని ప్రజలు ప్రస్తావించగా కమిషనర్‌తో మాట్లాడి సాయంత్రం నుంచే మరమ్మతులు చేపట్టబోతున్నట్లు చెప్పారు.
- అవసరమైన మేరకు కొళాయి కనెక్షన్లు ఇవ్వాలని కూడా నిర్ణయం తీసుకున్నారు.
- 7,8 వార్డుల్లో అనేక మంది ఇళ్లకు నంబర్లు తప్పుగా ఇవ్వడం వలన ఎదురవుతున్న సమస్యలను వివరించగా ఏప్రిల్ చివరకు రికార్డుల్లో మార్పు చేసి ఆ సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.
- వార్డుకు అనుబంధంగా ఉన్న రాష్ట్ర రహదారి గుంతలమయంగా మారడంతో ఎదురవుతున్న ఇబ్బందులను ఎక్కువ మంది ప్రస్తావించగా వెంటనే ఎమ్మెల్యే స్పందించారు. గుంతలను తక్షణం పూడ్చించటంతోపాటు చెరువుకట్ట రోడ్డును హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్ తరహాలో అభివృద్ధి చేయబోతున్నానని వెల్లడించారు. అందుకు రూ.10 కోట్లు వెచ్చించబోతున్నట్లు ప్రకటించారు. ఈ పనిని రానున్న నెల రోజుల్లో చేపడతామని హామీ ఇచ్చారు.
- గత టీడీపీ ప్రభుత్వంలో తమకు కేటాయించిన టిడ్కో ఇళ్లను వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిన విషయాన్ని పలువురు ప్రస్తావించారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే.. టిడ్కో ఇళ్ల కేటాయింపు విషయంలో విచారణ చేపట్టి పార్టీరహితంగా అనర్హులను రద్దుచేసి అర్హులకు ఇస్తామన్నారు.

మిగతా 4లో...

నకిలీ పత్రాలతో ఆస్తులు కాజేశారు!

- మృతిచెందిన రోజే వీలునామా రాసినట్లు పత్రాలు
- అనంతరం వాటిపైనే రిజిస్ట్రేషన్
- ప్రస్తుతం ఆ స్థలం మార్కెట్ విలువ కోట్లలోనే
- లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించిన బాధితులు

5

బీమా సొమ్ము కోసమే హత్య

5



తులసిబాబును ఒంగోలు తాలూకా స్టేషన్ నుంచి ఎస్పీ కార్యాలయానికి తరలిస్తున్న పోలీసులు

2 రోజులు.. 9 గంటలు.. 75 ప్రశ్నలు!

- తులసిబాబును విచారించిన ఎస్పీ దామోదర్
- ముగిసిన పోలీసు కస్టడీ
- తాలూకా స్టేషన్‌లో నేలపై పడక
- 'తులసి'దళం రగడ పై ఎస్పీ సీరియస్

మెయిన్‌లో..

అందెల రవమిది..

ఒంగోలులోని పీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఎన్టీఆర్ కళాపరిషత్ ఉత్సవాలు ఆద్యంతం ఆకట్టుకుంటున్నాయి. మంగళవారం వివిధ పాఠశాలల విద్యార్థినుల నృత్య ప్రదర్శనలు కనువిందు చేశాయి. వివిధ అంశాలపై నాటికలు ఆద్యంతం అలరించాయి.

5



ఒక పాఠశాల విద్యార్థిని నృత్యం

కొత్త కూరగాయల మార్కెట్‌లో ఉద్రిక్తత

- ఆరుబయట ఆక్రమణల తొలగింపు
- అడ్డుకున్న వ్యాపారులు
- అధికారులతో వాగ్వాదం
- 3 గంటలపాటు గందరగోళం





ఆక్రమణల తొలగింపుతో చెల్లాచెదురైన వ్యాపారుల గుడారాలు (ఇన్‌సెట్‌లో) మున్సిపల్ అధికారులతో మహిళా వ్యాపారి వాగ్వాదం

ఒంగోలు, కార్పొరేషన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులోని కూరగాయల మార్కెట్‌లో అనధికారిక వ్యాపారాలపై మున్సిపల్ అధికారులు చర్యలకు ఉపక్రమించారు. కేటాయించిన దుకాణాల్లో కాకుండా ఆరుబయట ఆక్రమించి చేపట్టే వ్యాపారాలను తొలగించారు. కొందరు వ్యాపారులు అడ్డుకోవడంతో మంగళవారం ఉదయం ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. ఊరచెరువులోని కూరగాయల మార్కెట్‌లో దుకాణాలను బహిరంగ వేలం ద్వారా వ్యాపారులకు చాలా కాలం క్రితమే కేటాయించారు. కొందరు తమ దుకాణాల్లోకి వెళ్లకుండా ఆరుబయట అమ్ముతున్నారు. వారిని కార్పొరేషన్ అధికారులు హెచ్చరించారు. అయినా ఆరుబయట దుకాణాలను తొలగించలేదు. మంగళవారం ఉదయం పోలీసుల సహకారంతో రెవెన్యూ అధికారులు మార్కెట్‌లో ఆరుబయట అమ్మకాల దుకాణాలను తొలగించారు. కొందరు వ్యాపారులు అధికారులకు సహకరించారు. మరికొందరు మాత్రం అడ్డుపడ్డారు. తమ జీవనోపాధిని దెబ్బతీయడానికి వీల్లేదని పట్టుపట్టారు. వ్యాపారులు, అధికారుల మధ్య కొద్దిసేపు వాదులాట జరిగింది. ఉదయం 6 నుంచి 10 గంటల వరకు మార్కెట్‌లో ఇదే గందరగోళం నెలకొంది. వ్యాపారుల్లో కొందరు వైసీపీ సానుభూతిపరులున్నారు. వీరు కొన్నేళ్లుగా కూరగాయల మార్కెట్‌ను తమ కనుసన్నల్లో శాసిస్తూ వచ్చారు. ఇతర సాధారణ వ్యాపారులు సానుకూలంగానే తమ దుకాణాలు తొలగించుకున్నప్పటికీ వైసీపీ సానుభూతిపరులు మాత్రం రాద్ధాంతం చేశారు. రోడ్డుపై పడుకుని నిరసన తెలిపారు. 'మేం ఎన్నో ఏళ్లుగా

మిగతా 4లో...

వ్యాపారులపై దాడి కేసు నమోదు

ఒంగోలు క్రైం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : నగరపాలక సంస్థ అధికారులను దుర్భాషలాడి దాడి చేసిన వ్యాపారులపై కేసు నమోదు చేసినట్లు ఒంగోలు వన్‌టౌన్ సీఐ నాగరాజు తెలిపారు. మంగళవారం కొత్తకూరగాయల మార్కెట్‌లో ఆక్రమణలు తొలగింపు సమయంలో పురిణి ప్రభావతి మరికొంత మంది కలిసి మున్సిపల్ కార్పొరేషన్ అధికారులపై దాడిచేసి నానా దుర్భాషలాడారని ఆర్ఐ శ్రీనివాసరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

37 డివిజన్‌లో అభివృద్ధి పనులకు

రూ. 10 కోట్లు



ఒంగోలులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జనార్దన్, పక్కన కమిషనర్ వెంకటేశ్వరరావు, మేయర్ సుజాత, మాజీ ఎమ్మెల్యే శివరాం

- ఇరవై రోజుల్లో ఎన్టీఆర్ పార్కులో సమస్యలు పరిష్కారం
- ఎంఎం జంక్షన్, అంజయ్య రోడ్-టు-సుజాత నగర్ అండర్ పాస్‌పై దృష్టి
- సర్వే నెంబర్ల సమస్యల పరిష్కారంపై వచ్చే నెలలో సమావేశం
- ఏబీఎన్-ఆంధ్రజ్యోతి ప్రజా సమస్యల పరిష్కార వేదిక చర్చలో ఎమ్మెల్యే దామచర్ల

ఒంగోలు, కార్పొరేషన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : నగరంలో 37వ డివిజన్‌లో సమస్యలు త్వరలోనే పరిష్కరిస్తానని ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ హామీ ఇచ్చారు. మంగళవారం ఏబీఎన్-ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో నిర్వహించిన 'అక్షరం అండగా, పరిష్కారమే అజెండా'గా నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార చర్చ వేదిక కార్యక్రమానికి ఆంధ్రజ్యోతి బ్రాంచ్ మేనేజరు ఐవీ సుబ్బారావు అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను ప్రాధాన్యత ప్రకారం పరిష్కరిస్తామన్నారు. తొలుతగా చెన్నకేశవ లేఅవుట్, ఎన్టీఆర్ పార్కులోని వాకింగ్ ట్రాక్, ఆవరణ లెవలింగ్, లైటింగ్ సమస్య, నీరుపారుదల సమస్యలను ఇరవై రోజుల్లో పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. 2014-19లో తాను ఎమ్మెల్యేగా 37వ డివిజన్‌లో రూ. 7.71 కోట్లుతో అభివృద్ధి పనులు చేసినట్లు తెలిపారు. 70లక్షలతో పార్క్ అభివృద్ధి, ఓపెన్ జిమ్, అలాగే 92 పనులు చేశానన్నారు. త్వరలోనే మంగమూరు రోడ్‌లో అండర్ పాస్ నిర్మించి ట్రాఫిక్ సమస్య నియంత్రణకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. అలాగే అంజయ్య రోడ్ నుంచి సుజాత నగర్‌కు అండర్ పాస్ నిర్మాణం విషయంపైనా దృష్టి సారిస్తానని తెలిపారు. అంతేకాకుండా డివిజన్‌లో పలు సర్వే నెం. 22ఏ, 225 వంటి వాటిలో రిజిస్ట్రేషన్ సమస్యను కూడా సంబంధిత అధికారులతో కలిసి వచ్చే నెలలో పరిష్కరిస్తానని తెలిపారు. పారిశుధ్యం మెరుగుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని, విద్యుత్ సమస్యలను కూడా పరిష్కరిస్తామన్నారు. మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ డివిజన్‌లో పారిశుధ్యం మెరుగు కోసం ప్రజలు కూడా సహకరించాలని కోరారు. కమిషనరు డాక్టర్ కోడూరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఖాళీ స్థలాలను నిరుపయోగంగా వదిలేయడం ద్వారా దోమల వ్యాప్తి, ఇతర పారిశుధ్యం సమస్యలు తలెత్తుతున్నాయని చెప్పారు. కార్పొరేటర్ చెన్నుపాటి వేణు మాట్లాడుతూ గుర్తించిన సమస్యల పరిష్కారానికి తాను కూడా ఎమ్మెల్యే, సంబంధిత అధికారులతో ఎప్పటికప్పుడు మాట్లాడి, పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో చెన్నకేశవ లేఅవుట్ పార్క్ అసోసియేషన్ ప్రతినిధులు చెన్నుపాటి ప్రసాద్, కుర్రా భాస్కర్ రావు, నిడమనూరి నాగేశ్వరరావుతోపాటు, టీడీపీ డివిజన్ ఇన్‌చార్జి మేడికొండ మోహన్‌రావు, మహిళ నాయకులు నిడమనూరి పావని, ఉషారాణి గాంధీనగర్, సుజాతనగర్, రెవెన్యూ కాలనీ, తదితర డివిజన్ పరిధిలోని కాలనీల ప్రజలు పలు సమస్యలను ఎమ్మెల్యే దామచర్ల దృష్టికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రజ్యోతి ఎడిషన్ ఇన్‌చార్జి ఆళ్ల శ్రీనివాసరావు, స్టాఫ్ రిపోర్టర్ కోనూరి శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.





మార్కాపురంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి, పక్కన కమిషనర్ నారాయణరావు, చైర్మన్ మురళీకృష్ణ

ప్రజా సమస్యల పరిష్కారానికి ఏబీఎన్- ఆంధ్రజ్యోతి చొరవ ప్రశంసనీయం

ఎమ్మెల్యే నారాయణరెడ్డి

సమస్యలపై గళమెత్తిన మార్కాపురంలోని 7, 8వ వార్డు ప్రజలు

'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా'కు పోటెత్తిన ప్రజలు

మార్కాపురం, మార్కాపురం వన్‌టౌన్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి ఏబీఎన్-ఆంధ్రజ్యోతి తీసుకున్న చొరవ ప్రశంసనీయమని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి చెప్పారు. స్థానిక గొర్లగడ్డలోని పీర్ల మకానం వద్ద మంగళవారం ఉదయం 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా' కార్యక్రమాన్ని ఏబీఎన్- ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆంధ్రజ్యోతి బ్రాంచ్ మేనేజర్ ఐవీ సుబ్బారావు పర్యవేక్షణలో సమస్యలపై చర్చా వేదిక నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే నారాయణరెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే తాము పార్టీ తరఫున అన్ని వార్డుల్లో పర్యటిస్తున్నామన్నారు. 'ఏబీఎన్- ఆంధ్రజ్యోతి' వినూత్నంగా రాష్ట్ర వ్యాప్తంగా క్షేత్రస్థాయిలో నాయకులు, అధికారుల సమక్షంలో కార్యక్రమాలు నిర్వహించి ప్రజల నుంచి సమస్యలను తెలుసుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో తెలియజేసిన ప్రతి సమస్యకు నిర్ణీత కాలవ్యవధిలోగా పరిష్కారమార్గం చూపుతామన్నారు. పారిశుధ్య కార్యక్రమాలకు ప్రజల సహకారం తప్పక ఉండాలన్నారు. మురుగుకాలువల్లో ఇష్టారీతిన చెత్తాచెదారంతోపాటు ప్లాస్టిక్ వ్యర్థాలను వేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. చర్చా వేదిక దృష్టికి వచ్చిన కొన్ని సమస్యలపై మాట్లాడుతూ కొందరు ఏళ్లుగా సమస్యలపై అధికారులు, కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నామని చెబుతున్నారన్నారు. మూడేళ్ల నుంచి ఒక సమస్య తీరడంలేదని చెబుతున్నారని, వాటిని ముప్పై రోజుల్లోగా తప్పక పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాల మురళీకృష్ణ మాట్లాడుతూ 7, 8వ వార్డుల్లో సమస్యలు అధికంగానే ఉన్నాయన్నారు. గతంలో కొన్ని అభివృద్ధి కార్యక్రమాలు తాము చేపట్టామని చెప్పారు. కమిషనర్ డీవీఎస్ నారాయణరావు మాట్లాడుతూ చర్చా వేదికపై ప్రజలు తెలియజేసిన సమస్యలను దశలవారీగా ప్రాధాన్యతక్రమంలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ దొడ్డా భాగ్యలక్ష్మి, పలువురు మాజీ కౌన్సిలర్లు, నాయకులు, మహిళలు, యువత పాల్గొన్నారు.

వార్డు నిండా సమస్యలే

దొడ్డా భాగ్యలక్ష్మి, 8వ వార్డు కౌన్సిలర్



పట్టణంలోని 8వ వార్డులో చాలా సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయి. ప్రధానంగా అలుగు కాలువ నిర్వహణ సక్రమంగా లేదు. దీంతో దుర్గంధం వెదజల్లుతోంది. గతంలో ఎన్నిసార్లు కౌన్సిల్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు. అంతేకాక సాగర్ నీటి సరఫరా కోసం వార్డులో చాలాచోట్ల రహదారులను తవ్వి వదిలేశారు. దీంతో రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందిగా ఉంది. అంతేకాక సాగర్ నీటి కనెక్షన్లు ఇవ్వకపోవడంతో డీప్‌బోర్ల నీటినే వినియోగిస్తున్నారు. డీప్‌బోర్ల ద్వారా నీటి సరఫరా కోసం ఉన్న పైప్‌లైన్‌లు, కొళాయిలు ఎక్కడికక్కడ లీకవుతున్నాయి. దీంతో నీరంతా రహదారులపై పారుతోంది.

ఉర్దూ పాఠశాలను విలీనం చేయవద్దు

పట్టణంలోని 8 వార్డులో 50 ఏళ్ల నుంచి ఉన్న ఏకైక ఉర్దూ పాఠశాలను తెలుగు, ఇంగ్లీష్ మీడియం పాఠశాలల్లో విలీనం చేయవద్దని ముస్లిం మైనార్టీ నాయకులు ఎమ్మెల్యేకు విన్నవించుకున్నారు. పాఠశాలల పునర్నిర్మాణంలో భాగంగా జీవో నెంబర్ 117 ప్రకారం, విద్యాశాఖ విలీనం ప్రక్రియను ప్రారంభించిన నేపథ్యంలో పాఠశాలకు మినహాయింపు ఇవ్వాలని కోరారు. సమస్యను తెలియజేసిన వారిలో మొఘల్ జాబీర్‌హుసేన్ బేగ్, షాకీర్‌హుసేన్‌బేగ్, ఎస్ఎంసీ చైర్మన్ ఖాశీం, మాజీ కౌన్సిలర్ షేక్ బషీరున్నీసా ఉన్నారు.

ఇంటి నెంబర్ల మార్పుతో సమస్య

స్థానిక 7, 8 వార్డుల పరిధిలో ఇంటి నెంబర్ల మార్పు సమస్య తీవ్రంగా ఉంది. మున్సిపాలిటీ రెవెన్యూ విభాగం చేసిన తప్పిదాలకు ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఒకరి ఇంటి నంబరుపై మరొకరు పొజిషన్‌లో ఉన్నారు.

ఎన్టీఆర్ పార్కు అభివృద్ధికి చొరవ తీసుకోవాలి

- కుర్రా భాస్కరరావు, వాకర్స్ అసోసియేషన్



ఎన్టీఆర్ పార్కులో గతంలో ఎమ్మెల్యేగా జనార్దన్ అభివృద్ధి చేశారు. ప్రస్తుతం పార్కులో లెవల్‌లో ఉండటంతో పాటు ట్రాక్ కూడా ఏర్పాటు చేయాల్సి ఉంది. సోలార్ లైటింగ్ కూడా ఏర్పాటు చేస్తే ఉపయోగకరం. పార్కును ఎత్తు పెంచి వర్షపు నీరు బయటకు పోయే విధంగా చర్యలు తీసుకోవాలి.

2009 నుంచి రిజిస్ట్రేషన్లు నిలిపివేశారు

ఏవీ పుల్లారావు, రిటైర్డ్ ప్రిన్సిపాల్, రామయ్యనగర్



2009నుంచి రిజిస్ట్రేషన్లు నిలిచిపోవడంతో 700 కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాం. 1908లో ఆర్ఎస్‌లో వ్యక్తులకు సంబంధించిన భూములుగా ఉంది. కానీ 22(సి)కింద ఆ భూములను పెట్టడంతో రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. దీని కారణంగా అనేక ఇబ్బందులు పడుతున్నాం. ఆ సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలి.

అండర్ పాస్ ఏర్పాటు చేయాలి

- హనుమంతరావు, రిటైర్డ్ మండల విద్యాధికారి



అంజయ్యరోడ్డునుంచి సుజాతనగర్‌కు వచ్చేందుకు ఇబ్బందులు పడుతున్నాం. అంజయ్య రోడ్డు నుంచి యూటర్న్ తీసుకొని రావాల్సి వస్తోంది. ఆ రోడ్డు చిన్నది కావడంతో ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడ్డాయి. అందువల్ల అండర్ పాస్ వేసే విధంగా చర్యలు తీసుకుంటే ఈ ప్రాంత ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుంది.

టీడీపీ అనే కారణంతో పింఛన్లు తొలగించారు

- మాదాల ఆంజనేయులు, గాంధీనగర్



టీడీపీ అనే కారణంతో మా ఇద్దరి పింఛన్లను తొలగించారు. వాటిని తొలగించడమే కాకుండా రేషన్ కార్డుతో పాటు డ్వాక్రా గ్రూపు నుంచి తొలగించారు. అనేక సార్లు సచివాలయానికి వెళ్లినా పట్టించుకోవడం లేదు. న్యాయంచేసి ఆదుకోవాలి.

డొంకపోరంబోకు పేరుతో రిజిస్ట్రేషన్లు నిలిపివేశారు

- వీరయ్య, వీకేబీ అపార్ట్‌మెంట్



సుజాతనగర్ ప్రారంభంలో ఉన్న వీకేబీ అపార్ట్‌మెంట్ డొంకపోరంబోకు పేరుతో రిజిస్ట్రేషన్లు నిలిపివేశారు. 2017 వరకు రిజిస్ట్రేషన్లు జరిగాయి. ఆ తర్వాత జరగలేదు. 2018లో అప్పటి సీఎం చంద్రబాబు కూడా గతంలో రిజిస్ట్రేషన్లు జరిగి ఉంటే ఆ స్థలాలను రిజిస్ట్రేషన్ చేయవచ్చని ఇచ్చిన జీవోను అధికారుల చూపినా పట్టించుకోవడం లేదు.

సచివాలయంలో కనీసం సమాచారం చెప్పడం లేదు

నల్లూరి రవి, 33వ డివిజన్ టీడీపీ నాయకుడు



33 డివిజన్‌కు సంబంధించి 37వ డివిజన్‌లో ప్రజలను మ్యాపింగ్ చేశారు. ఆ సచివాలయంలో కనీసం సమాచారం కూడా చెప్పడం లేదు. ఎప్పుడు వెళ్లినా సిబ్బంది లేరని చెప్తున్నారు. దీనివల్ల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఆ సచివాలయంలో ప్రజలకు సమాధానం కూడా చెప్పేవారు లేరు.

ట్రాఫిక్ సమస్య అధికంగా ఉంది

మండవ మురళీకృష్ణ, పారిశ్రామికవేత్త



చెన్నకేశవ స్వామి లే అవుట్‌లో ట్రాఫిక్ సమస్య అధికంగా ఉంది. దోమలు కూడా అధికంగా ఉన్నాయి సాయంత్రం సమయంలో కొద్దిసేపు అక్కడ కూర్చోవాలన్నా ఇబ్బందికరంగా ఉంది.

ఖాళీ స్థలాల వల్ల ఇబ్బందులు

శ్రీవాణి, సుజాతనగర్



సుజాతనగర్ ఆరో లైనులో ఖాళీ స్థలాలు ఉండటంతో చెట్లు పెరిగి పాములు వస్తున్నాయి. ఆ స్థలాల్లో చెట్లను తొలగించి యజమానులు చుట్టూ ఫెన్సింగ్ వేసుకొనేలా చర్యలు తీసుకోవాలి.

పారిశుధ్య కార్మికులను పెంచాలి

- కే శ్రీనివాసరావు, టీడీపీ నాయకుడు



33వ డివిజన్‌లో పారిశుధ్య కార్మికులు తక్కువగా ఉన్నారు. పెద్ద డివిజన్ అయినందున వారిసంఖ్యను పెంచేలాచర్యలు తీసుకోవాలి. ప్రస్తుతం ఉన్న ఆరుగురు సరిపోవడం లేదు.

డ్రైనేజీ సక్రమంగా లేక ఇబ్బందులు

- నార్నె వెంకట సుబ్బయ్య, హేతువాద సంఘం అధ్యక్షుడు



డ్రైనేజీ ఉన్నా సక్రమంగా లేనికారణంగా ఇబ్బందికరంగా ఉంది. డ్రైనేజీనీరు పోయే విధంగా చర్యలు తీసుకోవాలి. మరో వైపు అడుగడుగునా స్పీడ్ బ్రేకర్లు వేయడం వల్ల వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా ఉంది. ఆ సమస్యను పరిష్కరించాలి.

రోడ్డు ఆక్రమణ వల్ల ఇబ్బందులు

సుబ్బారావు, సోనియాగాంధీనగర్



సమతానగర్ మెయిన్ రోడ్డు నుంచి రెవెన్యూ కాలనీ, సుజాత నగర్‌కు వచ్చేందుకు 25 అడుగుల రోడ్డు ఉంది. ప్రస్తుతం అక్కడ ఒక అపార్ట్‌మెంట్ ప్రహరీని రోడ్డుపై నిర్మించారు. దీని వల్ల రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. ఇంకొక వైపు 11కేవీ విద్యుత్ తీగలు వల్ల అనేక సమస్యలను ఎదుర్కొంటున్నాం.

ఒంగోలులో ప్రజా సమస్యలు.. పరిష్కారాలు ఇవీ..

(3వ పేజీ తరువాయి)

ద్వారా అన్ని రకాల రిజిస్ట్రేషన్లు ఆగిపోవడం, వీకేబీ అపార్ట్‌మెంట్ మాన్యం భూమి కింద చూపి రిజిస్ట్రేషన్లు ఆపడం వంటి సమస్యలపై దామచర్ల సానుకూలంగా స్పందించారు. కొత్తగా రెవెన్యూ కాలనీలో కూడా ఒకే సర్వే నెంబర్‌లో ఇలాంటి కారణం చూపి రిజిస్ట్రేషన్లు ఆపేసినట్లు మరికొందరు ప్రస్తావించడంతో ఈ మూడు అంశాలపై జిల్లా అధికారుల ద్వారా సమాచారం తెప్పించుకుని ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆ విషయంలో అవసరమైతే సీఎంను కూడా కలుస్తానన్నారు. గత ప్రభుత్వంలో తమకు పింఛన్లు నిలిపివేశారని నలుగురు వృద్ధులు, ఇద్దరు దివ్యాంగులు ఎమ్మెల్యే దృష్టికి తేవడంతోపాటు సచివాలయ సిబ్బంది పనితీరుపై తీవ్ర విమర్శలు చేశారు. దీనిపై స్పందించిన దామచర్ల వెంటనే సదరు సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, కమిషనర్ వెంకటేశ్వరరావు, కార్పొరేటర్ వేణుగోపాల్, ఆప్రాంత నాయకులు మోహన్‌తోపాటు ఆ డివిజన్ పరిధిలోని ఆయా రంగాలకు చెందిన ప్రముఖులు పలువురు హాజరయ్యారు. రెండు కార్యక్రమాల్లో ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ సిబ్బంది పాల్గొని ప్రజల పక్షాన పనిచేశారు.

మార్కాపురంలో ప్రజా సమస్యలు.. పరిష్కారాలు ఇవీ..

(3వ పేజీ తరువాయి)

గత ప్రభుత్వంలో తమకు వచ్చే పింఛన్‌ను రద్దు చేసి ఇబ్బందులు పాల్జేశారని ఒక వృద్ధుడు మరో వితంతువు ఆవేదన వ్యక్తం చేయగా కొత్త రేషన్ కార్డులు రాబోతున్నాయని, తదనుగుణంగా కొత్త పింఛన్‌దారులను ఎంపిక చేస్తామని తక్షణం వారికి మంజూరు జరుగుతుందని చెప్పారు. సచివాలయ సిబ్బందిపై కొన్ని విమర్శలు ఎదురుకాగా పనితీరు మెరుగు పర్చుకోకపోతే ఇబ్బందులు పడతారని హెచ్చరించారు. ఎమ్మెల్యే నారాయణరెడ్డితోపాటు మునిసిపల్ చైర్మన్ మురళీకృష్ణ, కమిషనర్ నారాయణరావు, వార్డు కౌన్సిలర్ లక్ష్మి, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ ఇబ్బందులు తొలగించండి

మొఘల్ ఫిదాహుసేన్‌బేగ్, 8వ వార్డు



కోర్టు కూడలిలో ఉన్న డివిజనల్ పంచాయతీ అధికారి కార్యాలయం శిథిలావస్థకు చేరింది. ప్రస్తుతం కూడలిలో భారీ వాహనాలు తిరగాలంటే ట్రాఫిక్‌కు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. కార్యాలయాన్ని తరలించి రహదారిని వెడల్పు చేస్తే ఎలాంటి ట్రాఫిక్ సమస్యలు ఉండవు. వార్డు పరిధిలోని చాలాచోట్ల 70 ఏళ్ల నుంచి మురుగు కాలువలు నిర్మించలేదు. మురుగునీటితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

కుక్కల బెడద తీవ్రంగా ఉంది

సయ్యద్ మహ్మద్ జునైద్, 8వ వార్డు



వార్డు పరిధిలో కుక్కల బెడద తీవ్రంగా ఉంది. మున్సిపాలిటీ వాళ్లు తూతూమంత్రంగా ఏదో కొన్నింటిని మాత్రమే పట్టుకుని తరలిస్తున్నారు. రైల్వే స్టేషన్ రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారింది. నూతన రహదారిని నిర్మించాలి.

అలుగు వద్ద బ్రిడ్జి నిర్మించాలి

ఆర్‌కేజే నరసింహులు, 7వ వార్డు



మార్కాపురం చెరువు అలుగు వద్ద పురాతన వంతెన రెండేళ్ల క్రితం పూర్తిగా కుంగిపోయింది. తాత్కాలిక మరమ్మతులు చేసి వదిలేశారు. చెరువునిండి అలుగు నుంచి నీరు పారితే ఈ బ్రిడ్జి ఎప్పుడైనా కూలుతుంది. నూతన బ్రిడ్జి నిర్మాణం చేస్తేనే ప్రయాణికులు ఇబ్బందులు లేకుండా రైల్వేస్టేషన్‌కు వెళ్లేందుకు మార్గం సుగమం అవుతుంది.

చెరువు కట్టపై లైట్లు అవసరం

షేక్ హబీబున్నీసా, 8వ వార్డు



మార్కాపురం చెరువుకట్టపై ప్రయాణం చేయాలంటే తీవ్ర అవస్థలు పడుతున్నాం. ముఖ్యంగా గుంతలమయమైన రహదారితోపాటు వీధిదీపాలు లేకపోవడంతో రాత్రివేళల్లో ప్రయాణం ప్రమాదకరంగా ఉంటోంది. అలుగు నుంచి డ్రైవర్స్ కాలనీ వరకు వీధి దీపాలు ఏర్పాటు చేయాలి.

రేషన్ కార్డు మంజూరు చేయండి

రెంటాల కుమారి, 7వ వార్డు



ఇంట్లో పనిచేసే వాళ్లు ఎవరూ లేరు. తండ్రి చనిపోయాడు. నేను వంట పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నా. తల్లికి వచ్చే పింఛన్ మాత్రమే మా కుటుంబానికి ఆసరా. రేషన్ కార్డు కోసం గతంలో పలుమార్లు అధికారులకు అర్జీలు పెట్టుకున్నా పట్టించుకోలేదు. రేషన్‌కార్డు మంజూరు చేయాలి.

ఇంటి నెంబర్‌ను మార్చాలి

ఆకుల రామాంజనేయులు, 7వ వార్డు



మా ఇంటి పక్కనున్న ఖాళీస్థలంలో ఇళ్లు కట్టుకున్న వారికి మా ఇంటి నెంబర్‌ను మున్సిపల్ రెవెన్యూ విభాగం కేటాయించింది. ఎక్కువ మొత్తంలో మాకు ఆస్తి పన్ను వస్తోంది. రెండు ఇళ్లకు ఆకుల పుల్లమ్మ అని పేరు ఉన్న మహిళలు కావడంతో ఈ సమస్య ఏర్పడింది. సమస్యను పరిష్కరించి ఎవరి పన్ను వారికి వేయాలి

వితంతు పింఛన్ ఇవ్వండి

అమ్మిశెట్టి లత, 7వ వార్డు



నా భర్త చనిపోయి ఐదేళ్లవుతోంది. వితంతు పింఛన్ కోసం ఐదేళ్ల నుంచి మున్సిపాలిటీ, సచివాలయాల చుట్టూ తిరుగుతున్నా. అయినా కనికరించడంలేదు. వితంతు పింఛన్ మంజూరు చేసి సాయం చేయాలి.

ఆధార్‌పై ఓ విద్యాసంస్థ ఆస్తులు

చిలుకూరి కృష్ణారెడ్డి, 8వ వార్డు



నా కుమారుడు వర్షిత్‌రెడ్డి ఆధార్‌పై పట్టణంలోని ఓ విద్యాసంస్థకు చెందిన ఆస్తులు నమోదయ్యాయి. దీంతో ప్రభుత్వం నుంచి మా కుటుంబం ఎలాంటి ప్రయోజనాలు పొందలేకపోతోంది. 80 ఏళ్ల వయసున్న మా తండ్రి పిచ్చిరెడ్డికి ఈ సమస్య కారణంగానే పింఛన్ తీసేశారు. ఆధార్‌పై నమోదైన విద్యాసంస్థ ఆస్తులను తొలగించాలి

గత ప్రభుత్వం పింఛన్ తీసేసింది

మూర్తి సుబ్బమ్మ, 7వ వార్డు



గతంలో వృద్ధాప్య పింఛన్ వచ్చేది. దాన్ని గత వైసీపీ ప్రభుత్వం తొలగించింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం వయసు మళ్లిన నాకు పింఛన్ ఇచ్చి ఆదుకోవాలి.

టిడ్కో జాబితాలో పేరు తొలగించారు

షేక్ నాసర్‌సాహెబ్, 8వ వార్డు



2017లో టిడ్కో ఇంటి కోసం రూ.500 డీడీ తీశాను. అప్పట్లో అర్హుల జాబితాలో తన పేరు ఉంది. కానీ గత వైసీపీ ప్రభుత్వహయాంలో నా పేరు జాబితా నుంచి తొలగించారు. కూటమి ప్రభుత్వంలోనైనా నాకు గృహాన్ని మంజూరు చేయాలి.

విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలి

కనిగిరి బాలవెంకటరమణ, 7వ వార్డు



స్థానిక ఆకులవారి వీధిలో రెండు చోట్ల విద్యుత్‌స్తంభాలు పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. పెద్దపాటి గాలులు వీస్తే స్తంభాలు విరిగి ప్రమాదం జరిగే అవకాశం ఉంది. నూతన స్తంభాలను ఏర్పాటు చేసి ప్రమాదాన్ని నివారించాలి. నా ఇంటి నెంబర్ 3-212 అయితే మున్సిపల్ రెవెన్యూ సిబ్బంది 3-312గా మార్చివేసి డిమాండ్ నోటీసు ఇచ్చారు. దాన్ని మార్చమంటే తాత్సారం చేస్తున్నారు.

రెండు కొళాయిల పన్ను వేస్తున్నారు

తుంబేటి సుబ్రహ్మణ్యం, 7వ వార్డు



నాకు రజకవీధిలో ఒక గృహం ఉంది. కానీ మున్సిపాలిటీ వాళ్లు నా ఇంటికి రెండు కొళాయి కనెక్షన్లు ఉన్నట్లు నీటిపన్ను కింద రెండు డిమాండ్ నోటీసులు పంపుతున్నారు. ఈ సమస్యను నేను పలుమార్లు సచివాలయం, మున్సిపాలిటీల్లో తెలియజేసినా ఎవరూ పట్టించుకోవడంలేదు. అదనపు కొళాయి కనెక్షన్‌ను తొలగించాలి.

ఉద్రిక్తత

(3వ పేజీ తరువాయి)

ఉంటున్నాం. మాజోలికి ఎవరూ రాలేదు. మీరెవరు?' అంటూ కార్పొరేషన్ సిబ్బందిపై వాగ్వాదానికి దిగారు.

● కలెక్టరేట్ ఎదుట నిరసన

మార్కెట్‌లో వ్యాపారాలను తొలగించడాన్ని నిరసిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో ప్రకాశం భవనం వద్ద కూరగాయల వ్యాపారులు నిరసన చేపట్టారు. ఆ సంఘ నాయకుడు చీకటి శ్రీనివాసులు మాట్లాడుతూ ఇక్కడ కొన్నేళ్లుగా వ్యాపారాలు చేసుకుంటున్నారని, అర్ధంతరంగా దుకాణాలు తొలగించడం ద్వారా వ్యాపారులు జీవనోపాధి కోల్పోతారని తెలిపారు. కార్పొరేషన్ అధికారుల వ్యవహరించిన తీరును తాము ఖండిస్తున్నామన్నారు.

● నిబంధనల ప్రకారమే వ్యాపారాలు చేయాలి

మార్కెట్‌లో ఆరుబయట వ్యాపారాలు నిషేధం. మునిసిపల్ నిబంధనల ప్రకారం బహిరంగ వేలంపాట ద్వారా షాపులు కేటాయించాం. దుకాణాలు పొందినవారు అందులో వ్యాపారాలు చేయడం లేదు. కొందరైతే అసలు పన్నులు కూడా చెల్లించడం లేదు. రెవెన్యూ సిబ్బంది అడిగితే తాము షాపులో ఉండటం లేదంటూ దురుసుగా వ్యవహరిస్తున్నారు. దీనిపై చర్యలకు సిద్ధమయ్యాం. ఇకపై ఎవరి దుకాణాల్లో వారే అమ్మకాలు చేసుకోవాలి. నిబంధనలు అతిక్రమించి బయట వ్యాపారాలు చేస్తే శాఖపరంగా చర్యలు తీసుకుంటాం. అందులో భాగంగానే తొలగింపు చేయాల్సి వచ్చింది.

- వెంకటేశ్వర్లు, ఓఎంసీ కమిషనర్

విడిదికి రాని విదేశీ పక్షులు

ఈ ఏడాది జనవరి ముగుస్తున్నా
వెలమవారిపాలేనికి రాని నైజీరియా బర్డ్స్
వాటి కోసం ఎదురుచూస్తున్న గ్రామస్థులు
వందల ఏళ్ల నుంచి కొనసాగుతున్న ఆనవాయితీకి బ్రేక్

బల్లికురవ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : బల్లికురవ మండలం వెలమవారిపాలెం అంటే ఠక్కును గుర్తుకొచ్చేది నైజీరియా విదేశీ పక్షులే. ఏటా జనవరిలో వచ్చి జూన్ వరకు అక్కడే చెట్లపై నివాసం ఉండి పిల్లలను చేసుకొని వాటికి రెక్కలు రాగానే తిరిగి స్వదేశానికి వెళుతుంటాయి. ఈ ఆనవాయితీ వందల ఏళ్ల నుంచి కొనసాగుతోంది. ఈ గ్రామం గుండ్లకమ్మ నదికి సమీపంలో ఉండడంతో పక్షుల నివాసానికి అనువుగా ఉండడంతో పక్షులు వందల సంఖ్యలో వస్తున్నాయి. అలాంటిది ఈ ఏడాది మాత్రం జనవరి ముగుస్తున్నా ఒక్క విదేశీ పక్షి కూడా రాలేదు. దీంతో గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


నైజీరియా పక్షులు రాక వెలవెలబోతున్న వెలమవారిపాలెం


గత ఏడాది చెట్లపై ఉన్న పక్షులు(ఫైల్)

చెట్లు లేకపోవడమే కారణమా?

ఎన్నో తరాల నుంచి వచ్చే విదేశీ పక్షులు ఈ ఏడాది వెలమవారిపాలెంకు రాకపోవడానికి ప్రధాన కారణం చెట్లు లేకపోవడమేనని పలువురు అనుమానిస్తున్నారు. ఏటేటా గ్రామంలో చెట్లు తగ్గిపోతున్నాయని అది గ్రహించే నైజీరియా పక్షులు రావడానికి విముఖత చూపాయని చర్చించుకుంటున్నారు.

నీటి కుంటను ఏర్పాటు చేసిన గ్రామస్థులు

పక్షులు వస్తాయన్న ఆశతో వాటి నివాసానికి వీలుగా గ్రామస్థులు నీటి కుంటను సైతం ఏర్పాటు చేశారు. పక్షులు వచ్చి గూళ్లలో గుడ్లు పెట్టి పిల్లలు చేసే వరకూ ప్రజలు వాటిని కన్నబిడ్డలవలే జాగ్రత్తగా చూసుకుంటారు. నైజీరియా నుంచి సుమారు అయిదు వేల కిలోమీటర్ల మేర ప్రయాణించి ఇక్కడకు తప్పకుండా వస్తున్న పక్షులు ఈ ఏడాది రాకపోవడంపై అందరూ ఆలోచిస్తున్నారు.



నకిలీ పత్రాలతో ఆస్తులు కాజేశారు!

మృతిచెందిన రోజే వీలునామా రాసినట్లు పత్రాలు
అనంతరం వాటిపైనే రిజిస్ట్రేషన్
ప్రస్తుతం ఆ స్థలం మార్కెట్ విలువ కోట్లలోనే
లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించిన బాధితులు


రిజిస్ట్రేషన్ జరిగిన నివాసం


బాధితుడు తిరుమలరావు

ఎర్రగొండపాలెం రూరల్ జనవరి 28 (ఆంధ్రజ్యోతి): పక్కనే ఉంటూ మంచి చెడ్డా చూడాల్సిన వ్యక్తులు దారుణాలు చేయడానికి వెనకాడటం లేదు. అందరూ ఉన్నా, అనాథ శవం అంటూ ఆస్తులన్నీ కాజేసిన ఘటన ఎర్రగొండపాలెంలో చోటుచేసుకొంది. బాధితులు కథనం మేరకు.. వెలగపూడి తిరుమలరావు, బ్రహ్మాజిలు అన్నాదమ్ములు. స్థానిక ఆర్అండ్బీ బంగ్లా సమీపంలో సర్వేనంబరు 58, 58-1లో 5 కుంటల స్థలం, నివాసంలో ఉంటున్నారు. అన్న తిరుమలరావుకు ఇద్దరు కుమార్తెలు వారు హైదరాబాదులో ఉంటున్నారు. తమ్ముడు బ్రహ్మాజి భార్య విడాకులు తీసుకొని వెళ్లిపోయింది. పెద్ద కుమారుడైన తిరుమలరావు అనారోగ్యం సరిగ ఉండకపోవంతో హైదరాబాద్‌లోని కుమార్తె వద్ద ఉంటున్నాడు. ఇక్కడ బ్రహ్మాజి ఒక్కడే ఉంటూ తన వృత్తి చేసుకుంటూ జీవిస్తున్నాడు. బ్రహ్మాజీకి కూడా ఇటీవల ఆరోగ్యం సరిగా లేకపోవడంతో గత ఏడాది అక్టోబరులో అన్న వద్దకు హైదరాబాద్ వెళ్లాడు. అక్కడ వైద్య పరీక్షలు చేయించుకొని మందులు తీసుకోని నవంబరు 3న తిరిగి ఎర్రగొండపాలెం వచ్చాడు. 4వ తేదీ అన్న తిరుమల రావు ఫోన్ చేస్తే తీయలేదు. 5న ఉదయం స్థానికులు తమ్ముడు మృతి చెందాడు అనే సమాచారంతో ఎర్రగొండపాలెం వచ్చి అంతిమ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం తిరుమల హైదరాబాద్ వెళ్లారు. అయితే తిరుమలరావు ఆరోగ్యం కూడ సరిగా లేకపోవడంతో ఆయన ఇక్కడ వ్యవహారం పెద్దగా పట్టించుకోలేదు. ఇదే అదునుగా భావించిన ఎర్రగొండపాలెం మండలం సర్వాయిపాలేనికి చెందిన దొడ్డపనేని శ్రీనివాసులు(తెలిసిన వ్యక్తి) నకిలీ పత్రాలు సృష్టించి తమ సోదరుడు బ్రహ్మాజీ వాటాకు వచ్చిన కోట్ల విలువైన ఆస్తులను వీలునామా ద్వారా రాయించుకున్నాడని ఆరోపించారు. నకిలీ ధ్రువపత్రాలు చూపి, శ్రీనివాసులు తన భార్య యోగమ్మ పేరున ఈ నెల 18వ తేదీన ఎర్రగొండపాలెంలోని స్థలాన్ని రిజిస్టర్ చేశారన్నారు. పంచాయతీ, రెవెన్యూ, రిజిస్ట్రేషన్ అధికారులు అందరు కలసి మోసం చేశారని ఆరోపిస్తూ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తిరుమలరావు తెలిపారు. ఈ విషయంపై ఎస్సై చౌడయ్యను వివరణ కోరాగా కేసులో లోతుగా విచారిస్తున్నట్లు తెలిపారు.

సిట్ కేసులో ఒకరి అరెస్టు

ఒంగోలు క్రైం, జనవరి28(ఆంధ్రజ్యోతి): ఫోర్జరీ డాక్యుమెంట్లు తయారు చేసి అక్రమంగా భూములు అమ్ముకున్న కేసులో బాపనపల్లి వెంకటేశ్వర్లును అరెస్టు చేసినట్లు విచారణాధికారి, యర్రగొండపాలెం సీఐ ప్రభాకర్ మంగళవారం తెలిపారు. ఒంగోలు నగర పరిధిలో ముక్తినూతలపాడు, పెళ్లూరు, చెరువుకొమ్ముపాలెం ప్రాంతాలలో ఉన్న భూములకు ఫోర్జరీ డాక్యుమెంట్లు తయారు చేసి కబ్జాలు చేసిన స్థానిక సుజాతనగర్‌కు చెందిన బాపనపల్లి వెంకటేశ్వర్లుపై వన్‌టౌన్‌లో కేసు నమోదైంది. అప్పటిలో ఆ కేసును యర్రగొండపాలెం సీఐ విచారణ చేశారు. నాటి నుంచి తప్పించుకొని తిరుగుతుండగా ఎట్టకేలకు నిందితుడిని అరెస్టు చేశారు.

బీమా సొమ్ము కోసమే హత్య

సీఐ వెంకటేశ్వర్లు

పొదిలి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : బీమా సంస్థల నుంచి క్లెయిం పొందేందుకు సొంత చెల్లెలను హత్యచేసిన ఘటన గతేడాది ఫిబ్రవరి 24న కాటూరివారిపాలెం సమీపంలో చోటుచేసుకొంది. రూ.1.13 కోట్ల పరిహారం కోసం ఈ ఘాతుకానికి సొంత అన్నే పాల్పడ్డారు. అప్పట్లో రోడ్డుప్రమాదంగా కేసు నమోదైంది. ఆ కేసు సంబంధించి వివరాలను సీఐ వెంకటేశ్వర్లు స్థానిక పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు.

కనిగిరి మండలం పునుగోడుకు చెందిన మాలపాటి అశోక్‌రెడ్డి, సంధ్య(25)లు అన్నాచెల్లెల్లు. సంధ్య కొన్ని కారణాలతో భర్త నుంచి విడిపోయి పుట్టింట్లోనే ఉంటోంది. ఈ క్రమంలో అశోక్‌రెడ్డి రియల్ ఎస్టేట్ చేస్తూ, అప్పులపాలయ్యాడు. అయితే తన సోదరి సంధ్య పేరుతో రూ.1.13 కోట్లు బీమా చేయించాడు. ఆ బీమా సొమ్ము క్లెయిం చేసుకొంటే తన అప్పుల నుంచి బయటపడవచ్చని పథకం రచించాడు. సంధ్యకు ఆరోగ్యం బాగాలేకపోవడంతో గత ఏడాది ఫిబ్రవరి 4న ఒంగోలు ఆసుపత్రికి తీసుకెళ్లాడు. తిరిగి స్వగ్రామం కనిగిరి మండలం పునుగోడు వస్తున్నారు. ఈ క్రమంలో చెల్లెలికి హాస్పిటల్‌లో ఇచ్చిన మాత్రలు కాకుండా మత్తుమాత్రలు ఇచ్చాడు. ఆమె నిద్రలోకి చేరుకున్న తరువాత అశోక్‌రెడ్డి కాటూరివారిపాలెం సమీపంలో కారు ఆపి కారులో ఉన్న దిండుతో ఆమెకు ఊపిరి ఆడకుండా చేసి గొంతునులిమి హత్య చేశాడు. అనంతరం కాటూరివారిపాలెం సమీపంలో కారుతో ఓ చెట్టును ఢీకొట్టాడు. ఘటనను రోడ్డు ప్రమాదంగా చిత్రీకించారించాడు. ప్రమాదంలో సంధ్య మృతిచెందినట్లు అశోక్‌రెడ్డి కథ అల్లాడు. ఆయనకు స్వల్పగాయాలు కావడంతో గుంటూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స తీసుకున్నాడు. కొన్ని రోజుల తరువాత స్నేహితుడు మాలకొండారెడ్డికి ఈ విషయం చెప్పి సాయం కోరాడు. పోస్టుమార్టం రిపోర్ట్‌లో పూర్తి విషయాలు తెలుస్తాయని సంధ్యను నువ్వే హత్య చేసినట్లు రిపోర్ట్ వస్తుందని స్నేహితుడు మాలకొండారెడ్డి చెప్పాడు. దీంతో దొరికిపోతాననే భయంతో మాలకొండారెడ్డి సహాయంతో ఆసుపత్రిలో తోటిగా విధులు నిర్వహిస్తున్న యూసఫ్‌తో మాట్లాడి శవపరీక్షలో సీజ్ చేసిన అవయవాలను మార్చు చేసేందుకు రూ.3.50 లక్షలకు బేరం కుదుర్చుకున్నారు. అందులో రూ.3 లక్షలు యూసఫ్‌కు ఇచ్చారు. అనుకున్న ప్రకారం సంధ్య అవయవాలను మరోకవ్యక్తికి మార్చి రిపోర్ట్ కోసం పంపారు. అయితే వైద్యులకు అనుమానం రావడంతో పోలీసులకు ఉప్పందించారు. పోలీసులు అప్పటినుంచి అనుమానంతో అశోక్‌రెడ్డిపై నిఘాపెట్టారు. వారి విచారణలో అశోక్‌రెడ్డి ఉద్దేశ్యపూర్వకంగా హత్యచేసినట్లు తేలడంతో అశోక్‌రెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. సహకరించిన మాలకొండారెడ్డి, యూసఫ్‌ల కోసం గాలిస్తున్నారు.


మాట్లాడుతున్న సీఐ వెంకటేశ్వర్లు


సంధ్య మృతదేహం(ఫైల్)

వాస్తవాలు వెలుగుచూశాయి ఇలా..

ఘటన జరిగిన తర్వాత కారులోని రెండవ వ్యక్తి అయిన అశోక్‌రెడ్డికి స్వల్పగాయాలే అయ్యాయి. దీంతో పాటు సంధ్య మృతదేహంపై కూడా ఎక్కడ బలమైన గాయాలు లేవు. ఘటన అనంతరం మార్చురీలోని తోఫీ కూడా విధులకు దూరంగా ఉంటున్నాడు. దీనికి తోడు పోస్టుమార్టం రిపోర్టు కోసం వైద్యులపై అశోక్‌రెడ్డి ఒత్తిడి తెస్తుండడంతో వారికి అనుమానం వచ్చి పోలీసుల వద్ద వైద్యులు అనుమానం వ్యక్తం చేశారు. తొలి నుంచి అశోక్‌రెడ్డి వైఖరిపై అనుమానం ఉన్న పోలీసులు మరింత లోతుగా విచారించారు. గ్రామంలో విచారించే క్రమంలో అశోక్‌రెడ్డి రియలెస్టేట్ పేరుతో జులాయిగా తిరుగుతుంటాడని తెలిసింది. మృతి చెందిన సంధ్య పేరుతో కొంత కాలం క్రితం పెద్దమొత్తంలో బీమా చేశారని తెలియడంతో పోలీసులు అశోక్‌రెడ్డిని వారిదైన శైలిలో విచారించడంతో విషయాలు వెలుగుచూశాయి.

చెల్లెమ్మతోటలో చోరీ

- **మూడు ఇళ్లలో 36 సవర్ల బంగారం, 5 కేజీలకుపైగా వెండి, రూ.1.40 లక్షల నగదు అపహరణ**


చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న డీఎస్పీ

టంగుటూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : టంగుటూరు చెల్లెమ్మతోటలోని మూడు వేర్వేరు ప్రాంతాల్లోని గృహాల్లో వరుసగా ఆదివారం అర్ధరాత్రి ఒకే విధంగా జరిగిన అపహరణ ఆలస్యంగా వెలుగు చూసింది. జనసంచారం లేని ఇళ్లను చూసుకొని చోరీకి పాల్పడుతున్నారు. దుండగులు చెల్లెమ్మ తోటలోని బెల్లం రామయ్య గృహంలో 19 సవర్ల బంగారం, రూ.లక్ష నగదు, వెండి 5 కేజీలు, చాకిరేవు కట్ట సమీపంలోని దామచర్ల హనుమాయమ్మ ఇంట్లో 17 సవర్ల బంగారం, రూ.20వేల నగదు అపహరణకు పాల్పడ్డారు. బీసీడి బజారులోని పత్తిపాటి బ్రహ్మానందం గృహంలో 30 గ్రాములు వెండి, రూ.20వేలు చోరీ చేశారు. బాధితుల ఫిర్యాదుల మేరకు టంగుటూరు ఎస్సై నాగమల్లీశ్వరరావు క్లూస్‌టీంను రంగంలోకి దించారు. మూడు గృహాల్లో క్లూస్‌టీం, ఎస్సై శరత్‌కుమార్ పరిశీలించారు. దీనిపై ఎస్సై నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ దామచర్ల హనుమాయమ్మ తన ఇంట్లో 17 సవర్లు బంగారం చోరీకి గురైనట్లు ఫిర్యాదు చేశారని చెప్పారు. మిగిలిన ఇద్దరి నుంచి ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

గీతకార్మికుల మద్యం దుకాణానికి దరఖాస్తుల స్వీకరణ


మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ శివకుమారి

సింగరాయకొండ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : సింగరాయకొండ ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయం పరిధిలోని పొన్నలూరుకు కేటాయించిన గీత కార్మికుల మద్యం దుకాణానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ మేడికొండ శివకుమారి తెలిపారు. మంగళవారం స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. ఫిబ్రవరి 5 మధ్యాహ్నం వరకూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఆఫ్‌లైన్‌లో సింగరాయకొండ సర్కిల్ కార్యాలయంలో కూడా దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ఒక్కో అప్లికేషన్‌కు రూ.2 లక్షలు చెల్లించాలని చెప్పారు. ఫిబ్రవరి 7వ తేదీన ఒంగోలులో కలెక్టర్ తమీమ్ అన్సారియా సమక్షంలో లాటరీ తీసిన అనంతరం దుకాణం కేటాయించనున్నట్లు వివరించారు.

ప్రమాదాల నివారణకు ఆటోతో ప్రచారం

కొండపి, జనవరి28 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు, కూలీలు ప్రమాదాల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు వివరిస్తూ కొండపి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి.సోమశేఖర్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది మంగళవారం గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. పరిమితికి మించి ఆటోల్లో కూలీలు ఎక్కవద్దని, పొగాకు పచ్చాకు ట్రాక్టర్లు, కట్టెల ట్రాక్టర్లు యజమానులు, చోదకులు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

- పొన్నలూరులో... పొగాకు పచ్చాకు ట్రాక్టర్లలో ప్రయాణిస్తున్న కూలీలకు, ఆటోల్లో ప్రయాణించే కూలీలకు ఎస్సై అనుక్ కౌన్సెలింగ్ నిర్వహించారు.

ప్రజా చైతన్యమే ప్రగతికి మార్గం

- **సందేశాత్మకంగా జారుడు మెట్లు నాటకం**
- **అలరించిన చిన్నారుల నృత్యాలు**

ఒంగోలు కల్చరల్, జనవరి28(ఆంధ్రజ్యోతి): ప్రజా చైతన్యంతోనే సమాజంలో, పాలకులలో మార్పు వచ్చి సామాన్యుల జీవితాలు ప్రగతిపథంలో నడుస్తాయని, నాటి స్వాతంత్ర్య ఫలాలు సామాన్యులకు అందాలంటే ఓటు అనే ఆయుధాన్ని సక్రమంగా ఉపయోగించాలనే సందేశంతో ప్రేక్షకులను ఆకట్టుకుంది జారుడుమెట్లు నాటకం. ఒంగోలులోని పీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఎన్టీఆర్ కళాపరిషత్ ఉత్సవాలలో భాగంగా మంగళవారం రాత్రి ఈ నాటకం ప్రదర్శితమైంది. కళాంజలి హైదరాబాద్ నటీనటులు నటించిన ఈ నాటకాన్ని కంచర్ల సూర్యప్రకాష్ రచించగా, కొల్లా రాధాకృష్ణ దర్శకత్వం వహించారు. ఎంతోమంది స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలతో తెల్లదొరతనం పోయి దేశానికి స్వాతంత్ర్యం లభించిందని, అయితే నల్లదొరలు తమ స్వార్థాన్ని చూసుకుంటూ నాయకులు స్కాములు చేస్తూ దేశసంపద సామాన్యలకు దక్కకుండా చేస్తున్నారని, ఈ పరిస్థితి మారాలంటే నిజాయితీపరులైన పాలకులను ఓటు ద్వారా ప్రజలు ఎన్నుకోవాలనే సందేశంతో కొనసాగిన ఈ నాటకం ప్రేక్షకుల కరతాళధ్వనులందుకుంది. నటీనటులు చక్కని సంభాషణా చాతుర్యం, ఆహార్యంతో అలరించారు.

ఇక ఎండ్లూరుకు చెందిన శ్రీరామభక్త కోలాట బృందం సభ్యులు దాదాపు 40 మంది మాస్టర్ తోట స్వాములు ఆధ్వర్యంలో ప్రదర్శించిన కోలాటం, కొండపి శ్రీదత్తాత్రేయ నాద స్వర బృందంచే ఏర్పాటు చేసిన నాద స్వర కచేరి ప్రేక్షకులను అలరించాయి. అనంతరం దర్శి ప్రశాంతి ఉన్నత పాఠశాల వారు సైతం కోలాటాన్ని ప్రదర్శించారు. ఇక స్థానిక అపెక్స్ ఒలింపియాడ్ పాఠశాల విద్యార్థులు, శ్రీగీతాంజలి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఎన్టీఆర్ కళాపరిషత్ అధ్యక్షుడు ఈదర హరిబాబు కార్యక్రమాలను పర్యవేక్షించి ప్రదర్శన సంస్థలకు ప్రదర్శనా పారితోషికం, జ్ఞాపికలను బహూకరించారు.


స్కూలు విద్యార్థుల నృత్యం

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- **విభిన్న ప్రతిభావంతుల ఏడీ అర్చన**

సింగరాయకొండ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విభిన్న ప్రతిభావంతుల, వయోవృద్ధుల సహాయ సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ అర్చన సూచించారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో మంగళవారం విభిన్న ప్రతిభావంతులకు అవసరమైన ఉపకరణాల మంజూరు నిమిత్తం గుర్తింపు శిబిరం జరిగింది. ఈ కార్యక్రమంలో 350 మంది దివ్యాంగులు పాల్గొని వారికి అవసరమైన ఉపకరణాల కోసం నమోదు చేసుకున్నారు. ఈ శిబిరంలో బ్యాటరీ ట్రై సైకిల్స్, వీల్ ఛైర్స్, ట్రై సైకిల్స్, సంకకర్రలు, చేతి కర్రలు, చెవిటి మిషన్‌లు అందించడం కోసం అలింకో సంస్థ కొలతలు తీసుకున్నారు. త్వరలో లబ్ధిదారులకు వాటిని అందిస్తామని అర్చన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో డి.జయమణి, టీడీపీ నేతలు కూనపరెడ్డి సుబ్బారావు, చీమకుర్తి కృష్ణ, గుదే వెంకటేశ్వర్లు, అబ్దుల్ అజీమ్ పాల్గొన్నారు.


శిబిరానికి వచ్చిన విభిన్న ప్రతిభావంతులు

సమగ్ర సమాచారం అందించాలి

- **కలెక్టర్ తమీమ్ అన్సారియా**


మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా, పక్కన జేసీ గోపాలకృష్ణ

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రజాప్రతినిధులు ప్రస్తావించిన సమస్యలకు సత్వర పరిష్కారం చూపడంతో పాటు అందుకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని తనకు అందించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. వచ్చేనెలలో డీఆర్సీ సమావేశం జరగనున్న నేపథ్యంలో మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణతో కలిసి ఆయా శాఖల అధికారులతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గత ఏడాది నవంబరులో జరిగిన డీఆర్సీ సమావేశంలో ప్రజాప్రతినిధులు ప్రస్తావించిన సమస్యల పరిష్కారానికి తీసుకున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. దీంతో పాటు వచ్చే సమావేశానికి అన్నిశాఖల ఉన్నతాధికారులు పూర్తి స్థాయిలో సమాచారంతో సన్నద్ధం కావాలని చెప్పారు. అందుకోసం ఇప్పటి నుంచే క్షేత్ర స్థాయి సిబ్బందితో సమీక్షా సమావేశాలు నిర్వహించి సమగ్ర సమాచారాన్ని అందుబాటులో ఉంచుకోవాలని దిశానిర్దేశం చేశారు. సమావేశంలో డీఆర్వో చిన ఓబులేషు, సీపీఏ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రతి పంచాయతీలో ఆదర్శపాఠశాల

ప్రతి గ్రామ పంచాయతీలో ప్రైమరీ పాఠశాలల్లో 60 మంది విద్యార్థులు నమోదు ఉంటే ఆ పాఠశాలను ఆదర్శ పాఠశాలగా మార్చాలని కలెక్టర్ ఆదేశించారు. స్థానిక కలెక్టర్ చాంబర్‌లో ఎంఈవోలతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. పాఠశాలల పునఃనిర్మాణ ప్రక్రియేలా జరుగుతుందో నిరంతరం పరిశీలించాలన్నారు. గతంలో ఉన్న 117 జీవోను ఉపసంహరిస్తూ జారీచేసిన మెమో ప్రకారం ఆ సూచనలు తప్పకుండా పాటిస్తూ డెస్క్ వర్క్ పూర్తి చేయాలని చెప్పారు. ఏ పాఠశాల మూతపడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రాథమికోన్నత పాఠశాలల్లో 6,7,8 తరగతుల విద్యార్థులను సమీప ఉన్నత పాఠశాలకు బదిలీ చేసేటప్పుడు రవాణా భత్యం వారికి మంజూరు చేయాలన్నారు. సమావేశంలో డీఈవో కిరణ్‌కుమార్, డిప్యూటీ డీఈవోలు, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

గీత కార్మికులకు రెండు మద్యం దుకాణాలు : ఎక్సైజ్ సీఐ



మాట్లాడుతున్న సీఐ సుకన్య

చీమకుర్తి, జనవరి28(ఆంధ్రజ్యోతి) : కల్లు, గీత కార్మికులకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు మద్యం దుకాణాల కేటాయింపునకు నోటిఫికేషన్ జారీ చేసింది. మంగళవారం చీమకుర్తి ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో సీఐ సుకన్య మాట్లాడుతూ సర్కిల్ పరిధిలోని సంతనూతలపాడు, మద్దిపాడు మండలాలకు రెండు మద్యం దుకాణాలు కేటాయించినట్లు చెప్పారు. నూతన ప్రకాశం జిల్లాకు చెందిన గౌడ కులస్థులు అర్హత కలవారు ఎవరైనా సంతనూతలపాడు మండలానికి కేటాయించిన దుకాణానికి, గమళ్ల కులస్థులు మద్దిపాడు దుకాణానికి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఫిబ్రవరి 5వ తేదీ వరకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో రూ.2లక్షల అప్లికేషన్ ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చని, లాటరీలో దుకాణం దక్కితే రూ.25లక్షలు చెల్లించాల్సి ఉందన్నారు. ఆసక్తి గల సదరు కులస్థులు కులం, ఉపకులం, నేటివిటి సర్టిఫికెట్లతో దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు.

కిమ్స్ వైద్యశాలలో అరుదైన ఆపరేషన్



సమావేశంలో మాట్లాడుతున్న వైద్యులు

ఒంగోలు(రూరల్), జనవరి28(ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని కిమ్స్ వైద్యశాలలో ఓ మహిళ పొట్ట భాగంలో నుంచి 15కేజీల కణితను విజయవంతంగా వైద్యులు తొలగించారు. ఇది అరుదైన ఆపరేషన్ అని వారు తెలిపారు. మంగళవారం స్థానిక కిమ్స్ వైద్యశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గ్యాస్ట్రో వెంటరాలజీ, లాప్రాస్కోపిక్ సర్జన్ డాక్టర్ కార్తిగ్ బాబు, ప్రసూత వైద్య నిపుణులు సుజని మాట్లాడుతూ 40 ఏళ్ల వయస్సు గల మహిళ వాంతులు, తీవ్రమైన కడుపునొప్పి, ఉబ్బరంతో వైద్యశాలకు వచ్చినట్లు చెప్పారు. వైద్యపరీక్షలు నిర్వహించగా పొత్తి కడుపు కింద భాగంలో కణిత ఉందని, దానిని తొలగించడం ఎంతో క్లిష్టమైన ప్రక్రియని పేర్కొన్నారు. ఈక్రమంలో వైద్యులు ఇమ్రాన్, రామకృష్ణ, అనూష ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించారని, ప్రస్తుతం సదరు మహిళ ఆరోగ్యంగా ఉన్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మెడికల్ డైరెక్టర్ డాక్టర్ శ్రీహరిరెడ్డి, వైద్యశాల సీవోవో అంకిరెడ్డి పాల్గొన్నారు

అక్రమంగా పైపులైన్ ఏర్పాటు.. అడ్డగింత





పైపులైన్ ఏర్పాటును అడ్డుకున్న నీటిసంఘాల అధ్యక్షులు

సంతనూతలపాడు, జనవరి 28(ఆంధ్రజ్యోతి): మండలంలో పేర్నమిట్ట లింగారెడ్డికాలనీ సమీపంలోని అమరావతినగర్ వద్ద ఎన్ఎస్‌పీ కాలువలో ఎటువంటి అనుమతులు లేకుండా ఒంగోలు నగరపాలక సిబ్బంది మంగళవారం మురుగునీటి పారుదలకోసం పైపులైన్‌లు వేశారు. ఈక్రమంలో సమాచారం అందుకున్న ఒంగోలు ఎన్ఎస్‌పీ నీటిసంఘం అధ్యక్షులు నల్లూరిక్రిష్ణారావు, పేర్నమిట్ట 3వ ఎన్ఎస్‌పీ నీటిసంఘం అధ్యక్షులు మాదాసు వెంకటరమణ, ఉపాధ్యక్షులు పర్వతరెడ్డి శ్రీనివాసరావు, డైరెక్టర్ గంగిశెట్టి శివయ్య, జనసేన నాయకులు కందుకూరి వాసులు వాటిని అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనావాసాల నుంచి వచ్చే మురుగు ప్రస్తుతం వేస్తున్న పైపుల ద్వారా సమీపంలోని పంటపొలాలకు, చెరువుకు వెళ్లే ప్రమాదముందని చెప్పారు. దీనివల్ల ప్రజలు, పశువులు అనారోగ్యం బారిన పడేప్రమాదముందని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే జిల్లా ఎన్ఎస్‌పీ సూపరింటెండెంట్ వరలక్ష్మి, చీమకుర్తి ఎన్ఎస్‌పీ ఇన్‌చార్జ్ ఏఈ రామక్రిష్ణ, ఒంగోలు డీఈ సతీష్, జేఈ కిరణ్ తమ సిబ్బందితో వచ్చిన నగరపాలక సిబ్బంది వేసిన పైపులైన్లను తొలగించి గుంతలను పూడ్చివేయించారు. నగరపాలక సిబ్బంది తీరు ప్రజలకు నష్టం వాటిల్లేవిధంగా ఉండకూడదని నీటిసంఘాల అధ్యక్షులు తెలిపారు.

మిరపలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



పులికొండలో మిరపపంటను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖాధికారులు

చీమకుర్తి, జనవరి28(ఆంధ్రజ్యోతి): మిరప పంటలో సస్యసంరక్షణా చర్యలు సకాలంలో చేపట్టి దిగుబడులు పెంచుకోవాలని ఏవో భాస్కర్, ఉద్యానశాఖాధికారి సంధ్య సూచించారు. మండలంలోని పులికొండ, బూదవాడ గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. మిరప, పొగాకు తదితర పంటలను వ్యవసాయ అధికారులు పరిశీలించారు. మిరపలో తామరపురుగు, తెల్లదోమ నివారణకు మందులను వారు సూచించారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

శనగ, వరి పంటల పరిశీలన

కొండపి: మండలంలోని పెరిదేపి, ముప్పరాజుపాలెం గ్రామాల్లో రైతులు సాగు చేసిన వరి, శనగ పంటలను వ్యవసాయ అధికారి డి.విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది మంగళవారం 'పొలం పిలుస్తోంది'లో భాగంగా పరిశీలించారు. శనగలో ఎండు తెగులును గుర్తించి నివారణ చర్యలు వివరించారు.

ఆరోగ్య పెన్షన్ల పరిశీలన

పీసీపల్లి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో ప్రభుత్వం నుంచి ఆరోగ్య పెన్షన్లు అందుకుంటున్న లబ్ధిదారులను ప్రత్యేక వైద్య బృందం మంగళవారం తనిఖీ చేసింది. గుదేవారిపాలెం, నేరేడుపల్లి, మురుగుమ్మి, గుంటుపల్లి తదితర గ్రామాల్లో 18మంది పక్షవాతం, ఇతర అనారోగ్య కారణాలతో నెలకు 15,000 రూపాయల వంతున ఆరోగ్య పెన్షన్లు పొందుతున్నారు. అయితే ఈ ఆరోగ్య పెన్షన్లలో గత ప్రభుత్వంలో అక్రమాలు జరిగాయని భావించిన కూటమి ప్రభుత్వం తనిఖీకి ఆదేశించింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రత్యేకంగా నియమించిన డాక్టర్ల బృందం ఆయా గ్రామాలకు చేరుకుని పెన్షన్ పొందుతున్న వ్యక్తులను క్షుణ్ణంగా పరిశీలించారు. వారు ఎదుర్కొంటున్న అనారోగ్య సమస్యలు, వారి దగ్గర ఉన్న ట్రీట్‌మెంట్‌కు సంబంధించిన పత్రాలు, ప్రస్తుతం వారు ఉన్న ఫిట్‌నెస్ స్థితిని పరిశీలించి రికార్డు చేశారు.

నిధుల గోల్‌మాల్‌పై విచారణ

కురిచేడు, జనవరి 28(ఆంధ్రజ్యోతి): కురిచేడు పంచాయతీ కార్యాలయంలో నిధులు గోల్‌మాల్‌తో పాటు తనను కులం పేరుతో దూషించారంటూ సర్పంచ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం డీఎస్పీ లక్ష్మీనారాయణ విచారించారు. సర్పంచ్ కేసనపల్లి కృష్ణయ్య, పంచాయతీ కార్యదర్శి చాంద్‌బీలను నిధులు గోల్‌మాల్‌పై, సర్పంచ్ సంతకం ఫోర్జరీ అయిందా లేదా అనే విషయంపై ఆరా తీశారు. ఓ చెక్కు సైతం మిస్ అయినట్లు గుర్తించారు. నిధుల రికవరీపై చేయాలనే విషయంపై చర్చించారు. ఆయన వెంట ఎస్ఐ శివ ఉన్నారు.

శిథిలావస్థలో వంతెన

పడిపోయిన రక్షణ గోడలు ● వాహనదారుల ఆందోళన



సాగర్ కాలువపై రక్షణ గోడలు లేని వంతెన

ఒంగోలు(రూరల్), జనవరి28(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరంలోని చెత్తను డంపింగ్‌యార్డుకు తరలించే మార్గంలో గల సాగర్ కాలువపై గల వంతెన శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారింది. దీనికితోడు ఈ వంతెన రక్షణ గోడలు కూలిపోయి ఉండటంతో ఈ మార్గంలో వెళ్లే వాహనదారులు నిత్యం భయాందోళన చెందుతున్నారు. ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్న వాహనాలు సాగర్ కాలువలో పడే ప్రమాదం ఉంది. ఇప్పటికే పలు సందర్భాల్లో వాహనదారులు ప్రమాదాలకు గురయ్యారు. కాగా ఈ రోడ్డులో నిత్యం ఒంగోలు నుంచి చెత్తను తరలించే లారీలు, ట్రాక్టర్లు, ఇక మండలంలోని కరవది, ఉలిచి, చేజర్ల, దేవరంపాడు, బీవీ.పాలెం, గుండాయపాలెం, పాతపాడు గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వంతెనకు పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

ఫొటోగ్రాఫర్స్‌కు అండగా ఉంటా

● ఎమ్మెల్యే దామచర్ల



పర్వేజ్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఫొటోగ్రాఫర్లకు అన్ని విధాలుగా అండగా ఉంటానని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. స్థానిక టీటీడీ కళ్యాణ మండపంలో మంగళవారం ది ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే దామచర్ల మాట్లాడుతూ రానున్న రోజుల్లో నగరంలో అందజేసే రెండు సెంట్ల ఇళ్ల స్థలాల్లో ఫొటో గ్రాఫర్లకు కూడా ప్రాధాన్యత కల్పిస్తానని తెలిపారు. పోస్టల్‌శాఖ కల్పిస్తున్న గ్రూపు ఇన్సూరెన్స్ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం గుర్తింపుకార్డులను అందజేశారు. కార్యక్రమంలో ఎం.సత్యం, ఉదయ హరిబాబు, అధ్యక్షుడు స్పందన వెంకట్రావు, కార్యదర్శి చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు ఉప్పుటూరి చంద్ర, వెంకటేశ్వర్లు, కోశాధికారి రసూల్, భాస్కర్, పొదిలి శ్రీనివాస్ పాల్గొన్నారు. అంతకుముందు కానన్ కెమెరా కంపెనీ ట్రైనర్ మాస్టర్ షేక్ పర్వేజ్ నూతన కెమెరాల సాంకేతికతపై అవగాహన కల్పించారు.

నిరుపేద విద్యార్థుల కోసం ఉచిత విద్య, వసతి

కమ్మవారి సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ



స్టడీ మెటీరియల్‌ను ఆవిష్కరిస్తున్న సంఘ కార్యవర్గం, ట్రస్టు ప్రతినిధులు

ఒంగోలు కల్చరల్, జనవరి28(ఆంధ్రజ్యోతి): నిరుపేద కమ్మ విద్యార్థులు ముఖ్యంగా బాలికల కోసం జిల్లాలో ఉచిత హాస్టల్‌ను ఏర్పాటు చేసి వారికి ఉచితంగా విద్యను కూడా అందించేందుకు కృషి చేస్తున్నట్లు జిల్లా కమ్మవారి సేవా సంఘం అధ్యక్షుడు మండవ మురళీకృష్ణ చెప్పారు. మంగళవారం ఒంగోలులోని లాస్య గ్రాండ్ రెస్టారెంట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హైదరాబాద్ కాకతీయ విద్యా ట్రస్ట్, విజయవాడ కమ్మవారి సేవా సంఘ ప్రతినిధులతో కలిసి ఆయన 10వ తరగతి స్టడీ మెటీరియల్ ఆవిష్కరించారు. అనంతరం పేద విద్యార్థినికి రూ.20 వేల ఆర్థిక సహాయాన్ని సంఘం తరఫున అందజేశారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ కాకతీయ విద్యా ట్రస్ట్ ప్రస్తుతం కృష్ణా జిల్లా పెనమలూరు, గుంటూరు జిల్లా కోటప్పకొండ తదితర ప్రాంతాల్లో బాలికల వసతి గృహం ఏర్పాటుచేసి ఎంతోమంది పేద విద్యార్థులకు సహాయ కార్యక్రమాలు చేస్తున్నదని తెలిపారు. ఈక్రమంలో జిల్లాలో కూడా ఏర్పాటు చేసేందుకు తమ సంఘం తరపున కృషి చేస్తున్నట్లు చెప్పారు. కాకతీయ విద్యాట్రస్ట్ చైర్మన్ గూడూరు సత్యనారాయణ మాట్లాడుతూ జిల్లా నుంచి పంపితే ఆయా హాస్టళ్లలో అవకాశం ఇస్తామని తెలిపారు. అనంతరం ఒంగోలు డీఆర్ఆర్ఎం ఉన్నత పాఠశాల, ఉలిచి జడ్పీ హైస్కూలు విద్యార్థులకు విద్యాశాఖ రూపొందించిన 10వ తరగతి స్టడీ మెటీరియల్‌ను వారు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో దప్పల పూడి జగదీష్, గుమ్మడి రాధాకృష్ణ, కనకమేడల శ్రీనివాసరావు, వినుకొండ రాధాకృష్ణమూర్తి, అనుమూరు వీరయ్య, కమ్మవారి సేవా సంఘ గౌరవ అధ్యక్షుడు చిడిపోతు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి ఆలా హనుమంతరావు, కన్వీనర్ కాట్రగడ్డ రఘుపతిరావు, ఉపాధ్యక్షులు అబ్బూరి నవీన్‌కుమార్, పావులూరి బాపయ్య చౌదరి, నాగబోయిన భాస్కరరావు, కంచర్ల వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి

● కలెక్టర్‌కు వినతి



కలెక్టర్ అన్సారియాకు వినతిపత్రం అందజేస్తున్న పలు సంఘాల నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): దొనకొండ మండలం రుద్రసముద్రం గ్రామానికి చెందిన బాధిత ఎరుకల గిరిజన కుటుంబానికి న్యాయం చేయాలని పలు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు మాట్లాడుతూ ఎరుకల తెగకు చెందిన మాట వెంకటేశ్వర్లుపై తప్పుడు కేసులు పెట్టడమే కాకుండా కొందరు ఆయన ఇంటిపై దాడి చేశారన్నారు. అలాగే వెంకటేశ్వర్లు ఆటోపై పెట్రోలు పోసి దహనం చేశారని, ఈ ఘటనలో బాధ్యులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ అన్సారియాను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు పి.సత్యనారాయణ, జె.ఆంజనేయులు, చావలి సుధాకర్, సైదా నాయక్, దొడ్డా శ్రీనివాసరావు, దాసరి సుందరం, భీమవరపు సుబ్బారావు, పిన్నిక శ్రీనివాస్, ఎం.జార్జి, తాటిపర్తి వెంకటస్వామి, మస్తాన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

లెదర్ కర్మాగారాన్ని పునఃప్రారంభిస్తాం

● లిడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు

● యడవల్లిలో లెదర్ పార్కు పరిశీలన



మాట్లాడుతున్న లిడ్ క్యాప్ చైర్మన్ మాణిక్యరావు

గిద్దలూరు టౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మూతపడిన లెదర్ కర్మాగారాన్ని త్వరలో ప్రారంభిస్తామని లిడ్‌క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యాలరావు తెలిపారు. మంగళవారం రాచర్ల మండలంలోని యడవల్లి సమీపంలోని లీడ్‌క్యాప్ లెదర్ కర్మాగారాన్ని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. అనంతరం చైర్మన్ మాణిక్యాలరావు మాట్లాడుతూ మాదిగల పట్ల నాటి వైసీపీ ప్రభుత్వం వివక్షత చూపుతూ లెదర్‌పార్కుల అభివృద్ధిని మరిచిందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మాదిగల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఇటీవల గిద్దలూరు నియోజకవర్గంలోని లెదర్‌పార్కు తరలిపోతుందంటూ వస్తున్న వార్తలు అవాస్తవమన్నారు. మాదిగల అభ్యున్నతికి, వారి సంక్షేమానికి లెదర్‌పార్కు ఆవశ్యకత ఉందని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి తెలుపడంతో ఇక్కడే అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. ఇక్కడే అభివృద్ధి చేసి మాదిగలకు చేదోడుగా ఉంటామని భరోసా ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న లెదర్‌పార్కులను కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో తిరిగి అభివృద్ధి చేసి మాదిగల అభ్యున్నతికి తోడ్పాటు అందిస్తామన్నారు. ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి మాట్లాడుతూ నియోజక వర్గంలో 28వేలకు పైగా మాదిగ సామాజిక వర్గ ప్రజలు ఉన్నారని, ఇక్కడ ఉన్న లెదర్‌పార్కును అభివృద్ధి చేయడం వల్ల వారికి ఉపాధి కలుగుతుందని, ఈ విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన వెంటనే లిడ్‌క్యాప్ సహకారం అందిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. అలాగే ప్రధాన రహదారి నుంచి లెదర్‌పార్కు వద్ద రోడ్డు మార్గం ఏర్పాటు చేయాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి దృష్టికి తీసుకుపోవడంతో రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కలెక్టర్‌కు ఆయన ఆదేశాలు ఇచ్చారన్నారు. దీంతో కలెక్టర్ ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా రూ.70లక్షల నిధులు మంజూరు చేశారన్నారు. లిడ్‌క్యాప్ ప్రారంభానికి సహకారం అందిస్తున్న చైర్మన్ మాణిక్యాలరావుకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. లెదర్‌పార్కు అభివృద్ధికి సహకరిస్తానని, ఎటువంటి సమస్యలు లేకుండా లెదర్‌పార్కు భవన నిర్మాణాలు చేపడతామన్నారు. ఆక్రమణలకు గురైన భూమిని తిరిగి స్వాధీనం చేసుకుంటామన్నారు. లెదర్‌పార్కు కోసం ఏర్పాటు చేసిన 25 ఎకరాల భూమి చుట్టూ కంచె వేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అర్జున్‌నాయక్, ఏపీఈడబ్ల్యూఐడీసీ ఈఈ భాస్కర్‌రావు, రాచర్ల ఎంపీడీవో వెంకటరామిరెడ్డి, ఇన్‌చార్జి తహసీల్దార్ ఆంజనేయరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షులు కటికె యోగానంద్, భవనం పుల్లారెడ్డి, గుర్రం దానియేలు, పందిటి రజని, ప్రసన్నకుమార్, పాల్గొన్నారు.

క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

● డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో టి.వెంకటేశ్వర్లు ఆదేశించారు. స్థానిక వైద్యఆరోగ్యశాఖ కార్యాలయంలోని సమావేశపు హాలులో మంగళవారం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల అధికారులు, ఏఎన్ఎం లతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఏడాది నవంబరు 14నుంచి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు ప్రారంభమైన ఇంత వరకు కొన్ని ప్రాంతాల్లో లక్ష్యాలను పూర్తి చేయలేదన్నారు. అటువంటి ప్రాంతాల్లో వెంటనే పరీక్షలు పూర్తి చేయాలని చెప్పారు. ప్రస్తుతం అమలులో ఉన్న ఎన్‌సీడీ 30 యాప్‌లో ఆన్‌లైన్‌లో అన్ని వివరాలను అప్‌లోడ్ చేయాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్ర మంలో నోడల్ అధికారి డాక్టర్ భగీరథి, మాస్‌మీడియా అధికారి శ్రీనివాసరావు, ఎపిడమాల జిస్ట్ విక్టర్‌బాబు పాల్గొన్నారు.

స్కానింగ్ సెంటర్లు తనిఖీ

ఒంగోలు నగరంలోని ప్రైవేటు స్కానింగ్ సెంటర్లను డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్కానింగ్ సెంటర్లలో అనుమతులు లేకుండా పరీక్షలు నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రికార్డులను పరిశీలించారు.



స్కానింగ్ సెంటర్‌లో రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు, సిబ్బంది

11న ఎల్ఐసీ ఏజెంట్ల చలో ఢిల్లీ

ఒంగోలు(రూరల్), జనవరి28(ఆంధ్రజ్యోతి): ఎల్ఐసీ ఏజెంట్ల సమస్యల పరిష్కారానికి ఫిబ్రవరి 11న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు సంఘ నాయకులు తెలిపారు. మంగళవారం ఒంగోలులోని యూటీఫ్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఎల్ఐసీ ఏవోఐ రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు రాజశేఖర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న విధానాలతో ఏజెంట్లు తీవ్రంగా నష్టపోతున్నట్లు చెప్పారు. అందువల్ల ఏజెంట్లు చలో ఢిల్లీకి పెద్దఎత్తున తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు, నాయకులు కర్రి బాలచందర్, నల్లూరి వెంకట్రావు, శివయ్య, బి.వెంకట్రావు, ఎం.వెంకటేశ్వర్లు, సీహెచ్‌వీసు బ్బారెడ్డి, బసవయ్య, బి.కృష్ణమూర్తి, నరసింహారావు, కె.రమణారెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

మద్దిపాడు, జనవరి28(ఆంధ్రజ్యోతి): త్రోవగుంట అడ్డరోడ్డు వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలయ్యాయి. ఒంగోలు నుంచి పర్చూరుకు బైక్ వెళ్తున్న వై.రమాదేవికి లారీ అడ్డురావటంతో దానిని తప్పించబోయి డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో ఆమె గాయపడడంతో చికిత్స నిమిత్తం ఒంగోలులోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు.

గుండ్లాపల్లిలో మరొకరికి..

గుండ్లాపల్లి ఫ్లైఓవర్ దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో వంగులూరు మండలం తక్కెళ్లపాడుకు చెందిన సింగారపు వెంకటేష్ గాయపడ్డారు. మోటార్‌సైకిల్ లారీ వెనుక భాగాన్ని ఢీకొట్టడంతో లారీ చక్రాల మధ్య ఇరుక్కుని అతనికి తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న మద్దిపాడు ఎస్సై శివరామయ్య సంఘటనా స్థలానికి చేరుకుని తన సిబ్బందితో కలిసి వెంకటేష్‌ను బయటికి తీసి ఆసుపత్రికి తరలించారు.

విద్యార్థులకు మెరుగైన చదువు

మద్దిపాడు, జనవరి 28(ఆంధ్రజ్యోతి): పేద కమ్మ విద్యార్థులకు మెరుగైన వసతి, చదువు కల్పించటానికి కాకతీయ విద్యా ట్రస్ట్ నిరంతరం కృషి చేస్తుందని ట్రస్ట్ అధ్యక్షుడు గూడూరు సత్యనారాయణ పేర్కొన్నారు. మంగళవారం మద్దిపాడులోని గంటా శోభారాణి గృహంలో ట్రస్ట్ సమావేశాన్ని నిర్వహించారు. మాజీ సర్పంచ్ ఉప్పుగుండూరి నాగేశ్వర రావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ పేద కమ్మ విద్యార్థుల చదువుకు అయ్యే ఖర్చును తమ సంఘం భరించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కోటప్పకొండ కాకతీయ సేవా సంఘం కార్యదర్శి అనుమోలు వెంకయ్య, గుమ్మడి రాధాకృష్ణ, పొట్ల రాధాకృష్ణమూర్తి, చిడిపోతు వెంకటేశ్వర్లు, ఆలా హనుమంతరావు, విశ్రాంత విద్యాశాఖ అధికారి పీవీ.రాఘవరావు, అన్నమనేని సుబ్బారావు, కడియాల రఘుబాబు, ఈదర సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

వీవోఏల వేతన బకాయిలు చెల్లించాలి

ఒంగోలు నగరం, జనవరి 28(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వీవోఏలుగా పనిచేస్తున్న వారి ఆరు నెలలకు సంబంధించిన వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని వీవోఏల సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి దాసరి మహేష్ డిమాండ్ చేశారు. మంగళవారం ఒంగోలులోని ప్రగతిభవనంలోని వెలుగు పీడీ కార్యాలయం ఎదుట ఏపీ వెలుగు యానిమేటర్‌ల సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ తొలగించిన వీవోఏలను వెంటనే విధుల్లోకి తీసుకోవాలన్నారు. ప్రభుత్వ విధానాల కారణంగా సెర్ప్ అధికారులు వీవోఏల మీద హుకుం జారీ చేస్తున్నారని విమర్శించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.శ్రీనివాసులు మాట్లాడుతూ తొలగించిన వీవోఏలను తిరిగి తీసుకోవాలని విన్నవించినా ఫలితం లేదన్నారు. అనంతరం పీడీ కార్యాలయం ఏవోకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆనంద్, బెహర నా, ఫ్లోరా తదిత రులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ



స్టడీ మెటీరియల్‌ను అందజేస్తున్న నాయకులు

జరుగుమల్లి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కామేపల్లి గ్రామంలోని జడ్పీస్కూల్‌లోని పదవ తరగతి విద్యార్థులకు మంగళవారం స్టడీ మెటీరియల్ అందజేశారు. స్టడీ మెటీరియల్‌తో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎస్టీయూ (ఏపీ) సంఘం అసోసియేట్ అధ్యక్షుడు నర్రా కోటేశ్వరరావు అన్నారు. కార్యక్రమంలో ఎంఈవో డోలా శ్రీనివాసరావు, సంఘం మండల బాధ్యుడు శ్రీనివాసులు , స్కూల్ హెచ్ఎం అనూరాధ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'అరవింద'లో ఆధునిక వైద్యం



అభివాదం చేస్తున్న వైద్యులు, సిబ్బంది

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని అరవింద సూపర్ స్పెషాలిటీ హాస్పటల్‌లో ఎటువంటి కోతలు, కుట్లు, సైడ్ ఎఫెక్టులు లేకుండా ఎండిస్కోపిక్, ఇంట్రాగ్యాస్ట్రిక్ ద్వారా ఆరు నెలల నుంచి ఏడాదికాలంలో బరువు తగ్గించారు. స్థానిక వైద్యశాలలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో డాక్టర్ నరేంద్రబాబు, డాక్టర్ భానులత, డాక్టర్ వెంకటేష్ మాట్లాడుతూ ఊబకాయ సమస్యతో ఒంగోలుకు చెందిన 27 ఏళ్ల యువకుడు 165 కేజీలబరువుతో వైద్యశాలకు వచ్చారన్నారు. ఒక ఏడాదికాలంలో 56 కిలోల బరువు తగ్గి 109 కిలోలకు చేరుకున్నాడని తెలిపారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఈ బరువు తగ్గించినట్లు వైద్యులు వెల్లడించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ఆ మాన్యాలు మాదిగలకే చెందాలి..

ఒంగోలు(రూరల్), జనవరి28(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం కొప్పోలు గ్రామ పరిధిలో గల మాదిగ మాన్యాలు మాదిగలకే దక్కాలని పలువురు కుల సంఘ నాయకులు డిమాండ్ చేశారు. మాదిగ మాన్యాలకు కొందరు అడ్డు తగులుతున్నారని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన కోరారు. మంగళవారం కొప్పోలులోని మాదిగ మాన్యాలను వారు పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ కోర్టులో మాదిగ మాన్య భూములు వారికే చెందాలని తీర్పు వచ్చినా కొందరు అడ్డు కోవడం తగదన్నారు. కార్యక్రమంలో సుజన్‌మాదిగ, రాజు, కొలకలూరి విజయకుమార్, సుందర్‌సింగ్, మంద సుధాకర్, రావినూతల జయకుమార్ తదితరులు పాల్గొన్నారు

గొర్రెలు, మేకలకు వైద్య పరీక్షలు



శిబిరంలో పాల్గొన్న డాక్టర్ చిరంజీవి

సంతనూతలపాడు, జనవరి 28(ఆంధ్రజ్యోతి): మైనంపాడు గ్రామం లో మంగళవారం పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో జరిగిన పశు వైద్యశిబిరంలో 4,583 గొర్రెలు, మేకలకు పశు వైద్యుడు చిరంజీవి వైద్య సేవలు అందించారు. గొర్రెలు, మేకలకు నట్టలనివారణ మందును తాగించారు. పశుపోషకులకు అవగాహన కల్పించారు.

కండ్లగుంటలో

నాగులుప్పలపాడు: కండ్లగుంట గ్రామంలోని మంగళవారం ఉచిత పశు వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఏడీఏ డాక్టర్ నాగభూషణరావు, పశువైద్యురాలు జాస్మిన్ పలు పశువులకు వైద్యపరీక్షలు చేశారు. దూడలు, గొర్రెలకు నట్టల నివారణ మందు తాపించారు. పశుపోషకులకు మినరల్ మిక్చర్ ప్యాకెట్లు అందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుడిబండ ప్రభుదాస్‌రెడ్డి, నిడమానూరు, పోతవరం పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తులు

సంతనూతలపాడు, జనవరి 28(ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ ద్వారా ఈడబ్ల్యూఎస్ రుణాల కోసం ఓబీఎంఎంఎస్ వెబ్‌సైట్‌లో అర్హులైన వారు ఈనెల 30 నుంచి దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో డి.సురేష్‌బాబు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, పూర్తి వివరాలకు ఎంపీడీవో కార్యాలయంలో సంప్రదించాలని ఆయన కోరారు.

అవీ..ఇవీ

నేడు ఉచిత కంటి వైద్యశిబిరం

కంభం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): కంభం టీడీపీ కార్యాలయంలో బుధవారం ఉదయం 10 గంటలకు శాంతిరాం వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిభిరం ఏర్పాటు చేయడం జరిగిందని టీడీపీ మండల అధ్యక్షులు తోట వెంకట శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్ని గ్రామపంచాయతీ నాయకులు తమ గ్రామాలలో కంటి సమస్యలు ఉన్న వారు వచ్చి పరీక్షించుకోవాలన్నారు.

నేడు క్రీడా పోటీలు

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 28 ఆంధ్రజ్యోతి: నెహ్రూ యువకేంద్ర, దీక్ష యువజన స్వచ్ఛంద సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో బ్లాక్ లెవెల్ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు బ్లాక్ ప్రతినిధి, సంస్థ అధ్యక్షులు శ్రీధర సాయి సుబ్బారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో వాలీబాల్, కబాడ్డీ, క్లైజ్ సైక్లింగ్, రన్నింగ్ క్రీడలు నిర్వహించి బహుమతులు అందిస్తామన్నారు.

నేడు పరికరాల నమోదు

గిద్దలూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు ఇచ్చే పరికరాల నమోదు ప్రక్రియను ఈ నెల 29న బుధవారం గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలలో నిర్వహిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. దివ్యాంగులకు, వృద్ధులకు అలింకో సంస్థ ద్వారా చేతికర్రలు, చంక కర్రలు, వీల్‌చైర్లు, వినికిడి యంత్రాలు, 3 చక్రాల సైకిళ్లు, అంధుల చేతికర్రలు, 80 శాతం శారీరక దివ్యాంగత్వం ఉన్న వారికి బ్యాటరీ సైకిళ్లు పొందే అవకాశం ఉన్నందున 6 మండలాలకు చెందిన దివ్యాంగులు ఈ శిబిరానికి హాజరు కావాలని అధికారులు పేర్కొన్నారు. రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, సమస్యతో కూడిన 2 ఫొటోలు, ఆదాయ ధ్రువీకరణపత్రం యూఐడీ కార్డు, ఫోన్ నెంబరుతో శిబిరానికి హాజరు కావాలని పేర్కొన్నారు.

మద్యం దుకాణాలకు దరఖాస్తుల ఆహ్వానం


సీఐ అరుణకుమారి

పొదిలి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : పొదిలి, కొనకనమిట్ల, తర్లుపాడు మండలాలకు సంబంధించి గౌడ సామాజిక వర్గానికి చెందిన మద్యం దుకాణం ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఎక్సైజ్ సీఐ అరుణకుమారి తెలిపారు. మంగళవారం స్థానిక ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరులతో మాట్లాడారు. గౌడ సామాజిక వర్గాలకు చెందిన వారు ఎవరైనా ఎక్కడి నుండి అయినా మద్యం దుకాణానికి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జనవరి 27 నుండి ఫిబ్రవరి 5వతేదీవరకు ఆయా షాపులకు దరఖాస్తు గడువు ఉందని ఆసక్తిగల వారు చేసుకోవాలన్నారు. అప్లికేషన్ ఫీజు 2 లక్షలు డీడీ రూపంలో తీయాలన్నారు. జిల్లా పరిధిలో దుకాణాలకు ఎక్కడ నుండి అయినా ఆసామాజిక వర్గానికి చెందిన వారు డీడీ తీయవచ్చన్నారు. ఫిబ్రవరి 7వతేదీన ఒంగోలులో లాటరీ తీయడం జరుగుతుందని చెప్పారు.

పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి


పాడి రైతులకు మందులు అందజేస్తున్న పశువైద్యులు

మార్కాపురం రూరల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి). ప్రభుత్వం గ్రామంలో నిర్వహించిన పశువైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ మండల యూత్ అధ్యక్షులు, గ్రామ టీడీపీ నాయకులు బొగ్గు శేఖర్‌రెడ్డి పశుపోషకులను కోరారు. మండలంలోని బోడపాడు గ్రామంలో మంగళవారం పశుసంవర్థక శాఖ సిబ్బంది పశువైద్య శిబిరాన్ని నిర్వహించి పశువులకు మందులు వేసి పశుపోషకులకు బలం మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పాడిపరిశ్రమ రైతులకు అండగా ఉంటుందన్నారు. అందులో భాగంగా గ్రామాలకే పశువైద్యులు వచ్చి పశువులకు వైద్యసేవలు అందిస్తున్నారన్నారు. పశుపోషకులు ప్రభుత్వం గోకులం షెడ్లకు అందించే రాయితీలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఏడీఏ బాలునాయక్, పశువైద్యులు అశోక్‌కుమార్, సిబ్బంది అనిత, సాయితేజ, తేజస్విని పాల్గొన్నారు. గ్రామంలోని గొర్రెలకు, మేకలకు, గేదెలకు గర్భకోశ వ్యాధులకు సంబందించిన మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కనకా శ్రీను, గూడా రమణారెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.

సోమేపల్లిలో పశువులకు ఆరోగ్య శిబిరం

త్రిపురాంతకం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో మండలంలోని సోమేపల్లి, కంకణాలపల్లి గ్రామాల్లో పశుఆరోగ్య శిబిరాలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాడి గేదెలలకు, ఆవులకు ఇతర పశువులకు వైద్య పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. పశువులలో వచ్చే పలు రకాల సీజనల్ వ్యాదులతోపాటు, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో పశుసంవర్థక శాఖ త్రిపురాంతకం ఏడీ ఎన్.శ్రీరాములు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలు


ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న సబ్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్, కమిటీ సభ్యులు

మార్కాపురం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం డివిజన్ పరిధిలోని పలు కేంద్రాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త, సహాయకురాళ్ల పోస్టులకు మంగళవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. సబ్‌కలెక్టర్ వెంకట్ త్రివినాగ్ అధ్యక్షతన పలుశాఖలకు చెందిన అధికారులు అభ్యర్థులకు ఇంటర్వ్యూలు చేశారు. డివిజన్‌లో 4 అంగన్‌వాడీ కార్యకర్త, 3 మినీఅంగన్‌వాడీ కార్యకర్త, 24 ఆయా పోస్టులకు ఇంటర్వ్యూలు జరిగాయి. ఇంటర్వ్యూలలో సబ్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్, ఐసీడీఎస్ పీడీ హీనా సుజన్, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ పద్మావతి, మార్కాపురం సీడీపీవో నిర్మలాదేవిలు పాల్గొన్నారు.

దోర్నాల మండలం తుమ్మలబైలుకు చెందిన దాసరి బాలనాగమ్మ అనే అభ్యర్థిని కొద్దిసేపు సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. తాను సహాయకురాలి పోస్టుకు దరఖాస్తు చేసుకున్నానని ఇంటర్వ్యూ లెటర్ కూడా వచ్చిందన్నారు. కానీ తన పేరును ఇంటర్వ్యూలు చేసే అధికారులు పిలవలేదని కాల్ లెటర్ చూపించారు. విషయం తెలుసుకున్న ఐసీడీఎస్ పీడీ హీనా సుజన్ వెంటనే ఆమెతో మాట్లాడి ఇంటర్వ్యూ నిర్వహించారు.

మద్యం దుకాణాలకు నోటిఫికేషన్

మార్కాపురం, జనవరి (ఆంధ్రజ్యోతి): నూతన మద్యం పాలసీలో భాగంగా గీత కార్మికులకు సంబంధించిన మద్యం దుకాణాలకు నోటిఫికేషన్‌ను జారీ చేసినట్లు ఎక్సైజ్ సీఐ ఎం.వెంకటరెడ్డి తెలిపారు. మార్కాపురం సర్కిల్ పరిధిలో రెండు దుకాణాలు గీత కులాలకు కేటాయించారన్నారు. వాటిల్లో పట్టణ పరిధిలో ఒకటి గౌడ కులానికి, మండల పరిధిలో మరొకటి ఈడిగ కులానికి మద్యం దుకాణాలు మంజూరయ్యాయన్నారు. ఈ కులాలకు చెందిన వాళ్లే దరఖాస్తు చేసుకునేందుకు అర్హులన్నారు. అంతేకాక ఒక వ్యక్తి ఎన్ని దరఖాస్తులైన జిల్లావ్యాప్తంగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. లాటరీ పద్ధతిలో దుకాణాలు కేటాయిస్తామన్నారు.

లెదర్ కర్మాగారాన్ని పునఃప్రారంభిస్తాం

- లిడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు
- యడవల్లిలో లెదర్ పార్కు పరిశీలన
- రూ.70 లక్షలతో రోడ్డు మార్గం ఏర్పాటుకు హామీ


మాట్లాడుతున్న లిడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు

గిద్దలూరు టౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మూతపడిన లెదర్ కర్మాగారాన్ని త్వరలో ప్రారంభిస్తామని ఆంధ్రప్రదేశ్ లీడ్‌క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యాలరావు అన్నారు. మంగళవారం రాచర్ల మండలంలోని యడవల్లి సమీపంలోని లీడ్‌క్యాప్ లెదర్ కర్మాగారాన్ని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. అనంతరం మాణిక్యాలరావు మాట్లాడుతూ మాదిగల పట్ల నాటి వైసీపీ ప్రభుత్వం వివక్షత చూపుతూ లెదర్‌పార్కుల అభివృద్ధిని మరిచిందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మాదిగల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఇటీవల గిద్దలూరు నియోజకవర్గంలోని లెదర్‌పార్కు తరలిపోతుందంటూ వస్తున్న వార్తలు అవాస్తవమన్నారు. నియోజక వర్గంలోని మాదిగల అభ్యున్నతికి, వారి సంక్షేమానికి లెదర్‌పార్కు ఆవశ్యకత ఉందని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి తెలుపడంతో ఇక్కడే అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. ఇక్కడే అభివృద్ధి చేసి మాదిగలకు చేదోడుగా ఉంటామని భరోసా ఇచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న లెదర్‌పార్కులను కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో తిరిగి అభివృద్ధి చేసి మాదిగల అభ్యున్నతికి తోడ్పాటు అందిస్తామన్నారు. ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి మాట్లాడుతూ నియోజక వర్గంలో 28వేలకు పైగా మాదిగలు ఉన్నారని, ఇక్కడ ఉన్నటువంటి లెదర్‌పార్కును అభివృద్ధి చేయడం వలన వారికి ఉపాధి కలుగుతుందని, ఈ విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన వెంటనే లీడ్‌క్యాప్ సహకారం అందిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. అలాగే ప్రధాన రహదారి నుండి లెదర్‌పార్కు వద్ద రోడ్డు మార్గం ఏర్పాటు చేయాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలాశ్రీ బాలవీరాంజనేయస్వామి దృష్టికి తీసుకుపోవడంతో రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కలెక్టర్‌కు ఆయన ఆదేశాలు ఇచ్చారన్నారు. దీంతో కలెక్టర్ ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా రూ.70లక్షల నిధులు మంజూరు చేశారన్నారు. లీడ్‌క్యాప్ ప్రారంభానికి సహకారం అందిస్తున్న ఛైర్మన్ మాణిక్యాలరావుకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. లెదర్‌పార్కు అభివృద్ధికి సహకరిస్తానని, ఎటువంటి సమస్యలు లేకుండా లెదర్‌పార్కు భవన నిర్మాణాలు చేపడతామన్నారు. ఆక్రమణలకు గురైన భూమిని తిరిగి స్వాధీనం చేసుకుంటామన్నారు. లెదర్‌పార్కు కోసం ఏర్పాటు చేసిన 25 ఎకరాల భూమి చుట్టూ కంచె వేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అర్జున్‌నాయక్, ఏపీఈడబ్ల్యూఐడీసీ ఈఈ భాస్కర్‌రావు, రాచర్ల ఎంపీడీవో వెంకటరామిరెడ్డి, ఇన్‌చార్జి తహసీల్దార్ ఆంజనేయరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షులు కటికె యోగానంద్, భవనం పుల్లారెడ్డి, ఎస్సీసెల్ అధ్యక్షులు గుర్రం దానియేలు, పందిటి రజని, ప్రసన్నకుమార్, పాల్గొన్నారు.

కంభం : జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్లగా రాష్ట్రంలో విధ్వంసపాలన చేస్తే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నాడని రాష్ట్ర లిడ్‌క్యాప్ ఛైర్మన్ పిల్లి మాణిక్యాలరావు తెలిపారు. మంగళవారం ఆయన గిద్దలూరులోని యడవల్లిలో ఏర్పాటు చేసిన లెదర్‌పార్కును చూసేందుకు వెళుతూ మార్గమధ్యలో ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో విలేకరులతో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌లో గతంలో సీఎంగా ఉన్న చంద్రబాబు నేతృత్వంలో లిడ్‌క్యాప్‌లను అభివృద్ధి చేయాలనే సంకల్పంతో శ్రీకాకుళం నుంచి తడ వరకు రాయలసీమ ప్రాంతాలలో అనేక చోట్ల స్థలాలు తీసుకున్నారన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత లిడ్‌క్యాప్ భూములను అనేక చోట్ల అన్యాక్రాంతం అయ్యాయ న్నారు. గుంటూరు జిల్లా అడిగొప్పలలో దాదాపు 20 ఎకరాలు జగనన్న కాలనీ పేరుతో ఆక్రమించారన్నారు. తాను చైర్మన్‌గా బాధ్యతలు తీసుకున్నప్పటి నుండి వైసీపీ ఆక్రమించుకున్న భూములన్నింటిని పరిశీలించామన్నారు. జగనన్న కాలనీ పేరుతో ఆక్రమించుకున్న స్థలాల్లో ఎక్కడైనా ఇళ్లు కట్టకుండా ఉంటే చర్యలు తీసుకోవడంతోపాటు కోర్టులో కేసులు వేస్తున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో పనిచేసే చర్మకారుల అభివృద్ధి, వారి జీవనోపాధి విషయంలో ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు. అందులో భాగంగానే లెదర్‌పార్కు స్థలాన్ని పరిశీలించి ఏవిధంగా అభివృద్ధి చేయాలో ఆలోచిస్తామన్నారు. గత ప్రభుత్వ వైసీపీ పాలనలో రాష్ట్రం 25 ఏళ్లు వెనక్కు వెళ్లిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కేతం శ్రీనివాసులు, ప్రసన్న, ఎంఆర్‌పీఎస్ నాయకులు షాలెంరాజు, జయరాజ్ పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల సంక్షేమానికి కృషి : ముత్తుముల

గిద్దలూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్యుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని స్థానిక ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. అమ్మవారిశాల కమిటీ అధ్యక్షులు వాడకట్టు రంగసత్యనారాయణ, కమిటీ సభ్యులు స్థానిక ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డిని కలిసి శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవ ఆహ్వాన పత్రికను అందచేసి పూజా కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు. ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి మాట్లాడుతూ అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని రాష్ట్రప్రభుత్వం అధికారికంగా నిర్వహించేందుకు జీవో జారీ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. పూజా కార్యక్రమాలను తప్పక హాజరవుతానని పేర్కొన్నారు. ఏప్రిల్‌లో ఆర్యవైశ్య కార్పొరేషన్‌కు నిధుల కేటాయింపు జరుగుతుందన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే అశోక్‌రెడ్డిని కమిటీ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు.

గిద్దలూరు : పట్టణంలోని అమ్మవారిశాలలో ఈనెల 30 నుంచి శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు దేవస్థాన కమిటీ అధ్యక్షులు వాడకట్టు రంగసత్యనారాయణ, కార్యదర్శి తుమ్మలపెంట సత్యనారాయణ తెలిపారు. గురువారం మహాగణతిపూజ, ఆర్యవైశ్య పతాక ఆవిష్కరణ, అభిషేకం, కుంకుమార్చన, సాయంత్రం అమ్మవారి దీప గ్రామోత్సవం, 31న శుక్రవారం అమ్మవారికి సామూహిక అభిషేకం, గణపతి, రుద్ర, దుర్గా హోమం, సాయంత్రం 5గంటలకు అగ్నిగుండ ప్రవేశం, అర్ధరాత్రి 11 గంటలకు 14 అడుగుల ఎత్తుతో చందనంతో చేయించబడిన అమ్మవారి విగ్రహ విశ్వరూప దర్శనం, ఫిబ్రవరి 1న సామూహిక అభిషేకాలు, అమ్మవారికి ఒడి బియ్యం కార్యక్రమం, సాయంత్రం 6గంటలకు పుష్పాభిషేకం నిర్వహిస్తున్నట్లు, భక్తులందరూ ఆయా పూజల్లో పాల్గొన్నారు.

ఎర్రగొండపాలెం రూరల్ : ఆర్యవైశ్యుల ఇలవేల్పు శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవి అమ్మవారి అత్మర్పణ దినోత్సవం అధికారికంగా నిర్వహించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రకటించడం హర్షనీయమని ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షులు, ఏపీ కళావిభూషణ్ డాక్టర్ చీదేళ్ల నాగేశ్వర రావు అన్నారు. మంగళవారం ఆయన మాటాడుతూ ఎన్నికల సమయంలో కూటమి పెద్దలు చెప్పిన విధంగా అమ్మవారి అత్మర్పణదినోత్సవాన్ని అధికారికంగ ప్రకటించినందుకు కూటమి పెద్దలకు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ నెల 31వ తేది పెనుగొండలోని అమ్మవారి ఆలయంలో నిర్వహిస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేయడం ముఖ్యమంత్రి దేవాలయాన్ని సందర్శించడం శుభపరిణామమని అన్నారు.

ఆర్టీసీ ఆదాయం పెంచాలి


మాట్లాడుతున్న డిపో మేనేజర్ నరసింహులు

మార్కాపురం వన్ టౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఆదాయం పెంచేందుకు సిబ్బంది కృషి చేయాలని డిపో మేనేజర్ నరసింహులు అన్నారు. స్థానిక డిపో మేనేజర్ కార్యాలయంలో మంగళ వారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి రూట్‌లో ప్రయాణికుల అవసరం మేరకు బస్సులు నడుపుతా మన్నారు. గుంటూరు, ఒంగోలు రూట్‌లలో కలెక్షన్లు పెంచాలన్నారు. కుంభ మేళాకు మార్కాపురం డిపో నుంచి సూపర్ లగ్జరీ బస్సు ఏర్పాటు చేశామన్నారు. కనీసం 30 మంది ప్రయాణికులు ఉండాలన్నారు. ప్రయాగరాజ్, వారణాసి, ఆయోధ్య, కజురహో తదితర ప్రాంతాలను 7 రోజుల టూర్ ప్యాకేజీ ఉంటుందని, ఒక్కొక్కరి నుంచి రూ.11,500 చార్జీలు వసూలు చేస్తామన్నారు. భోజనం, టిఫిన్ అందిస్తామని, వివరాలకు 9959225699 నెంబర్‌ను సంప్రదించాలని అన్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

గిద్దలూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఆటో కార్మికులకు ప్రత్యేక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో పట్టణ ఆటో వర్కర్స్ యూనియన్ సమావేశం నిర్వహించారు. ఆటోకార్మికులు అనేక రకాల ఇబ్బందులు ఎదుర్కొంటున్న దృష్ట్యా ప్రత్యేక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి కార్మికులకు గుర్తింపు కార్డులు, ప్రమాద బీమా ఈఎస్‌ఐ సౌకర్యం కల్పించాలని కోరారు. వ్యవసాయం దెబ్బతిన్న తరువాత గ్రామీణ ప్రాంతాలలో ఉపాధి లేక యువత ఆటోడ్రైవర్లుగా జీవనం సాగిస్తున్నారన్నారు. వీరిని ఆదుకోవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఆటోలకు రాయితీపై పెట్రోల్, డీజిల్ అందించాలని కోరారు. కార్యక్రమంలో ఆటోవర్కర్ల యూనియన్ ప్రతినిధులు రఫీ, హుస్సేన్, రాజు, శివ, పాములేటి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ బకాయిలు చెల్లించాలి

ఎర్రగొండపాలెం రూరల్ జనవరి 28 (ఆంధ్రజ్యోతి): వ్యాపార సంస్థలు, గృహ నిర్మాణ విద్యుత్ వినియోగదారులు ఎప్పటికప్పుడు విద్యుత్ బకాయిలు చెల్లించాలని ఎర్రగొండపాలెం విద్యుత్‌శాఖ అధికారులు తెలిపారు. మంగళవారం పట్టణంలో పెండింగ్‌లో ఉన్న విద్యుత్ వినియోగదారుల వద్దకు నేరుగా వెళ్లి విద్యుత్ బాకాయిలను కట్టించారు. నెలల తరబడి వేల రూపాయలలో పెండింగ్ బకాయిలు ఉన్న విద్యుత్ కనెక్షన్లను తొలగించినట్లు వారు తెలిపారు. బిల్లులు కట్టకుండా అలాగే ఉంచడం వలన పెనాల్టీ తప్పదన్నారు. కావున మండల ప్రజలు, వ్యాపారులు బిల్లులు చెల్లించాలని కోరారు. కార్యాలయంలోనే కట్టాలని ఏమిలేదని ఫోన్‌పే ద్వారా కాని విద్యుత్ శాఖ స్కానర్ ద్వారా బిల్లులు చెల్లించవచ్చన్నారు. పెండింగ్ బిల్లులు చెల్లించి విద్యుత్ శాఖకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ లైన్‌మెన్‌లు, జేఎల్‌ఎంలు సిబ్బంది ఉన్నారు.

డ్వాక్రా మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- మండల సమాఖ్య సమావేశంలో ఏపీఎం పిచ్చయ్య

మార్కాపురం రూరల్, జనవరి28 (ఆంధ్రజ్యోతి). డ్వాక్రా సంఘాల మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని డీఆర్‌డీఏ వెలుగు ఏపీఎం పిచ్చయ్య తెలిపారు. స్థానిక కరెంట్ ఆఫీస్ ఎదురుగా ఉన్న ఎస్సీ, బీసీ, కాలనీలోని డ్వాక్రా బజారులో మంగళవారం మండల సమాఖ్య సమావేశం గ్రామాలలోని గ్రామ సంఘాల కమిటీ సభ్యులు, వీవోఏలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం పిచ్చయ్య మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామంలో తప్పనిసరిగా గ్రామ సంఘాల సమావేశాలు నిర్వహించి ప్రభుత్వం స్వయం సహాయక సంఘాల మహిళలకు అందిస్తున్న ప్రభుత్వ రాయితీలను స్వయం ఉపాధి అవకాశాలను వివరించాలని కోరారు. ప్రతి సభ్యురాలు జీవనోపాధి యూనిట్లు ఏర్పాటు చేసుకునే విధంగా వారికి అవగాహన కల్పించాలన్నారు. డ్వాక్రా మహిళలకు బ్యాంకు రుణాలు ఇప్పించి వారు జీవనోపాధి యూనిట్లు ఏర్పాటు చేయించాలని కోరారు. వారు తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించే విధంగా వారికి సూచనలు తెలియజేయాలని కోరారు. స్త్రీ నిధి, ఉన్నతి బకాయిలు ఉన్నవారితో ప్రతి నెల క్రమం తప్పకుండా రుణాలు చెల్లించాలన్నారు. సెర్ప్ నుండి వస్తున్న ప్రతి యాప్‌లో సంబంధిత వివరాలను సకాలంలో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎల్‌సీ నాగభూషణం, సీసీలు మనోకుమారి, నాగయ్య, మండల సమాఖ్య అధ్యక్షురాలు ఝాన్సీ, కోశాధికారి గోవిందమ్మ, కమిటీ సభ్యులు, అకౌంటెంట్ నాగమణి, గ్రామ సంఘాల సభ్యులు, విఒఎలు పాల్గొన్నారు.

చెత్తడంపింగ్ కేంద్రాలుగా రహదారి అంచులు

తీవ్రంగా అవస్థలు పడుతున్న ప్రజలు


ఆయ్యంబొట్లపల్లి వద్ద రహదారి పక్కన పేరుకపోయిన చెత్త

ఎర్రగొండపాలెం రూరల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : నిత్యం రద్దీగా ఉండే ప్రధాన రహదారుల వెంట ఎక్కడ పడితే ఆక్కడ చెత్త చెదారంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎర్రగొండపాలెం మండలం వ్యాప్తంగా ఇదే పరిస్థితి ఏర్పడింది. గ్రామాలలో ఉండే సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులు వాటిపై దృష్టి సారించక పోవడంతో రోజుల తరబడి రోడ్ల వెంట నిల్వ ఉండటంతో దురువాసనతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆలాగే రోజుల తరబడి చెత్త నిల్వ ఉండటంతో దోమలు పెరిగి గ్రామాల ప్రజలు రోగాల భారిన పడుతున్నారు. పంచాయితీ అధికారులు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాల్సి ఉండగా ఎక్కడ చర్యలు తీసుకోవడం లేదని ఆరోపణలు ఉన్నాయి. ప్రజలు కూడ చెత్త ఎక్కడ పడితే ఆక్కడ వేయడం మానుకోవడం లేదు. పంచాయితీ అధికారులు, గ్రామ సర్పంచ్‌లు పట్టించుకోకపోవడమే అని ప్రజలు పేర్కొంటున్నారు. ప్రజలకు అవగాహన కల్పించడం చెత్త వేసేందుకు తగు ఏర్పాట్లు చేయకపోవడమే అని అంటున్నారు. ముఖ్యంగా ఎర్రగొండపాలెం, ఆయ్యంబొట్లపల్లి, గోళ్లవిడిపి, అమానిగుడిపాడు, వీరభద్రాపురం తదితర గ్రామాలలో రోడ్ల వెంబడే మురికి నీరు, చెత్తా చెదారం ఎక్కువగా ఉంటుందని ఆయా గ్రామల ప్రజలు పేర్కొంటున్నారు. ప్రసుత్తం రాష్ట్ర ప్రభుత్వం ప్రతి మూడవ శనివారం స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమానికి స్వీకారం చేపట్టింది. అయితే గత శనివారం మండలంలో ఈ కార్యాక్రమం కూడ నిర్వహించలేదని పట్టణ, గ్రామీణ ప్రాంత ప్రజలు పేర్కొంటున్నారు. అధికారుల నిర్లక్ష్యం ఇలా ఉందని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమం కూడ నిర్వహించక పోవడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైన మండల స్థాయి అధికారులు, గ్రామ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు స్పందించి గ్రామాలలో పెరుకుపోయిన చెత్తా చెదాలను, మురికి కుంపటిలను పరిశుభ్రం చేసి ప్రజలు రోగాల భారిన పడకుండ చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

శవరాజకీయాలు చేస్తే సహించం

పొదిలి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ నాయకులు గ్రామాల్లో శవరాజకీయాలు చేస్తూ పబ్బం గడుపుకుంటున్నారని అలా చేస్తే ఉపేక్షించమని, మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి ధ్వజమెత్తారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని సల్లూరు గ్రామంలో మృతుని దహనసంస్కారాల విషయంలో తలెత్తిన గొడవలపై ఆయన స్పందించారు. గతంలో సల్లూరు గ్రామంలో రెండుకులాలకు సంబంధించి వేరువేరుగా శ్మశానాలు ఉన్నాయన్నారు. గ్రామాల్లో ఉన్న ఆచారాలను వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత దౌర్జన్యంగా ఆచారాన్ని కాలరాశారన్నారు. ఇరువర్గాల మధ్య బేదాభిప్రాయాలు సృష్టించారని మండిపడ్డారు. వైసీపీ హయాం అంతా గ్రామాల్లో రెండు కులాల్లో మధ్య చిచ్చుపెట్టి పబ్బంగడుపుకోవడమే వారి ధ్యేయమన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం పాలనచేస్తోందని వైసీపీ పెద్దలు గుర్తెరగాలన్నారు. గ్రామాల్లో ఏదైనా సమస్య తెలత్తితే పెద్దమనిషిగా ఇరువురిని సమసన్వయం చేసి పరిష్కారించాలన్నారు. శాంతియుతంగా ఉన్న గ్రామంలో రెండు కులాల మధ్య చిచ్చురేపడం చేతగానివారు చేసేపని అన్నారు. గ్రామాల్లో అమాయకులపై ప్రతాపం చూపడం ఎందుకు దమ్ముంటే తమపై చూపాలని సవాలు విసిరారు. కూటమి ప్రభుత్వం ఆరునెలల్లో చేసిన అభివృద్ధిని చూడలేక వైసీపీ నేతలకు కన్నుకుట్టిందని విమర్శించారు. ప్రజలకు కష్టాలు తెలియకుండా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందన్నారు. కులరాజకీయాలు సృష్టించి ప్రభుత్వంపై చెడ్డపేరుతేవాలనే ఆలోచనను వైసీపీ నాయకులు మానుకోవాలన్నారు. శ్మశానవాటిక కోసం రెవెన్యూ అధికారులు మూడు ప్రదేశాలు చూపిస్తే కాదనడంలో అంత్యమేమిటని ప్రశ్నించారు. తెరచాటున వైసీపీ నాయకులు అమాయకులైన ప్రజలను మభ్యపెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గునుపూడి భాస్కర్, నాయకులు వరికుంట్ల అనీల్, ఖుద్దూస్, మాదిరెడ్డిపాలెం సొసైటి అధ్యక్షులు యర్రరెడ్డి వెంకటేశ్వర్లు మాజీ జడ్పీటీసీ కాటూరి పెదబాబు, మాజీ ఎంపీటీసి ఇమాంమ్‌సా, రైతు నాయకులు పాల్గొన్నారు.

రైతులు విధిగా ఈ-క్రాప్ చేసుకోవాలి

- వ్యవసాయాధికారుల సూచన
- పైర్లకు సోకే వివిధ తెగుళ్లపై రైతులకు అవగాహన


వాదంపల్లిలో శనగను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

ఎర్రగొండపాలెం రూరల్ జనవరి 28 (ఆంధ్రజ్యోతి): పంటలు సాగు చేసిన రైతులు తప్పనిసరిగా ఈ క్రాప్ నమోదు చేసుకోవాలని ఎర్రగొండపాలెం ఏవో కేవీ శేషారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని వాదంపల్లి, అమానిగుడిపాడు గ్రామాలలో రైతుసేవా కేంద్రం సిబ్బందితో పొలంపిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. సాగు చేసిన కంది, మిరప, పొగాకు పంటలను పరిశీలించారు. ఆనంతరం రైతుసేవా కేంద్రంలో రైతులతో సమావేశం నిర్వహించారు. సాగువిధానంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి ఎల్ మాల్యాద్రి రెడ్డి, వివేక్, రంగ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

గిద్దలూరు : మండలంలోని పాములపల్లి, కొత్తపల్లి గ్రామాలలో వ్యవసాయశాఖ అధికారులు పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి విజయభాస్కర్‌రెడ్డి ఎస్‌పీఎస్‌ఎస్ పథకంపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులు నేరుగా పొలాల్లోకి వెళ్లి పురుగులు, తెగుళ్ల ఫొటోలు తీసి పెడితే వాటి నివారణ చర్యలు వెంటనే ఈ అప్లికేషన్ ద్వారా పొందవచ్చన్నారు. అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో చేపట్టిన ఫార్మర్ రిజిష్టర్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని, తద్వారా రైతుకు ప్రత్యేక సంఖ్య కేటాయించనున్నట్లు పేర్కొన్నారు. అనేక పథకాలలో ఈ సంఖ్య నమోదు చేయాల్సి ఉన్నందున ఖచ్చితంగా రిజిష్టర్ చేయించుకోవాలన్నారు. గ్రామసభల అనంతరం శనగ పంటను క్షేత్రస్థాయిలో పరిశీలించి చీడపీడలు, నివారణ చర్యల గురించి రైతులకు వివరించారు. వ్యవవసాయ విస్తరణాధికారి శ్రీనివాసరెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు ఖాశీం, సుభాని పాల్గొన్నారు.


ఎండ్లూరివారిపాలెంలో రైతుల పొలాల్లో పర్యటిస్తున్న ఏవో

పెద్దదోర్నాల : ప్రభుత్వ పథకాలను రైతులు వినియోగించుకోవాలని ఏవో జవహర్‌లాల్ నాయక్ అన్నారు. మండలంలోని నల్లగుంట్ల, కొర్రప్రోలు గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆయా గ్రామాల్లో సాగు చేసిన మినుము, జొన్న పంటలను పరిశీలించారు. అనంతరం ఏవో మాట్లాడుతూ రబీలో సాగు చేసిన పంటలకు ఈ క్రాప్ నమోదు చేసుకుని ఈకేవైసీ తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. ప్రతి రైతుకు ఫార్మర్ రిజిస్ట్రీ ద్వారా ప్రభుత్వం గుర్తింపు కార్డులు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్డులున్న రైతులకు మాత్రమే అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్‌నిధి, ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా పథకం వంటి ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయ న్నారు. కార్యక్రమంలో వీహెచ్ ఏ మల్లునాయక్, రైతులు పాల్గొన్నారు.

త్రిపురాంతకం : మండలంలోని ఎండూరివారిపాలెం గ్రామంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు సాగుచేసిన మొక్కజొన్న పంటలను అధికారులు సందరర్శించారు. పంటలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కత్తెర పురుగు నివారణ చర్యలను వివరించారు. కార్యక్రమంలో ఏవో నీరజ, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

తర్లుపాడు: కేంద్ర ప్రభుత్వం సహకారంతో అమలు చేయనున్న ఫార్మర్ రిజిస్ట్రేషన్‌లో రైతులందరూ తమ వివరాలను నమోదు చేయించుకోవాలని ఏవో టి.వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని పోతలపాడు, కందల్లపల్లిలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మిర్చి, మొక్కజొన్న, కంది పంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం పోతలపాడులో రైతులతో సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం మట్టి నమూనా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ప్రస్తుతం మిర్చి రేట్లు గణనీయంగా తగ్గాయని, ఉద్యానవనశాఖ కార్యాలయంలో పండిన పంటను పరిశీలించి సర్టిఫికెట్లు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన శాఖాధికారి టి.రమేష్, పశువైద్య అసిస్టెంట్ ఎ.సౌజన్య, రైతులు పాల్గొన్నారు.

అవీ..ఇవీ


ఆరోగ్య పెన్షన్ లబ్ధిదారుడి ఫిట్‌నెస్ స్థితిని పరిశీలిస్తున్న వైద్యబృందం

హెల్త్ పెన్షన్ల పరిశీలన

పీసీపల్లి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి):మండలంలోని పలు గ్రామాల్లో ప్రభుత్వం నుంచి హెల్త్ పెన్షన్లు అందుకుంటున్న లబ్ధిదారులను ప్రత్యేక వైద్యబృందం మంగళవారం తనిఖీ చేసింది. గుదేవారిపాలెం, నేరేడుపల్లి, మురుగుమ్మి, గుంటుపల్లి తదితర గ్రామాల్లో 18మంది పక్షవాతం, ఇతర అనారోగ్య కారణాలతో నెలకు 15,000 రూపాయల వంతున హెల్త్‌పెన్షన్లు పొందుతున్నారు. అయితే ఈ హెల్త్‌పెన్షన్లలో గత ప్రభుత్వంలో అక్రమాలు జరిగాయని భావించిన కూటమి ప్రభుత్వం తనిఖీకి ఆదేశించింది.ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రత్యేకంగా నియమించిన డాక్టర్ల బృందం ఆయా గ్రామాలకు చేరుకుని హెల్త్‌పెన్షన్ పొందుతున్న వ్యక్తులను క్షుణ్ణంగా పరిశీలించారు. వారు ఎదుర్కొంటున్న అనారోగ్య సమస్యలు, వారి దగ్గర ఉన్న ట్రీట్‌మెంట్‌కు సంబంధించిన పత్రాలు, ప్రస్తుతం వారు ఉన్న ఫిట్‌నెస్ స్థితిని పరిశీలించి రికార్డు చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యబృందంతో పాటు ఎంపీడీవో ప్రభాకరశర్మ, ఆయా పంచాయతీల కార్యదర్శులు ఉన్నారు.


రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న పువ్వాడి

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ

పామూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తూర్పుకోడిగుడ్లపాడు పంచాయతీ జంగాలపల్లి గ్రామంలోని గంగమ్మతల్లి దేవస్థానానికి వెళ్లేందుకు మంజూరైన సీసీ రోడ్‌కు టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు మంగళవారం భూమి పూజ నిర్వహించారు. గ్రామంలో నిర్మించిన మినీ గోకులం షెడ్‌ను ఎంపీడీవో బి. సురేష్‌తో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ డి. కొండబాబు, యారవ శ్రీను, అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి, సయ్యద్ అమీర్‌బాబు, ఇర్రి కోటిరెడ్డి, జి. శ్రీను, డి. మాధవరావు, డి. చెన్న కేశవులు, గిరి, ఏపీవో బి. మాల్యాద్రి, పాల్గొన్నారు.


పంచాయతీ నిధుల
గోల్‌మాల్‌పై విచారణ చేస్తున్న డీఎస్పీ లక్ష్మీనారాయణ

నిధుల గోల్‌మాల్‌పై విచారణ

కురిచేడు, జనవరి 28(ఆంధ్రజ్యోతి): కురిచేడు పంచాయతీ కార్యాలయంలో లక్షలాది రూపాయల నిధులు గోల్‌మాల్‌తో పాటు తనను కులం పేరుతో దూషించారంటూ సర్పంచ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణ విచారించారు. సర్పంచ్ కేసనపల్లి కృష్ణయ్య, పంచాయతీ కార్యదర్శి చాంద్‌బీలను నిధులు ఎలా గోల్‌మాల్ అయ్యాయనే విషయంపై విచారించారు. సర్పంచ్ సంతకం ఫోర్జరీ అయిందా లేదా అనే విషయంపై ఆరా తీశారు. ఓ చెక్కు సైతం మిస్ అయిందని విచారణలో గుర్తించారు. గోల్‌మాల్ అయిన నిధులు తిరిగి ఎలా పంచాయతీకి రికవరీ చేయాలనే విషయంపై వారినుంచి వివరాలు అడిగారు. డీఎస్పీ వెంట ఎస్ఐ శివ ఉన్నారు.

అన్న క్యాంటీన్ పూర్తికి నిధులు విడుదల చేస్తాం

దర్శి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): దర్శి పట్టణంలో అన్నక్యాంటీన్ ఏర్పాటుకు నిధులు విడుదల చేస్తామని పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ హామీ ఇచ్చారు. టీడీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి మంగళవారం అమరావతిలో మంత్రి నారాయణను కలిసి గత టీడీపీ హయాంలో నిర్మాణం తలపెట్టిన అన్నక్యాంటీన్ మధ్యలో నిలిచిపోయిన విషయాన్ని వివరించారు. అదేవిధంగా దర్శి నగర పంచాయతీని మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేయాలని, పట్టణ అభివృద్ధికి అదనపు నిధులు విడుదల చేయాలని కోరారు. అందుకు స్పందించిన మంత్రి నారాయణ అన్నక్యాంటీన్ నిర్మాణానికి, భోజన నిర్వహణకు, దర్శి పట్టణ అభివృద్ధికి వెంటనే నిధులు విడుదల చేస్తామని స్పష్టమైన హామీ ఇచ్చినట్లు డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి తెలిపారు.


మంత్రి నారాయణకు
వినతిపత్రం ఇస్తున్న లక్ష్మి

వాహన చోదకులు ప్రమాదాలకు గురి కాకుండా ప్రత్యేక చర్యలు

ముండ్లమూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అద్దంకి - దర్శి ప్రధాన రహదారిపై ప్రమాదాలకు గురి కాకుండా డ్రమ్ములు ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ నాగరాజు అన్నారు. ఆయన మంగళవారం ప్రధాన రహదారిపై వేంపాడు, శంకరాపురం వద్ద డ్రమ్ములు ఏర్పాటు చేసి రేడియం స్టిక్కర్లను అంటించారు. రాత్రుల సమయాల్లో వాహన చోదకులు నెమ్మదిగా ప్రయాణం సాగించాలన్నారు. వేగంతో వచ్చి ప్రమాదాలకు గురి కావద్దన్నారు. ప్రతి వాహన చోదకుడు హెల్మెట్, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. ఆటోలు నడిపే వాహన చోదకులు పరిమితికి లోబడి మాత్రమే ప్రయాణికులను ఎక్కించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ వెంకటేశ్వర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదభరితంగా ట్రాన్స్‌ఫార్మర్లు

పలుచోట్ల వేలాడుతున్న తీగలు
పట్టించుకోని అధికారులు

దర్శి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): దర్శి పట్టణంలో అనేకచోట్ల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెలు ఏర్పాటు చేయకపోవటంతో ప్రమాదభరితంగా మారాయి. రోడ్ల అంచున అడ్డగోలుగా ట్రాన్స్‌ఫార్మర్లు బిగించారు. కొన్నిచోట్ల ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ చిల్లచెట్లు పెరిగాయి. అనేకచోట్ల విద్యుత్ తీగలు కిందకు వేలాడుతున్నాయి. ప్రమాదభరితమైన పరిస్థితి ఉన్నప్పటికీ ఆ శాఖ అధికారులు చోద్యం చూస్తున్నారు. దర్శి-పొదిలి రోడ్డులో అంతర్గత వీధిలో ఒక ట్రాన్స్‌ఫార్మర్‌ను సీసీ రోడ్డు అంచున ఏర్పాటు చేశారు. వాహన చోదకులు ఆదమరచి ఆ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీ కొడుతున్నారు. అక్కడే మరో రోడ్డు మలుపు ఉండటంతో అటువైపు నుంచి వచ్చే వాహనాలు కనిపించక ఇబ్బందులు పడుతున్నారు. దర్శి మైనర్ కాలువ అంచున మరో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. మరోవైపున అక్కడ సీసీ రోడ్డు ఉంది. ఆ ట్రాన్స్‌ఫార్మర్ చుటూ చిల్లచెట్లు అల్లుకొని ఉన్నాయి. ఆ కూడలిలో కూడా వాహన చోదకులు ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తించక ప్రమాదాల బారిన పడుతున్నారు. లంకోజనపల్లిలోని ఒక అంతర్గత వీధిలో విద్యుత్ తీగలు గృహాల అంచులు తాకుతూ వెళ్తున్నాయి. మరో అంతర్గత రోడ్డులో విరిగిన స్తంభానికి అతుకువేసి ఎంతోకాలంగా విద్యుత్ సరఫరా చేస్తున్నారు. కనీసం విరిగి పడిన స్తంభాలకు ఎంతోకాలంగా మరమ్మతులు చేయకపోవటంపై ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆ శాఖ అధికారులు స్పందించి ప్రమాదభరితంగా మారిన ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెలు ఏర్పాటు చేయాలని, విరిగిన స్తంభాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.


దర్శిలో చిల్లచెట్ల మధ్యలో
ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్


రోడ్డు పక్కన కంచెలేకుండా
నిర్మించిన ట్రాన్స్‌ఫార్మర్


విద్యుత్ స్తంభాలకు సాలె
గూడులా వేలాడుతున్న తీగలు

భూములు కోల్పోయిన రైతులకు న్యాయపరంగా నష్టపరిహారం

రెవెన్యూ అధికారులకు
ఎమ్మెల్యే ఉగ్ర సూచన

సీఎస్‌పురం(పామూరు) జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారి నిర్మాణానికి సంబంధించి భూసేకరణలో భూములు కోల్పోతున్న రైతులకు న్యాయంగా నష్టపరిహారం అందజేయాలని ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి రెవెన్యూ అధికారులకు సూచించారు. సీఎస్‌పురం తహసీల్దార్ కార్యాలయంలో హైవే భూ బాధితులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. భూసేకరణలో భూములు కోల్పోయిన రైతుల భూములకు సంబంధించిన రికార్డులను ఆర్డీవో కేశవవర్ధనరెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఉగ్ర మాట్లాడుతు రైతుల భాగస్వామ్యం తోనే అభివృద్ధి సాధ్యం అవుతుందన్నారు.హైవే భూ బాధితులకు నష్ట పరిహారం సొమ్ములు త్వరితిగతిన అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం డీజీపేట, గుంతచెన్నంపల్లి, రేగులచెలుక గ్రామాల మీదుగా సాగుతున్న గ్రీన్‌ఫీల్డ్ హైవే, 167- బీ హైవే పనులను పరిశీలించారు. రహదారుల నిర్మాణంతో గ్రామాలన్నీ అభివృద్ధి చెందుతాయన్నారు. భూ సేకరణలో భూములు కోల్పోయిన రైతులకు ప్రభుత్వ పరం గా అన్నివిధాలుగా సహాయసహకారం అందజేస్తామని, అందుకు రైతులు కూడాసహకారం అందించాలని కోరారు. సర్వే నెంబర్ 224/1 లో గల భూమి ప్రభుత్వ భూమి ల్యాండ్ పూలింగ్‌లో ఉందని, ఎవరు కొనుగోలు చేసినా చెల్లదని ఆర్డీవో తెలిపారు. రైతుల భూములు జీరో ఖాతాలో పడటం వలన జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక పంపించి రికార్డులను సరి చేసి రైతులకు త్వరగా న్యాయం జరిగేలా రెవెన్యూ అధికారులు కృషిచేయాలని ఉగ్ర సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వి. వెంకటేశ్వర్లు, సర్పంచ్ శ్రీరాం పద్మావతి, టీడీపీ మండల అధ్యక్షుడు బొమ్మనబోయిన వెంకటేశ్వర్లు, యారవ శ్రీనువాసులు, బోయిళ్ల నారాయణరెడ్డి, ఎన్‌సీ మాలకొండయ్య, నీటి సంఘం అధ్యక్షుడు పావళి తిరుపతయ్య, వీఆర్వోలు, సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు. అనంతరం ప్రముఖ శైవ క్షేత్రమైన భైరవకోన క్షేత్రాన్ని పరిశీలించారు. రానున్న మహా శివరాత్రి వేడుకలకు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దేవస్థాన అధికారులు తగిన చర్యలు చేపట్టాలని ఉగ్రనరసింహారెడ్డి సూచించారు.


హైవే భూ బాధితుల సమావేశంలో మాట్లాడుతున్న ఉగ్ర

ఆర్యవైశ్యులకు అండగా ఉంటా

● ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

ఆర్యవైశ్యులకు అండగా ఉంటానని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరీ దేవస్థానంలో అమ్మవారిని ఎమ్మెల్యే మంగళవారం దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వాసవీ మాత ఆత్మార్పణ రోజునురాష్ట్ర కార్యక్రమంగా జీవో ఇవ్వటం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఆర్యవైశ్యులకు తన సంపూర్ణ సహకారాలు ఎప్పుడూ ఉంటాయన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రను ఘనంగా సన్మానించి సత్కరించింది. ఈ కార్యక్రమంలో కమిటీ నాయకులు దేవకి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

తెల్లదోమతో మిర్చి రైతులు అప్రమత్తంగా ఉండాలి

ఉద్యానశాఖ
ఏవో అంజలీభాయి

కనిగిరి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : తెల్లదోమ పట్ల మిర్చి రైతులు అప్రమత్తంగా ఉండాలని ఉద్యానశాఖ ఏవో ఎం. అంజలీబాయి అన్నారు. పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని శంఖవరం, గోసులవీడు గ్రామాల్లోని మిర్చి పంటను పరిశీలించారు. ఆయా గ్రామాల్లో మిరప పంటలో తెల్లదోమ, తామర పురుగు ఆశించినట్లు గుర్తించారు. వాటి నివారణపై రైతులకు సూచనలు చేస్తూ ఎకరాకు 30 నుంచి 40 బులుగు, పసుపు రంగు జిగురు అట్టలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా పురుగు నివా రణకు ఫిప్రోనిల్ లేదా స్పైనోసాడ్‌లను పిచికారీ చేయాలని సూచించారు. అలాగే సిలీంద్రాల వల్ల వచ్చే ఆకుమచ్చ, కాయమచ్చలు తగ్గించడం కోసం ఎం45 ను పిచికారీ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఏఏ లు హసీనా, కిషోర్, శ్రావణ సంధ్య, ఐసీఆర్‌పీలు, రైతులు పాల్గొన్నారు.



గోసులవీడులో మిర్చికి తెగులు నివారణపై రైతులకు సూచనలు చేస్తున్న ఉద్యానశాఖ ఏవో

కందిలో మచ్చల పురుగు

పామూరు : సాగులో ఉన్న కంది పైరులో మాటుక మచ్చల పురుగు, గూడు పురుగు ఆశించిందని ఏవో కే రాధ తెలిపారు. మండలంలోని బోడవాడ, తూర్పు కోడిగుడ్లపాడు గ్రామాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సాగులో ఉన్న వరి, కంది, మిరప పంటలను పరిశీలించారు. కంది పంటలో మచ్చల పురుగు నివారణకు పురుగు మందును పిచికారీ చేసి నివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం వ్యవసాయ మరియు అనుబంధ శాఖల ద్వారా అమలు జరుగుతున్న పలు పథకాల గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు డి. కొండబాబు, దాసరి మాలకొండయ్య, డి. మల్లికార్జున,సాగునీటి చెరువు అధ్యక్షుడు, రైతులు వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పంటల సాగులో మెలకువలు తెలుసుకోవాలి

ముండ్లమూరు : రైతులు పంటల సాగు చేసే సమయంలో వ్యవసాయ అధికారుల సూచనలు తీసుకొని సాగు చేసినట్లయితే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించ వచ్చునని మండల వ్యవసాయ అధికారి ఎండీ ఫరూక్ అన్నారు. మంగళవారం మండలంలోని పులిపాడు, పెద ఉల్లగల్లులో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. రైతులు సాగు చేసిన వరి పొలాలను పరిశీలించారు. తెగుళ్ల నివారణకు ఎలాంటి మందులు వాడాలనేది రైతులకు వివరించారు. విచ్చలవిడిగా పురుగు మందులు వాడవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో వీఏఏ ఆంజనేయులు, ప్రదీప్ తదితరులు ఉన్నారు.



గౌతమీ విద్యాసంస్థల సిల్వర్‌జూబ్లీ వేడుకల్లో పాల్గొన్న గుంటూరు అడిషనల్ ఎస్పీ హనుమంతు, కళాశాల కరస్పాండెంట్ గుండారెడ్డి, పూర్వపు విద్యార్థులు

యువతపైనే దేశ భవిష్యత్తు

దర్శి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): దేశ భవిష్యత్తు యువతపై ఆధారపడి ఉందని గుంటూరు అడిషనల్ ఎస్పీ హనుమంతు పేర్కొన్నారు. దర్శిలో జరిగిన గౌతమీ విద్యా సంస్థల సిల్వర్‌జూబ్లీ వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ విద్య మనిషి తలరాతను మార్చుతుందని, అందరూ ఉన్నత చదువులు చదువుకొని వృద్ధిలోకి రావాలని ఆకాంక్షించారు. గౌతమీ విద్యా సంస్థల్లో చదివిన ఎంతోమంది అనేక రంగాల్లో రాణిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో గౌతమి విద్యాసంస్థల అధినేత కె. గుండారెడ్డి, ప్రిన్స్‌పాల్ నాగేంద్రబాబు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచిత పశు వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

పామూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఉచిత పశు వైద్య శిబిరాలను పశు పోషకులు సద్వినియోగం చేసుకోవాలని మోపాడు ప్రాజెక్టు చైర్మన్ చుంచు కొండయ్య అన్నారు. మండలంలోని కంభాలదిన్నె గ్రామంలో ఏర్పాటు చేసిన ఉచిత పశు వైద్యశిబిరాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు.పశువైద్యాధికారి డాక్టర్ ఈమని శ్రీసాయి, మండల తెలుగురైతు అధ్యక్షుడు మన్నం రమణయ్య, టీడీపీ గ్రామ ఉపాధ్యక్షుడు ఏలూరి నరసింహారావు, మాజీ ఎంపీటీసీ గోళ్ల కొండయ్య, యాదాల చెన్నకేశవులు, పోకా ప్రసాద్,సిబ్బంది, రైతులు పాల్గొన్నారు. సీఎస్‌పురం మండలంలోని కంభంపాడులో ఉచిత పశు వైద్యశిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మర్రి రామయ్య, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

31న జాబ్ మేళా

దర్శి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): స్థానిక పొట్టి శ్రీరాములు డిగ్రీ కళాశాలలో ఈనెల 31వ తేదీన జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ పెద్దిరాజు, ప్రిన్సిపాల్ వీవీ నారాయణ తెలిపారు. ఈ జాబ్ మేళాలో హైడ్రోడ్రక్స్, ఎస్‌బీఐ క్రెడిట్ కార్డ్స్, ఎయిర్‌టెల్ పేమెంట్ బ్యాంకు తదితర సంస్థలు పాల్గొంటాయని వారు వివరించారు. 28 సంవత్సరాల వయస్సు లోపు యువతీ, యువకులు దరఖాస్తులు చేసుకోవచ్చని వారు వివరించారు. రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్, జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయం సహకారంతో ఈ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యువతీ, యువకులు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

అంగన్‌వాడీ పిల్లలకు ఆధార్ నమోదు

పామూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకొన్న పిల్లలకు ఆధార్‌ను తప్పని సరిగా నమోదు చేయించాలని ప్రాజెక్టు అధికారిని పి. సరోజిని తెలిపారు. మండలంలోని బలిజపాలె అంగన్‌వాడీ కేంద్రంలో సెక్టారు స్థాయి సమావేశం మంగళవారం నిర్వహించారు. పిల్లల పుట్టిన తేదీ సర్టిఫికెట్‌ను తెచ్చుకొని ఆధార్ నమోదు చేయించుకోవాలన్నారు. కేంద్రాల్లో పరిశుభ్రతకు కార్యకర్తలు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

ఎంపీయూపీ పాఠశాలను గ్రామంలోనే కొనసాగించాలి

ఎంపీయూపీ పాఠశాలను గ్రామంలోనే కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ విద్యాశాఖ సిబ్బందికి టీడీపీ ఒంగోలు తెలుగుయువత అధికార ప్రతినిధి షేక్ రజ్జబ్ బాష ఆధ్వర్యంలో టీడీపీ శ్రేణులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. మండలంలోని కోవిలంపాడు గ్రామంలోని ఎంపీయూపీ పాఠశాలను తొలగించి దాని స్థానంలో మోడల్ ప్రాథమిక పాఠశాలను ఏర్పాటు చేయాలనే అధికారుల నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఆయన కోరారు. టీడీపీ గ్రామ అధ్యక్షుడు షేక్ నాయబ్‌రసూల్, సయ్యద్ దౌలత్, పాలపర్తి నారాయణ, కాలువ నరసయ్య, మోహన్‌రెడ్డి, ఖలీల్ ఉన్నారు.


పంటను పరిశీలిస్తున్న
వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు లక్ష్మీనారాయణ, రమేష్

వేసవిలో కూరగాయల సాగు లాభదాయకం

దొనకొండ, జనవరి 28(ఆంధ్రజ్యోతి): వేసవిలో గ్రామాల్లో రైతులు ఆకుకూరలు, కూరగాయల సాగుపై దృష్టిసారిస్తే లాభదాయకంగా ఉంటుందని మార్కాపురం ఉద్యాన శాఖ అధికారి రమేష్ స్పష్టం చేశారు. మండలంలోని మల్లంపేట, రుద్రసముద్రం గ్రామాల్లో మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నీరు అందుబాటులో ఉన్న రైతులు టమోటా, పచ్చిమిరప, వంగ, గోరుచిక్కుడు, ఆకుకూరల్లో తోటకూర, చుక్కకూర, మెంతి కూర, గోంగూర, తీగజాతిలో దోస, కాకర, సొర, బీర, దొండ పండించినట్లయితే వేసవిలో ఉండే అధిక మార్కెట్ ధరలతో ఆదాయాన్ని పొందవచ్చని తెలిపారు. కూరగాయల సాగుకు సబ్సిడీ ఉంటుందన్నారు. వాణిజ్య పంటలైన మిర్చి, పొగాకు, పత్తి పంటలను తగ్గించి కూరగాయలు, ఆకుకూరలను పెంచుకుంటే తక్కువ సమయంలో మంచి లాభాలు పొందవచ్చని తెలిపారు. మార్కెట్‌లో ఏడాది పొడవునా వీటికి గిరాకీ ఉంటుందన్నారు. మండల వ్యవసాయాధికారి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ మండలంలో 5,600 ఎకరాల్లో కంది పంట సాగుచేశారన్నారు. కంది రైతులు పంటను కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకోవాలంటే ముందుగా గ్రామాల్లోని రైతుసేవా కేంద్రాల్లో రిజిస్టర్ చేయించుకోవాలన్నారు. భవిష్యత్తులో కంది ధర బహిరంగ మార్కెట్‌లో కనీస మద్దతు ధర కంటే తక్కువగా ఉండే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు మురళీ, యోగేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

కల్లుగీత కార్మికులకు మద్యం షాపు కేటాయిస్తాం

● ఎక్సైజ్ సీఐ విజయభాస్కర్

కనిగిరి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : కల్లుగీత కార్మికులకు, ఆయా ఉపకులాలకు చెందిన వారికి మద్యం షాపు మంజూరు చేస్తామని కనిగిరి ఎక్సైజ్ సీఐ విజయభాస్కర్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గౌడ ఉపకులానికి చెందిన వారిలో కనిగిరి పరిధిలో సీఎస్‌పురం మండలంలో 1, పీసీపల్లి మండలంలో 1, వెలిగండ్ల మండలంలో 1 షాపును ఆయా మండలాల్లో ఎక్కడైనా మద్యం షాపు పెట్టుకోవచ్చని తెలిపారు. దరఖాస్తు దరావత్తు కింద రూ.2లక్షలు నాన్ రిఫండబుల్ ఫండ్ (తిరిగి ఇవ్వని నగదు) చెల్లించాలని తెలిపారు. అయితే ఒక వ్యక్తి ఎన్ని దరఖాస్తులైనా వేయవచ్చని తెలిపారు. ఫిబ్రవరి 5వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకస్తామని,7వ తేదీన డ్రాలో గెలుపొందిన వారికి అదే రోజు షాపులను కేటాయిస్తామని తెలిపారు. 2024-25 సంవత్సరానికి గాను రూ.18.33 లక్షలు, 2025 - 26 సంవత్సరానికి రూ. 30.25లక్షలు చెల్లించాలని తెలిపారు. దరఖాస్తు చేసుకోదలచిన వారు తప్పని సరిగా కుల ధ్రువీకరణ పత్రాన్ని వెంట తీసుకు రావాలని సూచించారు. దరఖాస్తులు స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఏరియా కోఆర్డినేటర్ వసుంధరాదేవి

సీఐఎఫ్, స్త్రీనిధి రుణాలు సకాలంలో చెల్లించాలి

● దర్శి ఏరియా కోఆర్డినేటర్ సీహెచ్ వసుంధరాదేవి

తాళ్లూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి):పొదుపు మహిళలు సీఐఎఫ్, స్త్రీనిధి రుణాలు సకాలంలో చెల్లించాలని దర్శి ఏరియా కోఆర్డినేటర్ సీహెచ్ వసుంధరాదేవి తెలిపారు.స్థానిక వెలుగు కార్యాలయంలో మండల మహిళాసమాఖ్య సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్త్రీ నిధిరుణాలు దాదాపు రూ. 10 కోట్లు ఇవ్వగా ఇప్పటి వరకు చెల్లింపులు సక్రమంగా ఉన్నాయన్నారు. మూడు నెలలుగా లక్ష్యం కంటే తక్కువగా వసూళ్లు జరుగుతున్నాయని చెప్పారు. రెండేళ్లుగా కొందరు పొదుపు మహిళలు చెల్లించాల్సిన స్త్రీనిధి రుణం చెల్లించడం లేదన్నారు.

గ్రామమహిళా సంఘాలు బకాయి ఉన్న మహిళలవద్దకు వెళ్లి బకాయి వసూలు చేయాలని తెలిపారు.స్త్రీనిధి బకాయిల వసూళ్లు రానున్న రెండురోజుల్లో పూర్తి చేయాలన్నారు. సీఐఎఫ్ బకాయిలు పేరుకుపోయి ఉన్నాయని, వీవోఏలు వసూళ్లపై దృష్టి సారించాలన్నారు. ఈకార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు ఎం.సుజాత, వెలుగు ఏపీఎం దేవరాజ్, స్త్రీనిధి జిల్లా మేనేజర్ పవన్‌కల్యాణ్, సీసీలు మోహన్‌రావు, సుచీంద్ర, గ్రామమహిళాసంఘాల అధ్యక్షులు, వీవోఏలు పాల్గొన్నారు.

క్రైం సమాచారం

జూదరుల అరెస్టు

● రూ.1.02 లక్షల నగదు స్వాధీనం

దర్శి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని జముకులదిన్నె గ్రామంలో పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను మంగళవారం దర్శి పోలీసులు పట్టుకున్నారు. అక్కడ పేకాట ఆడుతున్న సమాచారంతో దర్శి ఎస్సై ఎం. మురళీ తన సిబ్బందితో వెళ్లి పేకాట ఆడుతున్న నిందితులను అరెస్టు చేశారు. వారి వద్ద ఉన్న రూ.1.02 లక్షల నగదును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. ఈ దాడుల్లో ఏఎస్సై రాంబాబు, హెడ్ కానిస్టేబుల్ శంకర్, కానిస్టేబుళ్లు గురుబాబు, మహేష్, జిలానీలు పాల్గొన్నారు.

చోరీ కేసులో వివరాల సేకరణ

కురిచేడు, జనవరి 28(ఆంధ్రజ్యోతి): కురిచేడు నుసుం బజారు ప్రాథమిక పాఠశాల ఎదురుగా నివాసం ఉంటున్న మాదినేని హనుమంతరావు గృహంలో సోమవారం మధ్యాహ్నం చోరీ జరిగింది. 10 సవర్ల బంగారాన్ని అపహరించారు. ఈవిషయమై కురిచేడు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయింది. ఒంగోలు నుంచి క్లూటీం వచ్చి వివరాలు సేకరించింది. ఎస్ఐ శివ ఆధ్వర్యంలో క్లూస్‌టీం హెడ్ కానిస్టేబుల్ ఇబ్రహీం అతని బృందం వేలిముద్రలు, దొంగలు వదిలి వెళ్లిన వస్తువులను సేకరించింది. త్వరలోనే దొంగలను పట్టుకుంటామని ఎస్ఐ తెలిపారు.


దొంగతనం జరిగిన గృహంలో వివరాలు సేకరిస్తున్న క్లూస్‌టీం సభ్యులు

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



బాపట్ల జిల్లా వార్తలు

3 | బుధవారం 29 జనవరి 2025

ధాన్యానికే ప్రాధాన్యం

అదనంగా ధాన్యం సేకరణకు కసరత్తు



డీఆర్సీ సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారథి, చిత్రంలో మంత్రులు అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, ఎంపీ కృష్ణప్రసాద్, కలెక్టర్ వెంకటమురళి, జడ్పీ చైర్‌పర్సన్ క్రిస్టినా, ఎమ్మెల్యేలు ఏలూరి సాంబశివరావు, కొండయ్య యాదవ్

- గత సమావేశానికి సంబంధించి ఏటీఆర్ సమర్పణ
- జిల్లాను పర్యాటకంలో అగ్రగామిగా తీర్చిదిద్దుతాం
- డీఆర్సీ సమావేశంలో కీలక అంశాలపై సమగ్ర చర్చ

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

"గతేడాది మద్దతు ధరకు ధాన్యం సేకరణ విషయంలో కేవలం 7,000 టన్నులకే పరిమితం చేయడంతో పాటు వాటి తాలూకా బకాయిలు కూడా మా ప్రభుత్వమే చెల్లించింది. ఈ ఏడాది ఖరీఫ్‌లో 50,000 టన్నుల ధాన్యం సేకరించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అది పూర్తి కాగానే మరో 7,500 టన్నుల వరకు అనుమతులిచ్చాం. ఇంకా అదనంగా మరికొంత ధాన్యాన్ని మద్దతు ధరకు సేకరించే విధంగా సంబంధిత శాఖలతో మాట్లాడి అనుమతులిచ్చేలా చూస్తాం. గత ప్రభుత్వం అత్యంత దుర్మారంగా ధాన్యం కొనుగోళ్లను 7,000 టన్నులకే పరిమితం చేయడంతో పాటు అన్నదాతల సంక్షేమాన్ని గాలికొదిలేసింది. కానీ ఇప్పుడు అన్నదాతల ఇక్కట్లను తీర్చడమే ప్రధాన ఎజెండాగా ముందుకెళుతున్నాం. ధాన్యం సేకరణ విషయంలో అన్నదాతలకు మేలు జరిగేలా చూస్తాం" అని ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. కలెక్టరేట్ వేదికగా మంగళవారం జరిగిన డీఆర్సీ సమావేశంలో ఆయన మాట్లాడారు. డీఆర్సీలో వివిధ అంశాలు ప్రస్తావనకు రాగా ధాన్యం కొనుగోలు విషయంపైనే ప్రధానంగా చర్చ జరిగింది. గతేడాది నవంబరు 5న జరిగిన డీఆర్సీ సమావేశంలో చర్చకు వచ్చిన అనేక అంశాలపై ఏటీఆర్(యాక్షన్ టేకెన్ రిపోర్టు)ను ఇన్‌చార్జి మంత్రి అడిగి తెలుసుకున్నారు. గత సమావేశంలో చర్చకు వచ్చిన బాపట్ల మెడికల్ కళాశాల నిర్మాణ పనుల పురోగతికి సంబంధించి వివరాలు అడగ్గా త్వరలోనే పనులు పట్టాలెక్కించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని అధికారులు తెలిపారు. అదే విధంగా కాలువల్లో పూడికతీతలకు సంబంధించి గత సమావేశంలో ప్రధానంగా చర్చకు రాగా ప్రస్తుతం పనుల పురోగతి ఏటీఆర్‌ను ఇన్‌చార్జి మంత్రి అడిగి తెలుసుకున్నారు. అసైన్డ్ భూముల పరాధీనం విషయంలో తీసుకున్న చర్యలను కూడా డీఆర్సీ సమావేశంలో ఇన్‌చార్జి మంత్రి అడిగి తెలుసుకున్నారు. ఈ సమీక్షలో జిల్లా మంత్రులు అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, ఎమ్మెల్యేలు కొండయ్య, ఆనంద్‌బాబు, ఏలూరి సాంబశివరావు, వేగేశన నరేంద్రవర్మ, కలెక్టర్ వెంకటమురళి, ఎస్పీ తుషార్‌డూడీ, జేసీ ప్రఖర్‌జైన్‌తో పాటు జిల్లా అధికారులు పాల్గొన్నారు

నాణ్యత లేకుంటే ఒప్పందాలు రద్దు

రోడ్డు మరమ్మతు పనులలో కాంట్రాక్టర్లు నాణ్యత పాటించకపోతే ఒప్పందాలు రద్దు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. గుంతలు పూడ్చే కార్యక్రమం జాప్యం జరగడంపై ఆర్ అండ్‌బీ అధికారులను ఇన్‌చార్జి మంత్రి ప్రశ్నించారు. నిధులు మంజూరు చేస్తున్నప్పటికీ సీఆర్ఎఫ్, ఎండీఆర్ఎఫ్ పనులు పెండింగ్ ఎందుకు ఉంటున్నాయని అధికారులను మంత్రి నిలదీశారు. జిల్లాలో లిఫ్ట్ ఇరిగేషన్ కీలకమని 92 ఎత్తిపోతల పథకాల కింద 1.07 లక్షల ఎకరాలు సాగవుతున్నాయని ఇందులో కేవలం 67 పథకాలు మాత్రమే పనిచేస్తున్నాయని మిగిలిన వాటి మరమ్మతుల కోసం ప్రతిపాదనలు సిదం చేయాలని ఆదేశించారు. సూర్యలంక , చీరాల బీచ్ అభివృద్ధి కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళతామని మంత్రి చెప్పారు. సూర్యలంక బీచ్ అభివృద్ధికి సంబంధించి రూ.97 కోట్లతో ఇప్పటికే డీపీఆర్‌లు సిద్ధం చేసినట్లు మంత్రి వివరించారు

సూర్య ఘర్ పథకం కింద 334 యూనిట్లు : మంత్రి గొట్టిపాటి

సూర్యఘర్ పథకం కింద ఇప్పటికే 334 యూనిట్లు ఏర్పాటు చేశామని, భవిష్యత్తులో మరింత విస్తరిస్తామి విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. అద్దంకి నియోజకవర్గాన్ని ఇందుకు సంబంధించి పైలట్ ప్రాజెక్టుగా తీసుకుంటామన్నారు. కొరిశపాడు ఎత్తిపోతల పథకం కింద భూసేకరణ పూర్తి చేయాలని అధికారులను మంత్రి గొట్టిపాటి ఆదేశించారు. గుండ్లకమ్మ రిజర్వాయర్‌లో మత్స్య సంపద వృద్ధికి నాలుగు లక్షల చేపల పిల్లలు వేయాలన్నారు

మరమ్మతు పనుల్లో వేగం పెరగాలి : మంత్రి అనగాని

సాగునీటి కాలువల మరమ్మతుల పనుల్లో వేగం పెరగాలని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆదేశించారు. వెల్లటూరు కాలువ పనులలో జాప్యం తగదన్నారు. రేపల్లె నియోజకవర్గంలో ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీలు చేపట్టాలన్నారు. రికార్డులు చూపడంలో ఉద్దేశపూర్వకంగా తప్పుదోవ పట్టిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రేపల్లె రహదారులపై గుంతలు పూడ్చడంలో నాణ్యత లోపించడంపై అధికారులను ప్రశ్నించారు

మూడో విడతలో నిధులు : ఎంపీ

బాపట్లలో మెడికల్ కళాశాల నిర్మాణానికి మూడో విడతలో నిధులు విడుదల చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చినట్లు ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ డీఆర్సీ సమావేశంలో తెలిపారు. ఎస్సీ, ఎస్టీలకు రుణ సదుపాయం కల్పించడంతో పాటు సూర్య ఘర్ పథకానికి బ్యాంకులు సహకరించే విధంగా చూడాలని ఎంపీ తెన్నేటి కోరారు

డీపీఆర్‌లు పంపాం : కలెక్టర్

ప్రతి ఇంటికి సురక్షితమైన తాగునీరు అందించడానికి రూ.3,500 కోట్లతో డీపీఆర్‌లు పంపినట్లు కలెక్టర్ వెంకటమురళి డీఆర్సీలో మంత్రులకు వివరించారు. అమృతధార పథకం కింద 2.16 లక్షల గృహాలకు కుళాయి కనెక్షన్లు ఇవ్వడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. గుండ్లకమ్మ రిజర్వాయర్ నుంచి రెండు మండలాలకు నీరందించడానికి రూ.200 కోట్లతో ప్రతిపాదనలు పంపినట్లు వివరించారు.

ఎమ్మెల్యేలు మాట్లాడుతూ...

పర్చూరు నియోజకవర్గంలో ఎత్తిపోతల పథకాలు నిర్వహణ అధ్వానంగా ఉందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు డీఆర్సీ సమావేశంలో ప్రస్తావించారు. దాదాపు 40 వేల ఎకరాలు వీటిపై ఆధారపడి ఉన్నాయని, నిర్వహణ సరిగా లేకపోవడంతో రైతులు నష్టాల బారిన పడుతున్నారని ఈ అంశంపై దృష్టి పెట్టాలని అధికారులను కోరారు. లంకగ్రామాలలో తాడిగిరిపాలెం, పోతర్లంక, ఎత్తిపోతల పథకాలు మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురావాలని మాజీ మంత్రి, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద్‌బాబు కోరారు. కాలువల ఆక్రమణలను అరికట్టేవిధంగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ కోరారు. కాల్వలపై లస్కర్లను నియమించాలని, ఎత్తిపోతల పథకాలకు నిరంతర విద్యుత్ అందించాలన్నారు. చీరాల నియోజకవర్గంలో సాగు పూర్తిగా ఎత్తిపోతల పథకాలపైనే ఆధారపడి ఉందని, వాటి మరమ్మతు పనులు వేగంగా జరిగేలా చూడాలని ఎమ్మెల్యే కొండయ్య కోరారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు సంబంధించి గతంలోపంపిన ప్రతిపాదనలకు ఆమోద ముద్రవేయడంతో పాటు నిధుల మంజూరు అంశాన్ని కూడా పరిశీలించాలని మంత్రులను ఎమ్మెల్యే కొండయ్య కోరారు.

సిమెంట్ చాలా పొదుపుగా... కంకర మరింత ఎక్కువగా, ఇసుక ఇంకాస్త దండిగా కలిపేసి కట్టడాలు కట్టేస్తే ఏమవుతుందో అందరికీ తెలిసిందే. అయితే రైల్వే కాంట్రాక్టర్లు మాత్రం దీనిని తూచా తప్పకుండా పాటిస్తూ నిర్మాణాలు చేసేస్తున్నారు. తాము నిర్మిస్తున్న కట్టడాలు అత్యంత పటిష్టతతో ఉండేందుకు జాగ్రత్తలు తీసుకుంటున్నామనుకుంటున్నారో! లేక రైల్వే పనులేకదా! ఎవరు చూడొచ్చారులే అనుకున్నారో కానీ, ఇష్టమొచ్చినట్టు చేసేస్తున్నారు. అమృత భారత్ పేరుతో కేంద్రం అన్ని రైల్వే స్టేషన్‌లను ప్రయాణీకులకు ఆధునిక సౌకర్యాలు కల్పించేందుకు రూ. వేల కోట్లు ఖర్చుపెట్టి నిర్మాణాలు చేపడుతుంటే, వాటిని పట్టుమని పదికాలాలపాటు పదిలంగా ఉండేలా కాకుండా పేకమేడల్లా కట్టేస్తుండటం ఆందోళన కలిగించే విషయం.

- అమృత్ భారత్ నిధులతో జరుగుతున్న రైల్వే పనుల్లో డొల్లతనం
- పర్యవేక్షణా అంతంతమాత్రమే
- కాంక్రీట్ పనుల్లో అంతా ఇసుకే
- ఇటుకలూ నాశిరకమే...
- రూ. కోట్ల విలువైన పనుల్లో అంతా తూతూ మంత్రమే

రైల్వే పనుల్లో ఇష్టారాజ్యం



తెనాలి రైల్వేస్టేషన్‌లో అమృత భారత పథకం కింద జరుగుతున్న అభివృద్ధి పనులు

తెనాలి, జనవరి 28, (ఆంధ్రజ్యోతి): సాధారణంగా ఏ కాంక్రీట్ మిశ్రమాన్నయినా సిమెంట్, కంకర, ఇసుక 1:2:4 నిష్పత్తిలో కలుపుతారు. అయితే రైల్వే పనులు చేస్తున్న కూలీలను ప్రశ్నిస్తే మాత్రం తడుముకోకుండా 1:4:6 రేషియోలో కలుపమన్నారని చెబుతుంటే, ఆచరణలో మాత్రం 1:7:6 రేషియోలో కలిపేస్తూ కనిపించారు. 1 కట్ట సిమెంట్‌కు బదులు అరకట్ట సిమెంట్, 7 బొచ్చెల ఇసుక, 6 బొచ్చెల కంకర కలిపేసి పనులు చేసేస్తున్నారు. ఇదంతా ప్లాట్ ఫారం పనులకోసం చేస్తుంటే, భవనాలు, ఆధునిక టాయిలెట్స్ మాత్రం ఇంకొంత మెరుగుగా, ఈ పాళ్లను తగ్గించి సిమెంట్ కలిపి కట్టడాలు కట్టేస్తున్నారు. 1వ నంబర్ ప్లాట్‌ఫారం, లోపలి ప్లాట్ పారంలపై పనులు జరుగుతుంటే సాయంత్రం వరకు ఒక్క వర్క్‌ఇన్స్‌పెక్టర్ కానీ, ఇంజనీరింగ్ సిబ్బందికానీ లేకుండా, ఎటువంటి పర్యవేక్షణ లేకుండా కూలీలే కాంక్రీట్ ఇష్టమొచ్చినట్టు కలిపేసి కట్టడాలు కట్టేస్తుండటం విశేషం. అయితే సాయంత్రానికి మాత్రం ఒకరిద్దరు వచ్చి, వారు చేసిన పనిని లెక్కవేసుకుని వెళ్లిపోవటం మినహా, కచ్చితమైన పర్యవేక్షణ మాత్రం లోపించింది. దీంతో తాపీ కూలీలే ఇక్కడ ఇంజనీర్‌ల తరహాలో పనులు చేసేయటం, తమ కాంట్రాక్టర్‌కు చెప్పినదానికంటే మరికొంచెం లాభం కలిగించేలా నిబంధనలకు విరుద్ధంగా, పరిమితికి మించి కాంక్రీట్ మిశ్రమాన్ని కలిపేయటం వంటివి ఇక్కడ షరా మామూలయిపోయాయి.

నాణ్యత డొల్లేనా!

ప్లాట్‌పారంపై గ్రానైట్ సొబగులు అద్దేలా పనులు చేస్తున్నారు. ఒకటి, రెండు, మూడో నంబర్ ప్లాట్‌ఫారంలపై పనులు జరిగిపోతున్నాయి. అయితే వాటిని అమర్చటానికి కింద కాంక్రీట్ బెడ్ వెయ్యాల్సిఉంటే, దీనిని పూర్తి నిబంధనలకు విరుద్ధంగా కలిపేస్తున్నారు. 1:2:4 నిష్పత్తి పక్కనపెట్టేసి, 1:4:6 అంటూ ఆ రేషియో ప్రకారం కూడా కాంక్రీట్ కలపటంలేదు. మొత్తం ఇసుక, మెటల్ మాత్రమే ఉండటంతో నాణ్యతలో డొల్లతనం ప్రత్యక్షంగానే కనిపిస్తోంది. దీనికి ముందు కాంక్రీట్ పటిష్టంగా ఉండటానికి అంచులవెంట బలంగా ఉండేలా ఇటుక రాళ్లతో నిర్మాణం చేస్తున్నారు. అయితే దీనికి వాడుతున్న ఇటుక నాశిరకంగా ఉంటే, సిమెంట్ వేశారా! లేదా! అన్నట్టున్న మిశ్రమంతో పనులు చేయటం విశేషం. అయితే ఇటుకలు అతికేందుకు వేసిన సిమెంట్ అక్కడక్కడ ఊడిపోయి, రాళ్లు కదిలిపోయి కనిపిస్తున్నాయి. ఇదిలాఉంటే... లోపల మసిపూసి, పైన అందంగా గ్రానైట్ రాళ్లు వెసినా, ప్లాట్‌ఫారం అంచుల వెంట సిమెంట్ చెయ్యాల్సిఉంటే, దీనిలోనూ కక్కుర్తి చూపుతున్నారు. ప్లాస్టింగ్ చేసిన ప్రదేశాల్లో ఇసుక రాలుతున్నట్టు కనిపించటం విశేషం. ఇదికాక ప్లాట్‌ఫారం షెడ్డు వేశాక దానికి ఉపయోగించిన ఇనుప గడ్డర్‌ల వంటి పిల్లర్ల దగ్గర ప్రయానికులు కూర్చునేందుకు ఇటుకతో ఒంటిరాయి గోడలు నిర్మించి, దానిపై గ్రానైట్ రాళ్లు అమర్చుతున్నారు. అయితే కింద జరుగుతున్న నిర్మాణంలో రాళ్లు ఒక సమస్యయితే, సిమెంట్ సరిగాలేక రాళ్లు అప్పుడే ఊడిపోతున్నాయి. గతంలో ఇదే తరహాలో వేసిన అరుగుల గ్రానైట్ పలకలు పగిలిపోయి కూర్చేటానికి వీలు లేకుండా పగిలిపోయి కనిపిస్తున్నా, మళ్లీ అదే తరహాలో పనులు చేయటం వారికే సాధ్యం. ఇది కాక... ప్రయాణికుల విశ్రాంతి గది, దానిలోనే ఆధునిక హంగులతో టాయిలెట్స్ నిర్మాణం చేపట్టారు. ఈ తరహాలో రెండు భవనాలు నిర్మాణం జరుగుతుంటే, వాటి పిల్లర్లే కాంక్టీట్ ఊడిపోయి కనిపిస్తుంటే దానిపై సిమెంట్ పూతపూసి సరిచేస్తున్నారు. గోడలు కొంతవరకు పగుళ్లు రాకుండా పర్వాలేదనిపిస్తున్నా, ప్లాస్టింగ్‌లోనూ కక్కుర్తి కనిపిస్తూనే ఉంది. కాంక్రీట్ దిమ్మెలతో జరుగుతున్న నిర్మాణాలు, ఫుట్ ఓవర్ బ్రిడ్జి వంటి వాటికి జరుగుతున్న పనుల్లో పిల్లర్ల కాంక్రీట్ పనులు మాత్రం నిబంధనల ప్రకారం జరుగుతున్నట్టు కనిపిస్తున్నాయి. విద్యుత్తు లైన్‌లకు సంబంధించి ఏర్పాటుచేసే బాక్సులకోసం కాంక్రీట్‌తో బాక్సులు నిర్మిస్తుంటే, దీనికోసం కాంక్రీట్‌ను నాశిరకంగా కలుపుతూ కనీసం బొచ్చెలతో కాకుండా ప్లాస్టిక్ కవర్‌లలో కాంక్రీట్‌ను మిక్సర్ నుంచి పోసుకుని బాక్సు గుంతల్లో పోయటం వీరికే సాధ్యమన్నట్టుంది. కనీసం బొచ్చెలు తీసుకుని, దానిలో కాంక్రీట్ పోసుకుని బాక్సులకు పోయటం కాకుండా కవర్‌లతో పోస్తుండటంతో ఆ మిశ్రమంలోని సిమెంట్ నీటి రూపంలో సగం కిందకు కారిపోతూనే ఉంది. వీటినిర్మాణంలో పటిష్టత ఎంతనేది ప్రశ్నార్థకమే. భవన నిర్మానాలకు సంబంధించి ఆధునిక పరికరాలు చాలా వచ్చేస్తే, ఇక్కడ అవేమీ ఉపయోగించకపోగాఎవరూ వాడనటువంటి పద్ధతిలో పనులు చేయటం విశేషం. దీని పై వివరణ కోరేందుకు రైల్వే ఇంజనీరింగ్ విభాగానికి చెందిన అధికారులను సంప్రదిస్తే కిందిస్థాయి అధికారులు మాకు వివరణ ఇచ్చే అధికారం లేదని, ఉన్నతాధికారులనుంచి తీసుకోవాలనే సమాధానం వచ్చింది. రైల్వే ఉన్నతాధికారులకోసం ప్రయత్నం చేస్తే అందుబాటులో లేని పరిస్థితి.

పగుళ్లిస్తున్న అంచులు





ఇసుక కనిపిస్తూ రాలిపోతున్న ప్లాస్టింగ్

భారీ అభివృద్ధి జరుగుతుంటే...

రైల్వేశాఖ పరిధిలో అమృత్‌భారత్ పథకం ద్వారా వివిధ రైల్వేస్టేషన్లను ఆదునీకరించటం, వసతులు కల్పించటం, సుందరంగా తీర్చిదిద్దటం వంటి పనులను చేపట్టారు. దీనిలో తొలి విడత స్టేషన్‌లలో తెనాలి రైల్వే స్టేషన్‌కూడా ఒకటి. ఇక్కడ ప్లాట్ ఫారంల విస్తరణ, ప్లాట్‌ఫారం షెడ్‌ల నిర్మాణం, ఆధునిక వసతులతో టాయిలెట్స్ నిర్మాణం, ప్రయాణికుల విశ్రాంతి భవనాల వంటివి నిర్మిస్తున్నారు. అమృత్ భారత్ కాక, గతిశక్తి కిం ద ఆరో ప్లాట్‌ఫారం, గూడ్స్ షెడ్ ఏర్పాటు, అంధులకు బ్రెయిలీ లిపితో కూడిన బోర్డ్‌ల ఏర్పాటు, పెయిడ్ వెయిటింగ్ లాబీల వంటివి నిర్మిస్తున్నారు. ఆర్.వి.ఎన్.ఎల్ కింద మూడవ రైల్వే లైన్ నిర్మాణ పనులూ జరుగుతున్నాయి. ఇదికాక గతంలో ఎ ప్పుడూ నిర్మించని రీతిలో 12 మీటర్ల వెడల్పులో ఫుట్ ఓబర్ బ్రిడ్జి నిర్మాణం కూడా చేపట్టారు. దీనిపైనే ప్రయాణికులు వేచి ఉండేలా, స్టాల్స్‌తో సహా అన్ని ఏర్పాట్లు ఉండేలా దీని నిర్మాణం ఉండనుంది. అభివృద్ధి పనులయితే గతంలో లేనిరీతిలో జరుగుతుంటే, పనుల్లో నాణ్యత మాత్రం దారుణంగా తయారయింది.

గత ప్రభుత్వంలో ప్రచార్భాటమే

జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారథి

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

గత ప్రభుత్వం ధాన్యం సేకరణ విషయంలో ప్రతి గింజా కొంటామనే ఆర్భాటపు ప్రకటనలకే పరిమితమైంది తప్ప అన్నదాతలను ఆదుకోలేదని బాపట్ల జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. బాపట్ల కలెక్టరేట్‌లో మంగళవారం జరిగిన డీఆర్సీ సమావేశంలో పాల్గొన్న ఆయన అనంతరం మంత్రులు గొట్టిపాటి, అనగానితో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బాపట్ల జిల్లాలో గత ప్రభుత్వం మద్దతు ధరకు సేకరించిన ధాన్యం కేవలం 7,000 టన్నులేనని, జిల్లాలో ఇప్పటికే 57,000 టన్నుల ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేశా మని, మరో 25,000 వరకు ప్రతిపాదనలు పంపామని, అన్నదాతల ప్రయోజనాలే లక్ష్యంగా అడుగులేస్తున్నామని మంత్రి పార్థసారథి తెలిపారు. గత ప్రభుత్వంలో మంచి చేయాలనే తపన లేకుండా పనిచేయడం వల్లనే రెవెన్యూ సదస్సుల్లో పెద్దసంఖ్యలో అర్జీలు వస్తు న్నాయని మంత్రి అనగాని తెలిపారు. పరిష్కారం అవకాశం ఉన్నవాటి విషయంలో వెంటనే ఫలితం చూపెడుతున్నామని, దాదాపు 30 శాతం అర్జీల విషయంలో సాంకేతిక పరమైన చిక్కులు ఇమిడి ఉన్నందువల్ల చేయలేకపోతున్నామని అదే విషయాన్ని స్పష్టంగా చెబుతున్నామని, వాటిని పకడ్బందీగా, పారదర్శకంగా పరిష్కరించేలా అన్ని చర్యలు చేపడుతున్నామని మంత్రి అనగాని అన్నారు. ధాన్యం కొనుగోలు ఇంత పెద్ద ఎత్తున ఎప్పుడు జరగలేదని, గత ప్రభుత్వం పెండింగ్ ఉంచిన రూ.1800 కోట్ల బకాయిలను కూడా తమ ప్రభుత్వం చెల్లించిందని విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు.

యువతకు.. ఆసరా

- స్కిల్‌హబ్ సెంటర్లలో శిక్షణ
- నెలనెలా జాబ్‌మేళాలతో ఉద్యోగాలు
- ఉత్సాహంగా చేరుతున్న యువతీయువకులు

వేమూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): నూతన ఆలోచనలతో యువతకు ఆసరా చూపేందుకు రాష్ట్ర ప్రభుత్వం నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేసింది. ఈ క్రమంలో నియోజకవర్గ కేంద్రాల్లో స్కిల్ హబ్ సెంటర్లను ఏర్పాటు చేసింది. వీటి ద్వారా యువతీయువకులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలను ప్రారంభించింది. తద్వారా శిక్షణ అనంతరం జాబ్‌మేళాలు నిర్వహించి ఉద్యోగ అవకాశాలను అందిస్తోంది. దీంతో అనేక మంది స్కిల్‌హబ్ సెంటర్స్‌లో శిక్షణ పొందేందుకు ఉత్సాహంగా ముందుకు వస్తున్నారు. 18 నుంచి 35 సంవత్సరాల లోపు వయసు కలిగి టెన్త్, ఇంటర్, డిగ్రీ చదివి ఉన్న యువతీ యువకులు ఈ శిక్షణలో చేరవచ్చు. అడ్వాన్సు టెక్నాలజీ ద్వారా ఉపాధి పొందే విధంగా శిక్షణ ఇవ్వడంతో పాటు ప్రముఖ కంపెనీలలో ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నారు. జిల్లాలో పశుసంవర్ధక శాఖకు సంబంధించిన హెల్త్ ల్యాబ్ సూపర్‌వైజర్ల శిక్షణ ఖాజీపాలెంలో ఐటీఐ, టీఈఎస్ శిక్షణ ఇస్తున్నా రు. చీరాల, పరుచూరు, అద్దంకి కేంద్రాలలో డేటా ఎంట్రీ ఆపరేటర్ శిక్షణ ఇస్తున్నారు. బాపట్లలో జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్, వేమూరులో కుట్టు శిక్షణ, డేటా ఎంట్రీ ఆపరేటర్ శిక్షణ అందిస్తున్నారు. ఈ కోర్సుల్లో మూడు నెలల కాలం శిక్షణ పొందాల్సి ఉంది. వేమూరులో కుట్టుశిక్షణలో 60 మంది కోర్సు పూర్తి చేసుకుని సర్టిఫికెట్లు పొందారు. హెల్త్ ల్యాబ్, కంప్యూటర్ శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయి. కోర్సు పూర్తి అయిన వారికి ప్రత్యేకంగా ఇంటర్వ్యూలు నిర్వహించి కనీస వేతనం రూ.12 వేల నుంచి 25 వేల వరకు వేతనం అందించేలా ప్రముఖ కంపెనీలలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారు. వేమూరులో కంప్యూటర్ శిక్షణ పొందుతూనే గత నెలలో డాక్టర్స్ కంపెనీలో సందీప్ అనే యువకుడు ఉద్యోగ అవకాశాన్ని సాధించాడు. స్కిల్ హబ్ సెంటర్లను ఏర్పాటు చేసిన మంత్రి నారా లోకేశ్‌కు యువకులు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నారు.



కుట్టు శిక్షణ అనంతరం ఎమ్మెల్యే ఆనందబాబు నుంచి సర్టిఫికెట్లు అందుకుంటున్న యువతులు

శిక్షణ.. ఉపాధి

స్కిల్ హబ్ సెంటర్స్ ద్వారా కంప్యూటర్ శిక్షణలో మంచి అవగాహన కలుగుతోంది. ఇంటర్ పూర్తి చేసుకున్న తర్వాత డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులో చేరవచ్చు. అడ్వాన్స్ టెక్నాలజీ ద్వారా కంప్యూటర్ శిక్షణలో మంచి అనుభవాన్ని పొందగలుగుతున్నాము. శిక్షణ కాగానే ప్రభుత్వం అందించే ప్రోత్సాహం ద్వారా తప్పనిసరిగా ఉద్యోగం వస్తుంది.

- గుండపనేని హర్షిత



వేమూరులో కంప్యూటర్ శిక్షణలో పాల్గొన్న యువతులు



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి పార్థసారథి, ఎమ్మెల్యేలు కొండయ్య, నరేంద్రవర్మ రాజు

టీడీపీ కూటమితోనే.. అభివృద్ధి

- పవర్‌లూమ్‌తో హ్యాండ్‌లూమ్ కుదేలు
- చేనేతలకు రుణ సాయం అందించాలని ఆదేశాలు
- దేవాంగపురిలో అభివృద్ధి పనులకు మంత్రి పార్థసారథి శంకుస్థాపన

చీరాలటౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమ జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. చీరాల మండలం దేవాంగపురి గ్రామంలో ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య ఆధ్వర్యంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధుల ద్వారా రూ.47.50 లక్షలతో రోడ్డు నిర్మాణాలు చేశారు. ఆయా అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి మంత్రి పార్థసారథి, బాపట్ల ఎమ్మెల్యే నరేంద్రవర్మరాజు హాజరై శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ అగ్గిపెట్టెలో చీరను అమర్చి బ్రిటీషు వారిని అబ్బుర పరిచిన ఘనత చేనేతలదని కొనియాడారు. ఇటీవల జీఎస్టీతో చేనేత రంగం ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు వివరించారు. పవర్‌లూమ్ కారణంగా హ్యాండ్‌లూమ్ కుదేలవుతున్నట్లు చెప్పారు. ఈక్రమంలో స్థానిక నాయకులు సిద్ధి వెంకట బుచ్చేశ్వరరావు చేనేతలకు ఆధునికీకరణ మిషన్‌లు, రుణ సాయం అందించి ఆదరించాలని కోరగా స్పందించిన మంత్రి వేగవంతంగా రుణ సాయం కల్పించేదిశగా అధికారులకు సూచనలు చేశారు. నియోజకవర్గానికి తాగునీటి కోసం ఇప్పటకిప్పుడే రూ.63 లక్షలు మంజూరు చేయించిన ఘనత కొండయ్యదని అభినందించారు. హౌసింగ్ సాయంలో చేనేతలకు అదనంగా రూ.50 వేలు అందిస్తున్నట్లు చెప్పారు. నేతన్నలకు అన్ని విధాలా తోడుంటామని చెప్పారు. అనంతరం స్థానిక కూటమి నాయకులు మంత్రిని సత్కరించారు. కార్యక్రమంలో కలెక్టర్ వెంకటమురళి, ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు, డ్వామా పీడీ విజయలక్ష్మి, హ్యాండ్‌లూమ్ చైర్మన్ సజ్జా హేమలత, తహసీల్దార్ గోపీకృష్ణ, ఎంపీడీవో శివసుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.



పర్చూరులో మురుగు కాలువలను పరిశీలించి, లిక్విడ్‌ను పిచికారీ చేయిస్తున్న జిల్లా మలేరియా అధికారి గోపీనాథ్

దోమల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలి

జిల్లా మలేరియా అధికారి గోపీనాథ్

పర్చూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : దోమల నివారణకు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ గోపీనాథ్ అన్నారు. సీజనల్ వ్యాధులు, రాజోయే వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని మురుగునీటి కాలువలు, దోమలు, వాటి లార్వాలను పరిశీలించే కార్యక్రమంలో భాగంగా మంగళవారం పర్చూరులోని పలు డ్రైనేజీ కాలువలను పరిశీలించారు. ఎక్కడ చూసినా దోమలు, లార్వా ఉధృతి, అస్తవ్యస్తంగా డ్రైనేజీ, మురుగు నీరు నిల్వ ఉండడం పట్ల ఆయన అసహనం వ్యక్తం చేశారు. దోమల నివారణకు ఎబెట్ ద్రావణం పిచికారీ చేస్తున్నారా అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అయితే ఎక్కడ ఎబెట్ ద్రావణం అందుబాటులో లేదని అధికారులు సైతం చెప్పడం గమనార్హం. అందుబాటులో ఉన్న లిక్విడ్ బ్లీచింగ్ ద్రావణాన్ని మురుగు కాలువలో పిచికారీ చేయించారు. దీంతోపాటు, గ్రామంలోని పలు డ్రైనేజీ కాలువతోపాటు, పాఠశాలల్లోని ప్రాంగణాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో చీరాల ఎస్‌యూవో రవికుమార్, సీహెచ్‌వో రావి వరలక్ష్మి, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాలకు దరఖాస్తులు చేయాలి

అద్దంకిటౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం నుంచి వచ్చిన ఆదేశాల మేరకు మండలంలోని బీసీ, ఈబీసీ సబ్సిడీ రుణాలకు సంబంధించి లబ్ధిదారులు ఈ నెల 30 నుంచి ఫిబ్రవరి 5వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో బత్తిన సింగయ్య మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 7వ తేదీలోపు దరకాస్తులు వెరిఫికేషన్, 10వ తేదీలోపు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తి చేసి, అర్హులైన బీసీ, ఈబీసీ లబ్ధిదారులకు రుణాలను అందజేస్తారన్నారు.

బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

» 30 నుంచి ఆన్‌లైన్‌లో పంపాలి

» వచ్చేనెల 8వ తేదీ వరకు గడువు

» ఈడీ వెంకటేశ్వరరావు

ఒంగోలునగరం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : బీసీ కార్పొరేషన్ ద్వారా ఇచ్చే సబ్సిడీ రుణాలకు ఈనెల 30వ తేదీ నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని ఈడీ ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. వచ్చే నెల 8వతేదీ వరకు ప్రక్రియ కొనసాగుతుందన్నారు. వెనుకబడిన తరగతులవారితోపాటు, ఈబీసీ, కమ్మ, రెడ్డి, ఆ ర్యవైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ, కాపు బలిజ, తెలగ, ఒంటరి కులాలకు చెందిన వారు ఓబీఎంఎంఎస్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. స్వయం ఉపాధి పథకాలు స్థాపించుకునేందుకు ప్రభుత్వం బ్యాంకు లింకేజీతో ఈ రుణాలను మంజూరు చేస్తుందని ఆయన తెలిపారు. వీటితోపాటు ఫార్మసీ పూర్తి చేసిన ఆయా వర్గాలకు చెందిన నిరుద్యోగులు జనరిక్ మందుల దుకాణాల ఏర్పాటుకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మార్చి 10 నుంచి 20వ తేదీ వరకు యూనిట్ల గ్రౌండింగ్ జరుగుతుందని వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. బీసీ కార్పొరేషన్ ద్వారా రుణం పొంది ఏర్పాటు చేసుకున్న ప్రతి యూనిట్‌ను జియో ట్యాంగింగ్ చేస్తారని ఆయన తెలిపారు.

కేన్సర్ స్ర్కీనింగ్ పకడ్బందీగా నిర్వహించాలి

డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు



స్కానింగ్ సెంటర్‌లో రికార్డులను పరిశీలిస్తున్న డీఎం హెచ్‌వో వెంకటేశ్వర్లు, సిబ్బంది

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో కేన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో డాక్టర్ టి.వెంకటేశ్వర్లు ఆదేశించారు స్థానిక వైద్యఆరోగ్య శాఖ కార్యాలయంలోని సమావేశపు హాలులో మంగళవారం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల అధికారులు, ఏఎన్‌ఎంలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఏడాది నవంబరు 14నుంచి క్యాన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలు ప్రారంభమైన ఇంత వరకు కొన్ని ప్రాంతాల్లో లక్ష్యాలను పూర్తి చేయలేదన్నారు. అటువంటి ప్రాంతాల్లో వెంటనే పరీక్షలు పూర్తి చేయాలని చెప్పారు. ప్రస్తుతం అమలులో ఉన్న ఎన్‌సీడీ 30 యాప్‌లో ఆన్‌లైన్‌లో అన్ని వివరాలను అప్‌లోడ్ చేయాలన్నారు. ఆన్‌లైన్‌లో ఏదైనా లోపాలు ఉంటే సంబంధింత ఇంజనీర్‌ను సంప్రదించి సమస్యను పరిష్కరించుకునేలా చూసుకోవాలన్నారు. స్ర్కీనింగ్ పరీక్షల లక్ష్యాలను చేరుకొనే విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో నోడల్ అధికారి డాక్టర్ భగీరధి, మాస్‌మీడియా అధికారి శ్రీనివాసరావు, ఎపిడమాలజిస్ట్ విక్టర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

స్కానింగ్ సెంటర్ల తనిఖీ

ఒంగోలు నగరంలోని ప్రైవేటు స్కానింగ్ సెంటర్లను డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్కానింగ్ సెంటర్లలో విధిగా నిబంధనల పాటించాలని, అనుమతులు లేకుండా పరీక్షలు నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. దరఖాస్తులో నమోదు చేసిన డాక్టర్ వివరాలను ప్రతి స్కానింగ్ రూము బయట ఉంచాలని చెప్పారు. రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో మాస్ మీడియా అధికారి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య పెన్షన్ల పరిశీలన

పీసీపల్లి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో ప్రభుత్వం నుంచి హెల్త్ పెన్షన్లు అందుకుంటున్న లబ్ధిదారులను ప్రత్యేక వైద్యబృందం మంగళవారం తనిఖీ చేసింది. గుదేవారిపాలెం, నేరేడుపల్లి, మురుగుమ్మి, గుంటుపల్లి తదితర గ్రామాల్లో 18మంది పక్షవాతం, ఇతర అనారోగ్య కారణాలతో నెలకు 15,000 రూపాయల వంతున హెల్త్‌పెన్షన్లు పొందుతున్నారు. అయితే ఈ హెల్త్‌పెన్షన్లలో గత ప్రభుత్వంలో అక్రమాలు జరిగాయని భావించిన కూటమి ప్రభుత్వం తనిఖీకి ఆదేశించింది.ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రత్యేకంగా నియమించిన డాక్టర్ల బృందం ఆయా గ్రామాలకు చేరుకుని హెల్త్‌పెన్షన్ పొందుతున్న వ్యక్తులను క్షుణ్ణంగా పరిశీలించారు. వారు ఎదుర్కొంటున్న అనారోగ్య సమస్యలు, వారి దగ్గర ఉన్న ట్రీట్‌మెంట్‌కు సంబంధించిన పత్రాలు, ప్రస్తుతం వారు ఉన్న ఫిట్‌నెస్ స్థితిని పరిశీలించి రికార్డు చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యబృందంతో పాటు ఎంపీడీవో ప్రభాకరశర్మ, ఆయా పంచాయతీల కార్యదర్శులు ఉన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ

పామూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తూర్పుకోడిగుడ్లపాడు పంచాయతీ జంగాలపల్లి గ్రామంలోని గంగమ్మతల్లి దేవస్థానానికి వెళ్లేందుకు మంజూరైన సీసీ రోడ్‌కు టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు మంగళవారం భూమి పూజ నిర్వహించారు.

నేతన్నలు, మత్స్యకారుల అభివృద్ధికి పాటుపడతా

ఎమ్మెల్యే కొండయ్య



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య, వేదికపై మంత్రి పార్థసారథి, ఎమ్మెల్యే నరేంద్రవర్మరాజు, కలెక్టర్ వెంకటమురళి, ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు

చీరాలటౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : నేతన్నలు, మత్స్యకారుల అభివృద్ధికి నిరంతరం పాటుపడతానని ఎమ్మెల్యే కొండయ్య అన్నారు. మంగళవారం దేవాంగపురి గ్రామంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధుల ద్వారా రూ.47.50 లక్షలతో రోడ్డు నిర్మాణాలు చేయగా వాటిని గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారది, ఎమ్మెల్యేలు నరేంద్రవర్మరాజు, కొండయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా కొండ య్య మాట్లాడుతూ తాను అధికారంలోకి రాక మునుపు పంట కాలువలు గుర్రపు డెక్కలతో నిండి పారుదల లేక రైతులు ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. కూటమి సర్కార్ అధికారంలోకి రాగానే రూ.కోటి సాయంతో నియోజకవర్గంలోని పంట కాలువలకు పూడికలు తీయించినట్లు చెప్పారు. నేడు కాలువలు కళకళలాడుతున్నాయన్నారు. సముద్రతీరంలో హార్బర్‌తో ఉద్యోగం ఉపాధి ఉంటుందన్నారు. వాటిపై దృష్టి సారించి పరిష్కరిస్తామన్నారు. బాపట్ల ఎమ్మెల్యే నరేంద్రవర్మరాజు మాట్లాడుతూ చీరాల పరిధిలో చేనేతలు అధికమని నిరంతరం శ్రమిస్తున్న శ్రమజీవులని అన్నారు. పవర్‌లూమ్‌తో పోటీ పడుతు నేతన్నలు అవస్థలు పడుతున్నట్లు వివరించారు. సముద్రతీరంలో మత్స్యకారులు ఉపాధికి తిప్పలు పడుతున్నట్లు చెప్పారు. ఈక్రమంలోనే నిత్యం ఎమ్మెల్యే కొండయ్యతో సూర్యలంక నుంచి వాడరేవుకు రోడ్ల నిర్మాణం, హార్బర్, టూరిజం, చేనేత పార్క్ వంటి అంశాలపై చర్చిస్తున్నట్లు చెప్పారు. ఎన్నికల్లో ఎమ్మెల్యే కొండయ్యను సొంత బిడ్డలా ఆదరించాలని ఇకపై ఆయన ఇక్కడ నివాసిగా మారేందుకు పూనుకున్నారని కొనియాడారు. ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీల అభ్యున్నతికి కొండయ్య పాటుపడుతున్నట్లు చెప్పారు. కలెక్టర్ వెంకటమురళి మాట్లాడుతూ హార్బర్ నిర్మాణానికి డీపీఆర్ అనుమతులు పెండింగ్‌లో ఉన్నట్లు చెప్పారు. జిల్లాలో 4మాత్రమే మునిసిపాలిటీలు ఉండగా, 80 శాతం గ్రామీణ ప్రాంతాల నిరుపేదలు ఉన్నట్లు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే 868 సీసీ రోడ్లు మంజూరు కాగా, వాటికి సంబంధించి 157 కిలో మీటర్ల మేర రూ.91కోట్లు అంచనా జరిగినట్లు చెప్పా రు. ఇప్పటికే వాటిల్లో 70 శాతం పనులు పూర్తయినట్లు చెప్పారు. ఒక్క చీరాల్లోనే ప్రస్తుతం రూ.5కోట్లు మంజూరు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు, డ్వామా పీడీ విజయలక్ష్మి, హ్యాండ్‌లూమ్ ఛైర్మన్ సజ్జా హేమలత, తహసీల్దార్ గోపీకృష్ణ, ఎంపీడీవో శివసుబ్రహ్మణ్యం, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కూరగాయల మార్కెట్‌ను పరిశీలించిన మార్కెటింగ్ కమిషనర్



కూరగాయల మార్కెట్‌లో టమాటా బాక్సులను పరిశీలిస్తున్న మార్కెటింగ్ కమిషనర్ విజయసునీత,డిప్యూటీ డైరెక్టర్ ఝాన్సీరాణి, జాయింట్ డైరెక్టర్ శ్రీనివాసరావు

మార్టూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : మార్టూరు కూరగాయల మార్కెట్‌ను మంగళవారం డిప్యూటీ డైరెక్టర్ ఝాన్సీ రాణి, జాయింట్ డైరెక్టర్ శ్రీనివాసరావుతో కలిసి మార్కెటింగ్ కమిషనర్ ఎం.విజయసునీత పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మార్కెట్‌లో కూరగాయలను, టమాటా బాక్సులను, బస్తాలలో ఉన్న మిర్చిని ఇతర కూరగాయల గంపలను పరిశీలించారు. అదేవిధంగా కూరగాయలను ఎక్కడ నుంచి తీసుకువస్తున్నారు, వాటి ధరలు ఎలా ఉన్నాయి, రైతులకు గిట్టుబాటు అవుతుందా లేదా తదితర విషయాలపై రైతులతో మాట్లాడారు. అనంతరం కూరగాయల మార్కెట్‌లో రైతులకు తగిన వసతులు ఉన్నాయా, మార్కెట్‌లో తాగునీరు ఉందా లేదా తెలుసుకున్నారు. సుగాలితండాకు వెళ్లే దారిలో ఉన్న మార్కెటింగ్ శాఖకు చెందిన గోడౌన్ ను పరిశీలించారు. మందు బాబులు ఈ గొడౌన్ ప్రాంగణాన్ని వారి అవసరాలకు వినియోగించుకుంటున్నారని పలువురు రైతులు ఆమె దృష్టికి తీసుకువెళ్లారు. గోడౌన్ ప్రాంగణ అభివృద్ధికి రూ.45లక్షలతో ప్రతిపాదనలు పంపించామన్నారు. పర్చూరు మార్కెట్ పరిధిలో రూ.కోటి వ్యయంతో 11 పనులకు ప్రతిపాదనలు పంపినట్లు పర్చూరు యార్డు సెక్రటరీ డీటీ తిరుపతిరాయుడు కమిషనర్‌కు తెలిపారు. కార్యక్రమంలో డీఈ పవన్ తదితర అధికారులు పాల్గొన్నారు.

పచ్చిమిర్చి కూరగాయల మార్కెట్‌లో ఒక బిల్డింగ్‌ను సివిల్ సప్లయిస్ వారు బియ్యం, తదితర వస్తువులను నిల్వ ఉంచడానికి చాలా కాలంగా స్టాక్ పాయింట్‌గా వినియోగిస్తున్నారు. అయితే ఈ బిల్డింగ్‌ను కూరగాయల వ్యాపారులకు కేటాయిస్తే వాటిలో కమీషన్ ఏజెంట్లకు దుకాణాలు కేటాయించాలని మార్కెట్ అసోసియేషన్ అధ్యక్షుడు గుడిపల్లి సాంబశివరావు మార్కెటింగ్ కమిషనర్ విజయసునీత దృష్టికి తీసుకువెళ్లారు. పలు సమస్యల పరిష్కారంపై ఆమె సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో మార్కెట్‌కు చెందిన దారా రామారావు, శ్రీనివాసరావు, గొట్టిపాటి వెంకట్రావు, శంకర్ పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న కూరగాయల మార్కెట్ వ్యాపారులతో మాట్లాడుతున్న మున్సిపల్ అధికారులు

కొత్త కూరగాయల మార్కెట్‌లో ఉద్రిక్తత

» ఆరుబయట వ్యాపారాల తొలగింపు

» అడ్డుకున్న వ్యాపారులు » అధికారులతో వాగ్వాదం

» 3 గంటలపాటు గందరగోళం

ఒంగోలు, కార్పొరేషన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులోని కూరగాయల మార్కెట్‌లో అనధికారిక వ్యాపారాలపై మున్సిపల్ అధికారులు చర్యలకు ఉపక్రమించారు. కేటాయించిన దుకాణాల్లో కాకుండా ఆరుబయట వ్యాపారాలను తొలగించారు. కొందరు వ్యాపారులు అడ్డుకోవడంతో మంగళవారం ఉదయం ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. ఊరచెరువులోని కూరగాయల మార్కెట్‌లో దుకాణాలను బహిరంగ వేలం ద్వారా వ్యాపారులకు చాలా కాలం క్రితమే కేటాయించారు. కొందరు వ్యాపారులు తమ దుకాణాల్లోకి వెళ్లకుండా ఆరుబయట అమ్ముతున్నారు. దీనిపై వ్యాపారులను కార్పొరేషన్ అధికారులు హెచ్చరించారు. అయినా ఆరుబయట దుకాణాలను తొలగించలేదు. మంగళవారం ఉదయం పోలీసుల సహకారంతో రెవెన్యూ అధికారులు మార్కెట్‌లో ఆరుబయట అమ్మకాల దుకాణాలను తొలగించారు. కొందరు వ్యాపారులు అధికారులకు సహకరించారు. మరికొందరు మాత్రం అడ్డుపడ్డారు. తమ జీవనోపాధిని దెబ్బతీయడానికి వీల్లేదని పట్టుపట్టారు. వ్యాపారులు, అధికారుల మధ్య కొద్దిసేపు వాదులాట జరిగింది. ఉదయం 6 నుంచి 10 గంటల వరకు మార్కెట్‌లో ఇదే గందరగోళం నెలకొంది. వ్యాపారుల్లో కొందరు వైసీపీ సానుభూతిపరులున్నారు. వీరు కొన్నేళ్లుగా కూరగాయల మార్కెట్‌ను తమ కనుసన్నల్లో శాసిస్తూ వచ్చారు. ఇతర సాధారణ వ్యాపారులు సానుకూలంగానే తమ దుకాణాలు తొలగించుకున్నప్పటికీ వైసీపీ సానుభూతిపరులు మాత్రం రాద్ధాంతం చేశారు. రోడ్డుపై పడుకుని నిరసన తెలిపారు. 'మేం ఎన్నో ఏళ్లుగా ఉంటున్నాం. మాజోలికి ఎవరూ రాలేదు. మీరెవరు?' అంటూ కార్పొరేషన్ సిబ్బందిపై వాగ్వాదానికి దిగారు.

● కలెక్టరేట్ ఎదుట నిరసన

మార్కెట్‌లో వ్యాపారాలను తొలగించడాన్ని నిరసిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో ప్రకాశం భవనం వద్ద కూరగాయల వ్యాపారులు నిరసన చేపట్టారు. ఆ సంఘ నాయకుడు చీకటి శ్రీనివాసులు మాట్లాడుతూ ఇక్కడ కొన్నేళ్లుగా వ్యాపారాలు చేసుకుంటున్నారని, అర్ధంతరంగా దుకాణాలు తొలగించడం ద్వారా వ్యాపారులు జీవనోపాధి కోల్పోతారని తెలిపారు. కార్పొరేషన్ అధికారుల వ్యవహరించిన తీరును తాము ఖండిస్తున్నామన్నారు.

● నిబంధనల ప్రకారమే వ్యాపారాలు చేయాలి

మార్కెట్‌లో ఆరుబయట వ్యాపారాలు నిషేధం. మునిసిపల్ నిబంధనల ప్రకారం బహిరంగ వేలంపాట ద్వారా షాపులు కేటాయించాం. దుకాణాలు పొందినవారు అందులో వ్యాపారాలు చేయడం లేదు. కొందరైతే అసలు పన్నులు కూడా చెల్లించడం లేదు. రెవెన్యూ సిబ్బంది అడిగితే తాము షాపులో ఉండటం లేదంటూ దురుసుగా వ్యవహరిస్తున్నారు. దీనిపై చర్యలకు సిద్ధమయ్యాం. ఇకపై ఎవరి దుకాణాల్లో వారే అమ్మకాలు చేసుకోవాలి. నిబంధనలు అతిక్రమించి బయట వ్యాపారాలు చేస్తే శాఖపరంగా చర్యలు తీసుకుంటాం. అందులో భాగంగానే తొలగింపు చేయాల్సి వచ్చింది.

- వెంకటేశ్వర్లు, ఓఎంసీ కమిషనర్

వైన్‌షాపులో చోరీ

» ఖరీదైన మద్యం బాటిళ్లు అపహరణ » శాంతినగర్‌లో ఘటన

» రూ.4లక్షల విలువ ఉండవచ్చని అంచనా

» పరిశీలించిన సివిల్, ఎక్సైజ్ అధికారులు, వేలిముద్రల సేకరణ

» శింగరకొండ సమీపంలోని మూడు దుకాణాల తాళాలు పగులగొట్టిన దొంగలు



శాంతినగర్ వద్ద చోరీ జరిగిన మారుతీ వైన్స్, చోరీజరిగిన వైన్‌షాపును పరిశీలిస్తున్న సీఐ సుబ్బరాజు, షాప్‌లో కట్ చేసిన సీసీ కెమెరాల వైర్లు

అద్దంకి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : మద్యం షాపులో చోరీకి పాల్పడ్డ దొంగలు ఖరీదైన మద్యాన్ని ఎంచుకొని అపహరించుకు పోయారు. బాధితులు, పోలీసుల కథనం మేరకు.. అద్దంకి మండలంలోని శాంతినగర్ (కలవకూరు డొంక) వద్ద మారుతీ వైన్స్, శింగరకొండ సమీపంలో మూడు షాపులలో సోమవారం అర్ధరా త్రి దాటిన తరువాత చోరీలు జరిగాయి. మద్యం షాపులో సుమారు రూ.4లక్షల విలువైన వివిధ బ్రాండ్ల మద్యం అపహరించుకు పోయారు. శింగరకొండ సమీపంలో శ్రీకృష్ణ మందిరం పక్కన ఉన్న మూడు దుకాణాల షట్టర్‌ల తాళాలు పగులగొట్టారు. రెండు దుకాణాలలో ఏమీ లేకపోగా, ఒక దుకాణంలో ఉన్న 3 యాంపిల్ ఫైర్లు, ఒక కీబోర్డు దొంగలించుకుపోయారు. ప్రత్యేక వాహనంలో వచ్చిన దొంగలు వైన్‌షాపు రేకులను తొలగించి లోపలకు ప్రవేశించారు. అందులో ఉన్న 10 కేసుల మద్యంను గోతాలలో వేసుకొని తమ వెంట తెచ్చుకున్న వాహనంలో తీసుకు పోయినట్లు తెలుస్తుంది. కాస్ట్‌లీ మద్యంను ఎంపిక చేసుకొని తీసుకొని పోయి మిగిలిన తక్కువ రకం బ్రాండ్ల మద్యంను మాత్రం అక్కడే వదిలి వేశారు. సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ ముందుగానే కట్ చేసి స్టోరేజ్ యూనిట్ ను కూడా తీసుకు పోయారు.

ఒంటి గంట నుండి 3 గంటల మధ్య లో రెండు చోరీలు జరిగినట్లు భావిస్తున్నారు. శింగరకొండ దేవాలయం వైపు పోలీస్ లు నైట్ బీట్ కు ఒంటి గంట సమయంలో వెళ్ళినప్పుడు ఎలాంటి చోరీ జరగలేదు. మరలా 3గంటల సమయంలో అటు వైపు పోలీస్ లు వెళ్తుండగా మూడు షాపుల షట్టర్ తాళాలు పగులగొట్టి ఉన్నాయి. అదే దొంగల ముఠా బల్లికురవ మండలం వి.కొప్పెరపాడు వద్ద వైన్‌షాపు వద్ద వాచ్‌మెన్ ను బెదిరించి చోరీ కి పాల్పడ్డారు. చోరీ జరిగిన వైన్‌షాపు ను ఎక్సైజ్ సిఐ భవాని పరిశీలించారు. శింగరకొండ సమీపంలో చోరీ జరిగిన షాపులను, శాంతినగర్ వద్ద చోరీ జరిగిన వైన్ షాపు ను అద్దంకి టౌన్ సిఐ సుబ్బరాజు, ఎస్సై ఖాదర్‌బాషా లు పరిశీలించారు. క్లూస్ టీమ్ బృందం వేలిము ద్రలు సేకరించారు. వైన్‌షాపు నౌకరనామా కొల్లా పుల్లారావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కొప్పెరపాడులో..

» వాచ్‌మన్‌పై దాడి

» తాళాలు పగులగొట్టి రూ.20వేలు, 4 కేసుల మద్యం అపహరణ

» కొప్పెరపాడులో ఘటన



వైన్‌షాపులో నగదు చోరీ చేసి లాకర్‌ను బయటపడేసి వెళ్లిన దొంగలు



అర్ధరాత్రి దొంగల దాడిలో గాయపడిన వాచ్‌మన్ సామ్యేల్

బల్లికురవ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : వైన్ షాప్‌లో మంగళవారం తెల్లవారుజామున దొంగతనం జరిగింది. అద్దంకి నార్కెట్‌పల్లి రాష్ట్రీయ రహదారి పక్కన కొప్పెరపాడు గ్రామం వద్ద ఉన్న అంకమ్మ తల్లి వైన్స్‌లో గుర్తుతెలియని దొంగలు మూకుమ్మడిగా వచ్చి కాపాలాగా ఉన్న వాచ్‌మన్‌పై దాడి చేసి తాళాలు పగలగొట్టి దుకాణంలో ఉన్న రూ.20వేల నగదు, నాలుగు కేసుల మద్యం సీసాలను అపహరించుకుపోయారు. అందిన సమాచారం మేరకు రాష్ట్రీయ రహదారి ప్రక్కనే కొప్పెరపాడు సమీపంలో అంకమ్మ తల్లి వైన్స్ ఉంది. అక్కడ వాచ్‌మన్‌గా తంగిరాల సామ్యేల్ కాపాలాగా ఉంటున్నాడు. సోమవారం రాత్రి 11 గంటల సమయంలో కొందరు దుకాణం సమీపంలో ఉండగా ఈవిషయాన్ని వెంటనే అయన దుకాణ యజమానులకు తెలిపారు. వారు వచ్చి కొంత సేపు దుకాణం వద్ద ఉన్నారు. కొత్త వ్యక్తులు ఎవరూ లేకపోవడంతో యజమానులు ఒంటి గంట సమయంలో ఇళ్లకు వెళ్లారు. తదుపరి వాచ్‌మెన్ అక్కడ ఉండగా ఒక కారులో ఎనిమిది వచ్చి వాచ్‌మన్‌పై దాడి చేసి గొంతుపై కాలు వేసి తాళాలు పగులగొట్టి లాకర్‌ను బయటకు తీసుకొచ్చి అందులో ఉన్న రూ.20వేల నగదును, రూ.30వేల విలువైన నాలుగు మద్యం కేసులను చోరీ చేశారు. దొంగలు వెళ్లిన వెంటనే వాచ్‌మన్ దుకాణ యజమానులకు సమాచారమివ్వగా, నిర్వాహకుడు ప్రసాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సంతమాగులూరు సర్కిల్ సీఐ వెంకట్రావు, ఎస్‌ఐ జీవీ చౌదరి చోరీ జరిగిన వైన్ షాపును పరిశీలించి వాచ్‌మన్ నుంచి చోరీ వివరాలను సేకరించారు. నిత్యం వందలాది వాహనాలతో రద్దీగా ఉండే రాష్ట్రీయ రహదారిలో చోరీ జరగడంతో ప్రజలు బెంబేలెత్తి పోతున్నారు.

భూములు కోల్పోయిన రైతులకు న్యాయపరంగా నష్టపరిహారం

రెవెన్యూ అధికారులకు ఎమ్మెల్యే ఉగ్ర సూచన



హైవే భూ బాధితుల సమావేశంలో మాట్లాడుతున్న ఉగ్ర

సీఎస్‌పురం(పామూరు) జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారి నిర్మాణానికి సంబంధించి భూసేకరణలో భూములు కోల్పోతున్న రైతులకు న్యాయంగా నష్టపరిహారం అందజేయాలని ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి రెవెన్యూ అధికారులకు సూచించారు. సీఎస్‌పురం తహసీల్దార్ కార్యాలయంలో హైవే భూ బాధితులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. భూసేకరణలో భూములు కోల్పోయిన రైతుల భూములకు సంబంధించిన రికార్డులను ఆర్డీవో కేశవవర్ధనరెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఉగ్ర మాట్లాడుతు రైతుల భాగస్వామ్యంతోనే అభివృద్ధి సాధ్యం అవుతుందన్నారు.హైవే భూ బాధితులకు నష్ట పరిహారం సొమ్ములు త్వరితగతిన అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం డీజీపేట, గుంతచెన్నంపల్లి, రేగులచెలుక గ్రామాల మీదుగా సాగుతున్న గ్రీన్‌ఫీల్డ్ హైవే, 167- బీ హైవే పనులను పరిశీలించారు. రహదారుల నిర్మాణంతో గ్రామాలన్నీ అభివృద్ధి చెందుతాయన్నారు. భూ సేకరణలో భూములు కోల్పోయిన రైతులకు ప్రభుత్వ పరం గా అన్నివిధాలుగా సహాయసహకారం అందజేస్తామని, అందుకు రైతులు కూడాసహకారం అందించాలని కోరారు. సర్వేనెంబర్ 224/1 లో గల భూమి ప్రభుత్వ భూమి ల్యాండ్ పూలింగ్‌లో ఉందని, ఎవరు కొనుగోలు చేసినా చెల్లదని ఆర్డీవో తెలిపారు. రైతుల భూములు జీరో ఖాతాలో పడటం వలన జిల్లా ఉన్నాతాధికారులకు నివేదిక పంపించి రికార్డులను సరి చేసి రైతులకు త్వరగా న్యాయం జరిగేలా రెవెన్యూ అధికారులు కృషిచేయాలని ఉగ్ర సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వి. వెంకటేశ్వర్లు, సర్పంచ్ శ్రీరాం పద్మావతి, టీడీపీ మండల అధ్యక్షుడు బొమ్మనబోయిన వెంకటేశ్వర్లు, యారవ శ్రీనువాసులు, బోయిళ్ల నారాయణరెడ్డి, ఎన్‌సీ మాలకొండయ్య, నీటి సంఘం అధ్యక్షుడు పావళి తిరుపతయ్య, వీఆర్వోలు, సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు. అనంతరం ప్రముఖ శైవ క్షేత్రమైన భైరవకోన క్షేత్రాన్ని పరిశీలించారు. రానున్న మహా శివరాత్రి వేడుకలకు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దేవస్థాన అధికారులు తగిన చర్యలు చేపట్టాలని ఉగ్రనరసింహారెడ్డి సూచించారు.

నల్లవాగు భూమిపై గ్రానైట్ వ్యాపారుల పాగా



కొణిదెనలో నల్లవాగు భూమిని ఆక్రమించుకొని పెద్ద ఎత్తున వేసిన గ్రానైట్ వ్యర్థాలు



గ్రానైట్ వ్యర్థాలను వేసేందుకు ఏర్పాటు చేసిన కుంట



ప్రభుత్వ భూమిలో పైప్‌లైన్ ద్వారా పెడుతున్న వ్యర్థాలు



కుంచించుకుపోతున్న కొణిదెన నల్లవాగు భూమి

- కొణిదెన గ్రామంలో 54 ఎకరాల ప్రభుత్వ భూమి పరాధీనం
- జోరుగా వాగు భూముల అమ్మకాలు, కొనుగోళ్లు
- ఇష్టారాజ్యంగా వాటిలో గ్రానైట్ వ్యర్థాలు
- వారిపై చర్యలకు గతంలో మంత్రి ఆదేశాలు
- పట్టించుకోని అధికారులు

బల్లికురవ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ వాగు భూములను కొందరు కొంతకాలం నుంచి ఆక్రమించుకొని ఇష్టారాజ్యంగా అమ్మకాలు చేస్తున్నారు. కొందరు గ్రానైట్ వ్యాపారులు ప్రభుత్వ భూముల్లో పాగా వేసి గ్రానైట్ వ్యర్థాలను ఇష్టానుసారం పడేస్తున్నారు. ఎంతో విలువైన వాగు భూములు ఆక్రమణకు గురి కావడంతో ముందు ముందు రైతులకు తీవ్ర ఇబ్బందులు వచ్చే ప్రమాదం ఉంది. మండలంలోని కొణిదెన గ్రామంలో ఉన్న నల్ల వాగుకు సంబంధించి సర్వే నెంబరు 789/ఏ, 789/బీ, 761లో 54 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఈ భూమిని కొంత కాలం నుంచి కొణిదెనకు చెందిన కొందరు ఆక్రమించుకుని తమ ఆధీనంలో పెట్టుకొన్నారు. కొందరు పలు రకాల పంటలను సాగు చేస్తున్నారు. ఈ భూమిని కొందరు గత కొన్ని నెలల నుంచి అమ్మకాలు చేస్తున్నారు. గ్రానైట్ ఫ్యాక్టరీలు నిర్వహించే కొందరు వ్యాపారులు ఈ భూమిని కొంత కొనుగోలు చేసి కొంత ఆక్రమించుకొని పెద్ద ఎత్తున వ్యర్థాలను పడవేస్తున్నారు. ఫ్యాక్టరీలలో వచ్చే డస్టును ప్రభుత్వ వాగు భూమిలోకి పెడుతున్నారు. దీంతో నల్ల వాగు రోజు రోజుకూ కుంచించుకుపోతోంది. ఎంతో విలువ కలిగిన ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైన అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. గ్రామ స్థాయిలో పనిచేసే అధికారులు కూడా కొందరు ప్రభుత్వ భూముల అమ్మకాల విషయం తెలిసిన మామూళ్ల మత్తులో పట్టించుకోలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రోడ్డు పక్కనే ఉన్న వాగు భూమిలో వ్యర్థాలను వేయడం వలన గాలులకు వచ్చే దుమ్ముతో పంటలు కూడా సరిగా పండే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు. పైప్‌లైన్‌లను ఏర్పాటు చేసి మరీ వ్యర్థాలను వాగు భూమిలోకి పెడుతున్నారని ఇలా అయితే ముున్ముందు వాగు భూమి కనుమరుగవుతుందని రైతులు తెలిపారు. నల్లవాగు నీటిపై ఆధారపడి ఎత్తిపోతల పథకం కూడా ఉందని పంటలకు నీరు సక్రమంగా రావాలంటే నల్లవాగును పూర్తి స్థాయిలో అభివృద్ధి పరిచి ఆక్రమణలకు అడ్డుకట్ట వేయాలని రైతులు కోరుతున్నారు. వాగు భూమిని ఆక్రమించుకున్న వారు కొందరు లక్షలు తీసుకొని మరొకరికి అమ్మకాలు చేయడంతో వివాదాలు కూడా తలెత్తుతున్నాయని పలువురు అంటున్నారు. రెవెన్యూ శాఖ అధికారులు వెంటనే వాగు భూములను పరిశీలించి ఆక్రమణలబారి నుంచి కాపాడాలని రైతులు కోరుతున్నారు.

వ్యర్థాలు వేసే వారిపై చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశాలు

బల్లికురవ మండలంలో ప్రభుత్వ భూముల్లో గ్రానైట్ వ్యర్థాలు వేసే వారికి నోటీసులు ఇచ్చి వెంటనే చర్యలు చేపట్టాలని మంత్రి రవికుమార్ గతంలో అధికారులను ఆదేశించారు. అయినా నేటికీ చర్యలు చేపట్టిన దాఖలాలు లేవు. రెండు నెలల కిందట బల్లికురవ ప్రజా వేదిక కార్యక్రమానికి వచ్చిన మంత్రి ప్రభుత్వ భూముల్లో వ్యర్థాలు వేస్తున్న వారికి నోటీసులు ఇవ్వాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు.



కొండమంజులూరులో జరిగిన వైద్య శిబిరంలో రోగ నిరోధక మందులను అందజేస్తున్న డాక్టర్ మురళీకృష్ణ

పశుపోషకులు వైద్యుల సూచనలు పాటించండి

డాక్టర్ మురళీకృష్ణ

పంగులూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : అధిక పాల దిగుబడి సాధించేందుకు పశు పోషకులు వైద్యుల సూచనలు పాటించాలని పశు వైద్యాధికారి డాక్టర్ మురళీకృష్ణ కోరారు. మండలంలోని కొండమంజులూరు గ్రామంలో మంగళవారం పశు ఆరోగ్య కేంద్రం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సూడి మోసే సమయంలో గేదెలకు ఇంజక్షన్లు వేయించడం ద్వారా పడ్డ దూడలు పుట్టే అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలన్నారు. దూడలు, గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు తాగించడంతో పాటు గేదెలకు ఎద పరీక్షలు నిర్వహించారు. పశువుల రోగ నివారణకు అవసరమైన మందులు అందచేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల నాయకులు చింతల సహదేవుడు, ఏహెచ్ఏలు ప్రమీలాబాయ్, యశోద, భాగ్యజ్యోతి, పలువురు గ్రామ రైతులు పాల్గొన్నారు.

బల్లికురవ : పశు సంవర్థక శాఖ ఆధ్వర్యంలో మండలంలోని కొప్పెరపాలెం, మల్లాయపాలెం గ్రామాలలో మంగళవారం పశు ఆరోగ్య శిబిరాలు జరిగాయి. ఈసందర్భంగా వైద్యాధికారులు, మహేశ్వరరావు, పావనీకుమారి పశువులు, గొర్రెలు, మేకలకు, దూడలకు మందులను అందించారు. ఈసందర్భంగా వారు పశువుల వృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల గురించి పశుపోషకులకు వివరించారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న న్యాయవాది ప్రకాష్

అద్దంకిటౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని, లేకుంటే మానవ మనుగడకే ప్రమాదమని న్యాయవాది ఎం.ప్రకాష్ అన్నారు. మంగళవారం రోటరీ కార్యాలయంలో రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ, మండల న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు రోటరీ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణ, లింగ నిర్ధారణ పరీక్షలు, వినియోదారుల హక్కుల పరిరక్షణ అనే అంశాలపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా మరో న్యాయవాది, రోటరీ అసిస్టెంట్ గవర్నర్ మహమ్మద్ రఫీ మాట్లాడారు. కార్యక్రమంలో రోటరీ సెక్రటరీ సీహెచ్.మురళీసుధాకరరావు, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, మర్త శ్రీనివాసరావు, అశహరి హరి ప్రసాద్, ఆంజనేయులు, చిన్ని కామేశ్వరరావు, కృష్ణ, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ సంఘం కోశాధికారిగా చెన్నుపల్లి



సమావేశంలో రాష్ట్ర నాయకులతో చెన్నుపల్లి శ్రీనివాసరావు

అద్దంకిటౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘం కోశాధికారిగా అద్దంకికి చెందిన చెన్నుపల్లి శ్రీనివాసరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. విజయవాడలో ఈనెల 26న జరిగిన ఏపీ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు చేకూరి రామస్వామి అధ్యక్షతన రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఉమ్మడి ప్రకాశం జిల్లా అధ్యక్షుడిగా పని చేస్తున్న చెన్నుపల్లి శ్రీనివాసరావు సంఘ రాష్ట్ర కోశాధికారిగా ఎన్నుకున్నారు విశ్వబ్రాహ్మణుల సంక్షేమానికి తనవంతు కృషి చేస్తానని, ఈ బాధ్యతను అప్పగించిన రాష్ట్ర నాయకులకు శ్రీనివాసరావు ధన్యవాదాలు తెలిపారు. జిల్లా, అద్దంకి విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు చెన్నుపల్లికి శుభాకాంక్షలు తెలిపారు.

మల్లాయపాలెంలో లారీ డ్రైవర్ ఆత్మహత్య

బల్లికురవ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : కొత్త మల్లాయపాలెంలో లారీ డ్రైవర్ తంగిరాల పోతురాజు(37) మంగళవారం తన ఇంట్లోనే ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సీ కాలనికి చెందిన పోతురాజు గ్రానైట్ ముడి రాయి లారీలకు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అప్పులబాధతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొన ఊపిరితో ఉన్న అతడిని ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతిచెందాడు. పోతురాజుకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

అన్నదాతల అభ్యున్నతికి కృషి చేయాలి

- లిఫ్ట్ ఇరిగేషన్ స్కీములన్నీ పునరుద్ధరించాలి
- రైతుల భాగస్వామ్యంతో పనిచేసేలా చూడాలి
- దళారులకు తావులేకుండా ధాన్యం కొనుగోలు చేయండి
- డీఆర్సీ సమావేశంలో ఎమ్మెల్యే ఏలూరి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఏలూరి

పర్చూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : అన్నదాతల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. మంగళవారం బాపట్ల కలెక్టర్ కార్యాలయంలో జిల్లా అభివృద్ధి సమావేశం ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారథి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఎమ్మెల్యే ఏలూరి మాట్లాడుతూ అన్నదాతలకు కూటమి ప్రభుత్వం భరోసా ఇస్తుందన్నారు. లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌లు జిల్లా వ్యాప్తంగా అనేకం మూలన పడ్డాయని, గత వైసీపీ పాలకుల నిర్లక్ష్యమే ఇందుకు కారణమన్నారు. అన్ని స్కీములు పనిచేసేలా చూసి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. రైతుల భాగస్వామ్యంలో పనిచేసే వారికి అప్పగించాలన్నారు. ధాన్యం కొనుగోలు లక్ష్యాలను అధిగమించి, రైతుల వద్ద నిల్వ ఉన్న ధాన్యాన్ని సైతం కొనుగోలు చేయాలన్నారు. దళారుల ప్రమేయాన్ని అరికట్టి రైతులకు భరోసా ఇవ్వాలన్నారు. ప్రతి గింజనూ మద్దతు ధరకు కొనుగోలు చేయాలన్నారు. ఇప్పటికి రోడ్లన్నీ మరమ్మతులు చేపట్టామని, మిగిలిన రోడ్ల మరమ్మతులను త్వరితగతిన పూర్తిచేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఎన్ఆర్‌జీఎస్ ద్వారా పనులు పూర్తి అయిన వాటికి బిల్లులు తక్షణమే చెల్లించే విధంగా చూడాలన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో 2014-19 అభివృద్ధి పనుల బిల్లులు నిలిపివేశారన్నారు. ప్రధానంగా ఎస్‌డిఎఫ్, డీఎంఎఫ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ పనులకు అనుకూలమైన వారికి బిల్లులు చెల్లించి మిగతావారికి నిలిపి వేశారన్నారు. వాటిపై విచారణ చేసి బిల్లులు చెల్లించేలా చూడాలన్నారు.

ఎస్సీ హాస్టల్ ఏర్పాటుకు ప్రతిపాదనలు

- మంత్రి రవికుమార్ ఆదేశాలతో రంగంలోకి దిగిన అధికారులు



వసతి గృహం ఏర్పాటుపై గ్రామస్థులు, అధికారులతో మాట్లాడుతున్న వెల్ఫేర్ ఆఫీసర్ యువ స్వరూప

బల్లికురవ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశాల మేరకు బల్లికురవలో ఎస్సీ హాస్టల్ ఏర్పాటుకు అధికారులు రంగంలోకి దిగారు. గత రెండు మాసాల కిందట బల్లికురవ ప్రజా వేదిక కార్యక్రమానికి హాజరైన విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను బల్లికురవ, పరిసర గ్రామాలకు చెందిన ఎస్సీ వసతి గృహాన్ని ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందజేశారు. దీంతో మంత్రి రవికుమార్ వసతి గృహం ఏర్పాటు చేసేలా అధికారులకు ఆదేశాలు పంపారు. మంగళవారం అద్దంకి సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్ ఆఫీసర్ డి.యువ స్వరూప మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో కుసుమకుమారిని కలిసి వసతి గృహం ఏర్పాటుకు అవసరమైన వివరాలను సేకరించారు. అనంతరం ఉన్నత పాఠశాలలో ఎంఈవో వస్త్రం నాయక్, రమేష్‌ను, ప్రధానోపాధ్యాయుడు హనుమంతురావును, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్‌ను గ్రామ పెద్దలను కలిసి వసతి గృహం ఏర్పాటుపై వారి నుంచి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఇక్కడ హాస్టల్ ఏర్పాటుతో పరిసర 10 గ్రామాల విద్యార్థులకు ఎంతో ఉపయోగమని పెద్దలు వెల్ఫేర్ అధికారికి వివరించారు. వసతి గృహం ఏర్పాటుకు తాము ఉన్నత అధికారులకు ప్రతిపాదనలు పంపుతామని ఈసందర్భంగా సోషల్ వెల్ఫేర్ అధికారి తెలిపారు.

ముగ్గురు జేబుదొంగల అరెస్ట్

మార్టూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : ముగ్గురు జేబు దొంగలను సోమవారం అరెస్ట్ చేసి మంగళవారం దర్శి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్ఐ సైదా తెలిపారు. ఆ వివరాలను ఎస్ఐ తెలిపారు. ఈ నెల 26 వతేదీ ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయంలో జరిగిన ఏలూరి పుట్టినరోజు వేడుకలలో నలుగురు వ్యక్తుల దగ్గర ముగ్గురు జేబుదొంగలు దొంగతనం చేశారు. దాంతో ఈ ముగ్గురు చీరాల మండలం వాడరేవుకు చెందిన గోదావరి గోపి, తాడేపల్లికి చెందిన గోదావరి ఏసు, స్టువర్టుపురానికి చెందిన కర్రెద్దుల వంశీని ఎస్ఐ సైదా అరెస్ట్ చేశారు. వారి దగ్గర రూ.63వేలు నగదును, సెల్‌ఫోన్ ను స్వాధీనం చేసుకున్నారు. కోర్టులో వారికి 14 రోజులు రిమాండ్ విధించగా మంగళవారం ఒంగోలు జైలులో హాజరుపరచినట్లు ఎస్ఐ తెలిపారు.

మద్యం షాపు టెండర్‌కు గీత కులాలకు ఆహ్వానం

పర్చూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : ఏపీ ప్రభుత్వం మద్యం షాపు టెండర్‌లో గీత కార్మికులకు 10శాతం రిజర్వేషన్ కల్పిస్తూ ఆదేశాలు జారీ చేసినట్లు పర్చూరు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ భుజంగరావు మంగళవారం ప్రకటనలో తెలిపారు.

పర్చూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఇంకొల్లు మండల పరిధిలో సబ్ కాస్ట్ గౌడ్ (గౌడ) కులస్తులకు ఒక షాపును కేటాయించినట్లు చెప్పారు. ఈషాపు టెండర్‌కు బాపట్ల జిల్లాలో ఉన్న గౌడ కులస్తులు అర్హులన్నారు. షాపు టెండర్ కోసం ఫిబ్రవరి 2 సాయంత్రం 5గంటల లోపు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. దరకాస్తులను ఆన్‌లైన్ ద్వారా కానీ ఆఫ్‌లైన్ ద్వారా కానీ స్వీకరిస్తారని తెలిపారు. అప్లికేషన్ నాన్-రిఫండబుల్ ఫీజు రూ.2లక్షలుగా నిర్ణయించినట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన గీత కులస్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ బుజంగరావు ఆ ప్రకటనలో తెలిపారు.



మహిళాభివృద్ధి, సంక్షేమ శాఖ జేడీ మనోరంజనికి వినతిపత్రం అందజేస్తున్న తెలుగునాడు అంగన్‌వాడీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు

అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలి

తెలుగునాడు అంగన్‌వాడీ ట్రేడ్ యూనియన్ వినతి

అద్దంకిటౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ తెలుగునాడు అంగన్‌వాడీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు మంగళవారం గుంటూరులోని కమిషనర్ కార్యాలయంలో మహిళాభివృద్ధి, సంక్షేమ శాఖ జేడీ పి.మనోరంజని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జేడీ మనోరంజని మాట్లాడుతూ ప్రభుత్వం ఆదేశాల మేరకు ఇప్పటికే అంగన్‌వాడీ కార్యకర్త, హెల్పర్‌లు మృతి చెందిన క్రమంలో మట్టి ఖర్చులు నిమిత్తం జీవో విడుదల చేసినట్లు చెప్పారు. గ్రాడ్యుటీపై త్వరలో జీవో వస్తుందన్నారు. కూరగాయలు, గ్యాస్ బిల్లులు పెంచుతూ ఆదేశాలు వచ్చాయన్నారు. వేతనాల పెంపు విషయం మంత్రితో ఇప్పటికే మాట్లాడినట్లు చెప్పారు. వినతిపత్రం అందించిన వారిలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు గడ్డం అనంతలక్ష్మి, ప్రధాన కార్యదర్శి కొల్లి లక్ష్మి నరసమ్మ, ఉపాధ్యాక్షురాలు చెరుకూరు సామ్రాజ్యం ఉన్నారు.

'చలో హైదరాబాద్'కు తరలిరండి

అద్దంకిటౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణ అ మలు చేయాలని ఫిబ్రవరి 7న మంద కృష్ణమాదిగ నాయకత్వంలో తలపెట్టిన లక్ష డప్పులు - వేయి గొంతులు చలో హైదరాబాద్ కార్యక్రమానికి తరలిరా వాలని నియోజకవర్గ బాధ్యులు తేల శ్రీనివాసరావు, పూనూరు రమేష్ మంగళవారం ప్రకటన ద్వారా కోరారు. నియోజకవర్గంలోని మాదిగ ఉద్యోగులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.



హాజరైన భక్తులనుద్దేశించి మాట్లాడుతున్న గణపతిసచ్చినాందస్వామి

మంచి పనులతో మానవ జన్మకు సార్థకం

గణపతి సచ్చిదానందస్వామీ

అద్దంకి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : భగవంతుడు ప్రసాదించిన మానవ జన్మను మంచి పనులు చేయడం ద్వారా సార్థకం చేసుకోవాలని గణపతి సచ్చిదానంద స్వామీజీ అన్నారు. పట్టణంలోని దత్తపాదుకా క్షేత్రానికి మంగళవారం రాత్రి దత్తపాదుకా క్షేత్రానికి మైసూరు అవధూత దత్తపీఠాధిపతి గణపతి సచ్చిదానందస్వామీ, దత్త విజయానంద తీర్థ స్వామీజీ వచ్చారు. ఈ సందర్భంగా భక్తులనుద్దేశించి గణపతి సచ్చిదానందస్వామీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ శక్తి మేర మంచిని ఆచరిస్తూ, మంచి పనులు చేయాలన్నారు. దేవాలయాలను పరిరక్షించి సనాతన ధర్మాన్ని పాటించాలన్నారు. దేవాలయాల అభివృద్ధికి సహకారం అందిస్తే పుణ్యం లభిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ దాన ధర్మాలు చేయాలన్నారు. అనంతరం దివ్య నామ సంకీర్తన సాగింది. బుధవారం ఉదయం శ్రీచక్రార్చన, శ్రీధన్వంతరీరాగ సాగర కార్యక్రమాలు జరగనున్నాయి. ఈ కార్యక్రమంలో దత్త కమిటీ అధ్యక్షుడు నాగసూరి హనుమత్ ప్రసాద్, కురిచేటి వెంకటసుబ్బారావు, చిన్ని, నందిరెడ్డి శ్రీనివాసరావు, చామర్తి మల్లిఖార్జునరావు, మామిడి రాంబాబు, సుబ్బారావు, కూరపాటి రామకోటేశ్వరరావు పాల్గొన్నారు.

31న మున్సిపల్ సాధారణ సమావేశం

అద్దంకి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి మున్సిపల్ సాధారణ సమావేశం ఈనెల 31వ తేదీ ఉదయం 11 గంటలకు కౌన్సిల్ హాల్‌లో చైర్‌పర్సన్ ఎస్తేరమ్మ అధ్యక్షతన జరుగుతుందని కమిషర్ రవీంద్ర తెలిపారు.

మంచు నుంచి పంటలను కాపాడుకోవాలి



మొక్కజొన్నను పరిశీలిస్తున్న ఏడీఏ శ్రీవాసరావు, ఏవో కుమారి

బల్లికురవ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : మంచు వాతావరణం వలన పాలు పోసుకునే దశలో ఉన్న మొక్కజొన్నకు మానుగాయ తెగులు వచ్చే ప్రమాదం ఉందని, రైతులు తగు జాగ్రత్తలు పాటించి పంటలను కాపాడుకోవాలని వ్యవసాయ శాఖ మార్టూరు సబ్ డివిజన్ ఏడీఏ కేవీ శ్రీనివాసరావు కోరారు. మంగళవారం మండలంలోని నక్కబొక్కలపాడు, మల్లాయపాలెం గ్రామాలలో పోలంపిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా అధికారులు మొక్కజొన్నను పరిశీలించి రైతులకు పలు సూచనలు సలహాలను ఇచ్చారు. రైతులకు వచ్చే నెలలో ప్రత్యేక గుర్తింపు నెంబర్లను కేటాయిస్తామని, ఇక నుంచి ప్రభుత్వ పథకాలు ఐడీ నెంబర్లు ఉన్న రైతులకే వర్తిస్తాయని తెలిపారు. రైతులు పంటలు సాగు చేసిన వెంటనే ఈక్రాప్ చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో వీఏఏలు సుభాని, లక్ష్మణ్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కల్పన, రైతులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట పైర్లతో భూమి సారవంతం

పంగులూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : తొలకరిలో పచ్చిరొట్ట పైరు సాగుతో భూమి సారవంతం అవుతుందని వ్యవసాయాధికారి డి.సుబ్బారెడ్డి అన్నారు. మండలంలోని అలవలపాడు, జాగర్లమూడివారిపాలెం గ్రామాలలో మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. పచ్చిరొట్ట పైర్లు సాగు చేపట్టి పూత దశలో దుక్కిలో కలియ దున్నాలన్నారు. సాగులో ఉన్న శనగ, మొక్కజొన్న పైర్లను పరిశీలించి సస్యరక్షణ చర్యలపై సూచనలు చేశారు. రబీలో సాగు చేస్తున్న పంటలను నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో వీఆర్వో కోటేశ్వరరావు, జాగర్లమూడి శ్రీనివాసరావు, మహేష్, నన్నేసాహెబ్, రైతు సేవా కేంద్రం సిబ్బంది శైలేష్, ఫిలిప్‌రాజు, దిల్షా, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

అవార్డులు బాధ్యతను పెంచుతాయి

తహసీల్దార్ గోపీకృష్ణ



తహసీల్దార్ గోపీకృష్ణను సన్మానిస్తున్న కార్యాలయ సిబ్బంది

చీరాలటౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఉద్యోగీ విధి నిర్వహణలో పొందిన అవార్డులు వారి బాధ్యతలను మరింత పెంచుతాయని, వాటిని సాధించడమే కాకుండా ఆ విలువలను కాపాడుకోవాలని తహసీల్దార్ గోపీకృష్ణ అన్నారు. గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ వెంకటమురళి చేతుల మీదుగా ఉత్తమ సేవా ఆవార్డును తహసీల్దార్ అందుకున్నారు. మంగళవారం కార్యాలయంలో సిబ్బంది అభినందన సభ నిర్వహించారు. తహసీల్దార్ సేవలను, సహచరుల పట్ల వ్యవహరించే తీరును కొనియాడారు. అవార్డు రావడానికి సహకరించిన ప్రతిఒక్కరికీ తహసీల్దార్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డీటీ అర్జున్, వీఆర్వోలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.


ఆధునిక టెక్నాలజీపై అవగాహనతో ప్రయోజనం

చీరాలటౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : ఆధునిక టెక్నాలజీకి సంబంధించిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో విద్యార్థులకు భవిష్యత్ ఉంటుందని సెయింట్ ఆన్స్ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు అన్నారు. మంగళవారం కళాశాలలో హెకథాన్ ఆన్‌ఏఐ ఫుల్‌స్టాక్ కార్యక్రమాన్ని నిర్వహించగా సీఎస్ఈ విభాగం రెంచిజీ, మూడవ సంవత్సరం విద్యార్థులు పాల్గొన్నారు. ఈక్రమంలో ప్రిన్సిపాల్ డా.కె.జగదీష్ మాట్లాడుతూ ఐటీ పరిశ్రమలలో నైపుణ్యత ప్రదర్శనకు శిక్షణ ఉపయోగపడుతాయని వివరించారు. సీఎస్ఈ విభాగాధిపతి డా.పి.హరిణి, కోఆర్డినేటర్ శేషసాయి విద్యార్థులు పాల్గొన్నారు.




వర్క్‌షాప్‌లో అవగాహన కల్పిస్తున్న ప్రతినిధి

ఆంధ్రజ్యోతి



సోమశిలలో 67.702 టీఎంసీల నీటి నిల్వ



అనంతసాగరం (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి మంగళవారం 1,838 క్యూసెక్కులు ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 67.702 టీఎంసీల నిల్వ ఉంది. దిగువ కండలేరుకు 200, డెల్టాకు 2,750, ఉత్తర కాలువకు 650, దక్షిణ కాలువకు 350 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నామని వారు తెలిపారు.



సౌత్‌మోపూరులోని కల్యాణమండపంలో జరిగిన చర్చావేదికలో ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తున్న నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

సౌత్‌మోపూరుకు పండుగ!

పాలకులను కదలించిన ఆంధ్రజ్యోతి అక్షరం

- గ్రామానికి తరలివచ్చిన ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, అధికారులు
- అభివృద్ధికి రూ.కోటి కేటాయిస్తున్నట్లు ప్రకటన
- పది రోజుల్లో పనులు ప్రారంభిస్తామని వెల్లడి
- ఆంధ్రజ్యోతి ప్రయత్నానికి నాయకులు, ప్రజల అభినందనల వెల్లువ

నెల్లూరు నగరానికి కూతవేటు దూరంలో ఉన్న గ్రామం అది. మౌలిక సదుపాయాల లేమితో బిక్కుబిక్కుమంటూ గడుపుతున్న ఆ గ్రామవాసుల దీనావస్థను 'ఆంధ్రజ్యోతి' అక్షర రూపంలో వెలుగులోకి తెచ్చింది. 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా..' నినాదంతో సౌత్‌మోపూరులో నెలకొన్న సమస్యలను సవివరంగా ప్రస్తావిస్తూ సోమవారం ఓ కథనాన్ని ప్రచురించింది. ఈ కథనమే ఇటు ప్రజాప్రతినిధులు, అటు అధికారులను కదిలించింది. మంగళవారం ఉదయానికల్లా అందరూ సౌత్‌మోపూరు గ్రామానికి చేరిపోయారు.


'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా...' కార్యక్రమం సౌత్‌మోపూరుకు పండుగను తెచ్చింది. ప్రజల సమస్యలను పాలకుల దృష్టికి తీసుకొచ్చి వాటి పరిష్కారానికి కృషి చేయాలని, ప్రజలకు, పాలకులకు మధ్య వారధిగా నిలబడాలనే సంకల్పంతో 'ఆంధ్రజ్యోతి -ఏబీఎన్' మొదలు పెట్టిన ఈ బృహత్తర కార్యక్రమానికి తొలిరోజే ఫలవంతమైన ప్రయోజనాన్ని ఇచ్చింది. ఆంధ్రజ్యోతితో కష్టాలు పంచుకున్న సౌత్‌మోపూరు గ్రామవాసుల మొహాలలో చిరునవ్వులు పూయించింది. ఆంధ్రజ్యోతి అక్షరం మీద ఉన్న నమ్మకం, సౌత్‌మోపూరు వాసులపై ఉన్న ప్రత్యేకమైన అభిమానంతో ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆ పల్లె కష్టాలు తీర్చడం కోసం సోదర సమేతంగా మంగళవారం ఉదయం 10 గంటలకే గ్రామానికి చేరుకున్నారు. గ్రామ సమస్యల చర్చా-పరిష్కార వేదిక వద్దకు చేరుకున్నారు. స్వయంగా ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, ఆయన సోదరుడు టీడీపీ నాయకుడు గిరిధర్‌రెడ్డి గ్రామానికి తరలిరావడంతో గ్రామస్థుల్లో మరింత ఉత్సాహం నింపింది. ఎమ్మెల్యే వచ్చారనే వార్త ఊరి చివరి పొలాల్లో ఉన్నవారిని సైతం చర్చా వేదిక వద్దకు రప్పించింది. సుమారు గంటకుపైగా ఎమ్మెల్యే సోదరులు ప్రజల సమస్యలను విన్నారు. రోడ్లు లేవని కొందరు.. డ్రైన్లు లేవని ఇంకొందరు.. కరెంటు సమస్యలపై మరికొందరు.. విష జ్వరాలు చుట్టుముడుతున్నాయని కొందరు ఇలా ఒక్కొక్కరు ఒక్కో సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు.

తమ గ్రామం పట్ల ఎమ్మెల్యే చూపిన ప్రత్యేక అభిమానానికి, తమ సమస్యల పరిష్కారానికి ఆంధ్రజ్యోతి చూపిన చొరవకు కృతజ్ఞతలు తెలియజేసుకొంటూ సంతోషంగా ఇళ్లకు తరలి వెళ్లారు. మొత్తమ్మీద 'అక్షరమే అండగా.. పరిష్కారమే అజెండాగా' కార్యక్రమం తొలిరోజే ప్రజలకు కొండంత సంతృప్తిని ఇచ్చింది. - నెల్లూరు (ఆంధ్రజ్యోతి)

10 రోజుల్లో పనులు

ప్రజల సమస్యలను మౌనంగా ఆలకించిన ఎమ్మెల్యే తన ప్రసంగాన్ని ఆరంభిస్తూ 'సౌత్‌మోపూరులో సమస్యల పరిష్కారం కోసం ఇప్పటికిప్పుడు కోటి రూపాయలు కేటాయిస్తున్నాను.' అని ప్రకటించడంతో గ్రామస్థుల కరతాళ ధ్వనులతో సమావేశ ప్రాంగణం మారుమ్రోగింది. 'ఈ కోటి రూపాయల పనులు ఎప్పుడో కాదు... రాసి పెట్టుకోండి పది రోజుల్లోపే మొదలు పెడుతాం!' అని ఎమ్మెల్యే గట్టిగా హామీ ఇవ్వడంతో గ్రామస్థుల ఆనందానికి అవధులు లేకుండా పోయింది. ఈ నిధులతో తొలుత సీసీ రోడ్లు, స్కూల్ కాంపౌండ్ వాల్ నిర్మిద్దాం. ఆ తరువాత దశలవారీగా మిగిలిన సమస్యలను పరిష్కరిద్దామని ఎమ్మెల్యే చెప్పడంతో ప్రజలు సంబరపడిపోయారు.

అక్షరం అండగా..
పరిష్కారమే అజెండాగా..



కనికరించండి సార్!

దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించలేదనట్టుగా మారింది నీరు-చెట్టు పనులు చేసిన కాంట్రాక్టర్ల పరిస్థితి. ఐదేళ్ల తర్వాత బిల్లులు ఇచ్చేందుకు కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీంతో తమ బాధలు తీరుతాయని ఆశపడ్డ కాంట్రాక్టర్లకు అధికారుల రూపంలో నిరాశ ఎదురవుతోంది. ఈ నెలాఖరులోపు బిల్లులన్నీ అప్‌లోడ్ చేయాలని రాష్ట్ర ఉన్నతాధికారులు ఆదేశించారు. కానీ జిల్లాలో ఆశించిన స్థాయిలో అప్‌లోడ్ ప్రక్రియ జరగడం లేదు. కోర్టు కేసుల్లో ఉన్న బిల్లులు కూడా సకాలంలో అప్‌లోడ్ కావడం లేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. దీంతో పనులు చేసిన కాంట్రాక్టర్లలో మళ్లీ ఆందోళన మొదలైంది. తమ బిల్లులకు బ్రేక్ పడుతుందోనన్న భయంతో ఇరిగేషన్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

నీరు-చెట్టు పెండింగ్ బిల్లుల వివరాలు...

సర్కిల్	మొత్తం వర్కులు	బిల్లులు (రూ.లక్షలు)	అప్‌లోడ్ చేయాల్సినవి	మొత్తం (రూ.లక్షలు)
ఇరిగేషన్ సర్కిల్	1823	13376.83	764	2477.09
సోమశిల ప్రాజెక్టు	566	5601.30	15	127.16
టీజీపీ	44	151.17	49	150.89
మొత్తం	2433	19129.30	828	2755.14

- ఐదేళ్ల తర్వాత నీరు-చెట్టు బిల్లులకు మోక్షం
- బకాయిలు చెల్లించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయం
- నెలాఖరులోపు బిల్లులన్నీ అప్‌లోడ్ చేయాలని ఆదేశం
- జిల్లాలో ఆశించిన వేగంగా అప్‌లోడ్ కాని బిల్లులు
- ఇరిగేషన్ కార్యాలయాల చుట్టూ కాంట్రాక్టర్ల ప్రదక్షిణలు

నెల్లూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ప్రభుత్వం ఏర్పడే నాటికి జిల్లాలో 2433 నీరు-చెట్టు పనులకు రూ.191.29 కోట్లు బిల్లులు చెల్లించాల్సి ఉంది. అయితే అప్పట్లో నీరు-చెట్టు పనులపై అనేక రకాల విచారణలు వేసి బిల్లులు చెల్లింపులో జాప్యం చేశారు. రెండేళ్ల తర్వాత నుంచి పనులు చేసిన వారు హైకోర్టు మెట్లెక్కడం మొదలుపెట్టారు. కోర్టు ఆదేశాలతో బిల్లులు మంజూరయ్యాయి. ఈ నేపథ్యంలో ఒక్కొక్కరుగా కోర్టుకు క్యూ కట్టారు. ఇలా సగం మంది వరకూ తమ బిల్లులను తెచ్చుకున్నారు. ఇంకా కొన్ని కేసులు కోర్టులో పెండింగ్ ఉండగా, మరికొన్ని కోర్టు బయట ఉన్నాయి. ఇటువంటి పెండింగ్ బిల్లులన్నింటినీ చెల్లించేందుకు ప్రభుత్వం గత నెలలో బడ్జెట్ కేటాయింపులు కూడా చేసింది. అయితే ఆ బిల్లులను ఫైనాన్స్ వద్దకు పంపడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది.



ప్రధానంగా నెల్లూరు ఇరిగేషన్ సర్కిల్ పరిధిలోనే ఎక్కువగా బిల్లులు పెండింగ్ ఉన్నాయి. జిల్లా మొత్తం అప్‌లోడ్ చేయాల్సిన బిల్లులు 828 ఉంటే అందులో ఇరిగేషన్ సర్కిల్ పరిధిలోనివి 764 ఉండటం గమనార్హం. ఇక్కడ కూడా ఆత్మకూరు డివిజన్ పరిధిలో 208, కావలి డివిజన్‌లో 225, గూడూరు డివిజన్‌లో 152, సెంట్రల్ డివిజన్ పరిధిలో 134 బిల్లులు పెండింగ్ ఉన్నాయి. ఈ పెండింగ్ బిల్లుల్లో కోర్టు పరిధిలో ఉన్నవి 143 ఉండడం గమనార్హం. ఈ విషయంపై ఇరిగేషన్ ఎస్‌ఈ దేశానాయక్‌ను వివరణ కోరగా బిల్లులను వేగంగా అప్‌లోడ్ చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. ఇందుకుగానూ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లకు మెమోలు కూడా జారీ చేస్తున్నట్లు వెల్లడించారు.

సమగ్ర నీటి వినియోగానికి జలగణన

- జాయింట్ కలెక్టర్ కార్తీక్



శిక్షణలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ కార్తీక్, పక్కన అధికారులు

నెల్లూరు (హరనాథపురం), జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : నీటి వినియోగాన్ని సమర్థవంతంగా చేయడానికి, తద్వారా వ్యవసాయ ఉత్పాదకతను పెంపొందించ డానికి జలగణన ఉపయోగపడు తుందని జాయింట్ కలెక్టర్ కార్తీక్ అన్నారు. జిల్లాలో 7వ చిన్నతరహా నీటి వనరుల గణన, 2వ జలాశ యాల గణనను నిర్వహించేందుకు జిల్లాస్థాయి శిక్షణను మంగళవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ పార్లమెంటు స్టాండింగ్ కమిటీ నిర్ణయం మేరకు జరుగుతున్న చిన్నతరహా నీటి వనరుల, జలాశయాల గణనను పక్కాగా నిర్వ హించాలన్నారు. మొబైల్ అప్లికేషన్ ద్వారా చేసే ఎన్యూమరేషన్‌లో మొత్తం 5 షెడ్యూల్స్ గ్రామ, పట్టణ, భూగర్భ జలవనరుల పథకాలు, ఉపరితల జలవనరుల పథకాలు, వాటర్ బాడీ షెడ్యూల్స్ గురించి సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ శిక్షణలో అన్ని విషయాలపై అవగాహన పెంచుకుని, మండల స్థాయిలో మిగిలిన వారికి శిక్షణ ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీవో నరసింహారావు, ఏడీ ఆయేషా, ఎస్‌వో శ్యామ్‌కుమార్, వివిధ మండలాల ఏఎస్‌వోలు పాల్గొన్నారు.

● సహకార సంఘాల లావాదేవీలు ఆన్‌లైన్‌లో నిర్వహించాలి

సహకార సంఘాల లావాదేవీలను ఫిబ్రవరి నుంచి ఆన్‌లైన్‌లో నిర్వహిం చాలని జాయింట్ కలెక్టర్ కార్తీక్ ఆదేశించారు. మంగళవారం డీసీసీబీ సమావేశ మందిరంలో జరిగిన మహాజన సభలో ఆయన ప్రసంగించారు. సహకార సంఘాల కంప్యూటరీకరణ ఈ నెలాఖరుకు పూర్తవుతుందని చెప్పారు. సంఘాల్లోని సభ్యులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. ఈ సమావేశంలో డీసీవో గురప్ప, డీసీసీబీ సీఈవో శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ పాలనలో మార్పులు

- డివిజనల్ అధికారుల నియామకానికి ప్రతిపాదనలు
- అన్ని విభాగాల్లోనూ పదోన్నతులకు కసరత్తు

నెల్లూరు(జడ్పీ), జనవరి 28 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి కీలకమైన పంచాయతీ పాలనలో మార్పులకు కూటమి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ప్రస్తుతం ఉన్న వ్యవస్థను మరింత మెరుగు పరిచేందుకు ప్రతిపాదనలు ఆహ్వానించింది. గత ప్రభుత్వంలో పంచాయతీలు పూర్తిగా నిర్వీర్యమయ్యాయి. దీంతో గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడింది. పంచాయతీలకు వచ్చే నిధులను సైతం వైసీపీ ప్రభుత్వం వాడుకుంది. దీంతో అటు సర్పంచులు,ఇటు ఉద్యోగులు ఉత్సవ విగ్రహాల్లా మిగిలారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పల్లెల అభివృద్ధికి అధిక ప్రాధాన్యతను ఇస్తోంది. ఇందులో భాగంగా అటు అభివృద్ధి పనులు పెద్దఎత్తున చేపడుతూనే, ఇటు పాలనలో మార్పులకు కసరత్తు చేస్తున్నది.

● డివిజనల్ అధికారుల నియామకం

గ్రామాల్లో మెరుగైన పాలనా వ్యవస్థకి మార్పుల కోసం ప్రభుత్వం పంచాయతీ అధికారులు, పంచాయతీరాజ్‌కి చెందిన వివిధ సంఘాల నేతల నుంచి సూచనలు , సలహాలు తీసుకుంటున్నది. ఈ క్రమంలో



రెండురోజుల క్రితం విజయవాడలో పంచాయతీరాజ్ కమిషనర్ అన్నీ జిల్లాల డీపీవోలు, ముఖ్య అధికారులు, వివిధ సంఘాల నేతలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పంచాయతీ పాలనలో మార్పులకు వారి నుంచి సూచనలు తీసుకున్నారు. పంచాయ తీలకు డివిజనల్ అధికారుల (డీడీవో) వ్యవస్థను ఏర్పాటు చేయాలని పలువురు సూచించారు. జిల్లాలోని ప్రతి డివిజన్‌లో రెవెన్యూలో ఆర్డీవో, పోలీసుశాఖలో డీఎస్పీ ఉన్న విధంగా పంచాయతీలకు ప్రత్యేకంగా డీడీవో పోస్టును ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు చేశారు. అలాగే గ్రూప్ వన్ పోస్టును ఈ కేడర్‌కు కేటాయించేలా చూడాలని తెలిపారు. దీంతో డీపీవో, డీడీవో, డిప్యూటీ సీఈవోలు ఒకే ర్యాంకుకు చెందిన అధికారులు ఉండేలా చూడాల కోరారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను పంచాయతీరాజ్ కమిషనర్ ప్రభుత్వానికి పంపనున్నారు. డీడీవో పర్యవేక్షణలో గ్రామాలకు సంబంధించి అన్ని శాఖల అభివృద్ధి పనులు జరిగేలా చర్యలు తీసుకోనున్నట్లు తెలిసింది. అలాగే పైస్థాయిలో పదోన్నతులు కల్పించడం ద్వారా కిందిస్థాయి ఉద్యోగులకు ఉద్యోగోన్నతి కలిగేలా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపనున్నారు. దీనిపై త్వరలోనే ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకోనే అవకాశం ఉన్నట్లు సమాచారం.

డాక్టర్ ఎస్ఆర్ శంకరన్ రిసోర్సు సెంటర్



కొత్త పుంతలు తొక్కుతున్న సాంకేతిక పరిజ్ఞానం మానవ జీవనశైలిని సులభతరం చేస్తోంది. డిజిటల్ విప్లవం పోనుపోను ఎన్నో ఆవిష్కరణలకు, అద్భుతాలకు నాంది పలకనుంది. రానున్న కాలంలో కుటుంబాలకు, దేశ ఆర్థిక వ్యవస్థకు దన్నుగా నిలిచేది నేటి విద్యార్థులే. ఇటువంటివారికి సాంకేతిక విద్యను అందించాల్సిన ఆవశ్యకతను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. ప్రభుత్వం సంక్షేమ వసతి గృహాల్లో చదువుకుంటున్న 9, 10 తరగతుల విద్యార్థులపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక ఫోకస్ పెట్టింది. ఆ వసతి గృహాల్లో మెరుగైన వసతులతోపాటు సాంకేతిక విద్యాబోధన అందించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా ముందుగా బీసీ వసతి గృహాల్లో డిజిటల్ బోధనకు శ్రీకారం చుడుతోంది.

'సంక్షేమం'లో సాంకేతికత

- వసతి గృహ విద్యార్థులకు డిజిటల్ బోధన
- పైలట్ ప్రాజెక్టుగా జిల్లా
- తొలుత నాలుగు బీసీ హాస్టళ్లలో అమలు
- ప్రత్యేక గదిలో పరికరాలు
- రెండు రోజుల్లో ప్రారంభం

నెల్లూరు(హరనాథపురం), జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లాను పైలట్ ప్రాజెక్టుగా ఎంపికచేసి, ప్రయోగాత్మకంగా నాలుగు బీసీ వసతి గృహాల్లో తొలుత డిజిటల్ విద్యాబోధనకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. జిల్లాలో డాక్టర్ ఎస్ఆర్ శంకరన్ రిసోర్సు సెంటర్ పేరుతో మహ్మదాపురం(బాలురు), పొదలకూరు(బాలికలు), ఆత్మకూరు(బాలికలు), కావలి(బాలురు) వసతి గృహాల్లో డిజిటల్ బోధన కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిలో 9, 10 తరగతుల విద్యార్థులకు ప్రత్యేకంగా గదులను ఏర్పాటు చేశారు. అందులో కంప్యూటర్‌తోపాటు, భారీ ఎల్ఈడీ స్క్రీన్‌ను సిద్ధం చేశారు. ఈ బోధనకు ప్రత్యేకంగా ఉపాధ్యాయులను నియమించనున్నారు. జిల్లాలో 78 బీసీ సంక్షేమ శాఖ వసతి

- మిగతా 4లో

ఇది బస్‌షెల్టరేనా..!?



ఉదయగిరి పంచాయతీ బస్టాండ్ నుంచి ప్రతిరోజు వందలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. అలాంటి వారికి మౌలిక వసతులు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారు. ఇక్కడున్న బస్‌షెల్టర్ అపరిశుభ్రతకు నిలయంగా మారి, దుర్గంధం వెదజల్లుతోంది. మందుబాబులు, యాచకులుకు అడ్డాగా మారింది. బస్‌షెల్టర్‌లో కూర్చునేందుకు బెంచీలు, ఇతర సామగ్రి అడ్డుగా ఉన్నాయి. ఇటీవల ఎమ్మెల్యే కాకర్ల సురేష్ నాయకులతో కలిసి ఈ బస్‌షెల్టర్ దుస్థితి చూసి దుర్వాసన భరించలేక ముక్కుమూసుకున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి బస్‌షెల్టర్‌ను శుభ్రం చేసి, మౌలిక వసతులు కల్పించి పలువురు కోరుతున్నారు.

-ఉదయగిరి, (ఆంధ్రజ్యోతి)



హరినాథపురం ఫ్లైఓవర్ బ్రిడ్జికి రంగులు వేస్తున్న కళాకారులు



సుందర నగరం కోసం సోకులు

నగరంలో చేపట్టిన సుందరీకరణ పనులు నెల్లూరుకి కొత్తరూపును తీసుకువస్తున్నాయి. ఫ్లైఓవర్ల రోడ్డు పక్కన ఉన్న గోడలకు రంగురంగుల చిత్రాలు వేసి అందంగా తీర్చిదిద్దుతున్నారు. హరినాథపురంలో ఉన్న ఫ్లైఓవర్ నుంచి ఈ పనులు మొదలవడం ఆ ప్రాంతానికి ప్రత్యేక ఆకర్షణ నిలిచాయి. ఈ రంగుల చిత్రాలు ఆహ్లాదకర వాతవరణాన్ని కల్పించడమే కాకుండా, ప్రజల్లో మంచి అనుభూతిని కలిగిస్తున్నాయి. ఈ చిత్రాలు కేవలం అందానికి మాత్రమే కాదు... స్థానిక సంస్కృతి, చరిత్ర, నైతిక సందేశాలను ప్రతిబింబించేలా ఉన్నాయి.

- ఫొటోలు : స్టాఫ్ ఫొటోగ్రాఫర్

అందంగా కనిపిస్తున్న ఫ్లై ఓవర్ బ్రిడ్జి





వన్యప్రాణులకు రక్షణ ఏదీ!?

- ఎనిమిదేళ్లలో ఐదు చిరుతల మృతి
- రోడ్డు ప్రమాదంలో గాయపడిన పెద్ద పులి
- కుక్కల దాడిలో దుప్పులు.. మరికొన్ని వన్యప్రాణుల మృత్యువాత
- వివరాలు నమోదు చేయని అటవీ శాఖ
- వెలుగొండ అటవీ ప్రాంతంలో కరువైన రక్షణ కంచె

మర్రిపాడు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : సువిశాలమైన వెలుగొండ అటవీ ప్రాంతంలో వన్యప్రాణులకు రక్షణ కరువవుతోంది. వేటగాళ్ల నుంచి తప్పించుకుంటున్నా దాహం తీర్చుకోవడానికి బయటకు వస్తున్న మూగప్రాణులు వివిధ ప్రమాదాల్లో మృత్యువాత పడుతున్నాయి. గడిచిన ఎనిమిదేళ్లలో ఐదు చిరుతలు రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందాయి. వీటితోపాటు ఇతర జంతువులు నీటి కోసం గ్రామశివార్లలోకి వచ్చి కుక్కల దాడిలో మృత్యువాత పడ్డాయి. అయినా అటవీ అధికారులు మాత్రం మూగప్రాణుల రక్షణకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ఏదైనా సంఘటన జరిగిన సమయంలో హడావుడి చేసి ఆ తరువాత మరిచిపోతున్నారు. చనిపోయిన జంతువుల వివరాలు కూడా వారి వద్ద లేకపోవడం గమనార్హం.

రక్షణ చర్యలు ఏవీ ?

కాగా వెలుగొండ అటవీప్రాంతం తిరుపతి జిల్లా ఏర్పేడు-నకిరేకల్ జాతీయ రహదారి వైపు సింగన పల్లి నుంచి జిల్లా సరిహద్దు వరకు సుమారు ఆరు కిలోమీటర్లు, సరిహద్దు నుంచి నెల్లూరు-ముంబాయి జాతీయ రహదారి వైపు చుంచులూరు వరకు సుమారు 11కిలో మీటర్లు విస్తరించి ఉంది. అటవీ ప్రాంతంలో వెళ్లే రోడ్డుకు ఇరువైపులా ఎలాంటి రక్షణ కంచెను అధికారులు ఏర్పాటు చేయ లేదు. ప్రతిరోజూ ఎక్కడపడితే అక్కడ జంతువులు రోడ్డుకు ఇరువైపులా తిరుగుతూ ఉంటాయి. ఈ క్రమంలో వాహనాల రాకపోకలు సాగించేటప్పుడు ప్రమా దానికి గురవుతుంటాయి.



చనిపోయిన పులిని పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు (ఫైల్)

జంతుగణన ఏదీ?

అడవిలో ఏ జంతువులు ఎన్ని ఉన్నా యని అటవీ అధికారులను అడిగితే, అలాంటి లెక్కలు తమ వద్ద లేవని చెబుతు న్నారు. కేవలం పరిసర గ్రామాలవారి మాటల ఆధారంగా పలానా రకం జంతువులు ఇన్ని ఉన్నాయని చెబుతున్నారు. ఆ మాటలను ఉన్నతాధికారులు గుడ్డిగా నమ్మడం హాస్యాస్పదం.

గత సంఘటనలు

- 2018లో జిల్లా సరిహద్దులో నెల్లూరు-ముంబాయి రహదారిపై ఓ చిరుత మృతి చెందింది.
- 2022 మార్చిలో సింగన పల్లి సమీపంలో రోడ్డు దాటే క్రమంలో మరో చిరుత మృత్యువాత పడింది.
- 2023లో సింగనపల్లి వద్ద రోడ్డు దాటే క్రమంలో మరో చిరుత మృతి చనిపోయింది.
- 2024 మార్చిలో మరో చిరుత..
- 2025 జనవరి 27న మరో చిరుత మృతి చెందాయి.
- కోతులగుండం కనుమరుగు
సింగనపల్లి అటవీ ప్రాంతంలో కోతులగుండం అనే పర్యాటక కేంద్రం గతంలో ఉండేది. వర్షాకాలం కొండల నుంచి ప్రవహిస్తున్న జలపాతాన్ని, ప్రకృతి అందాలను తిలకించేందుకు గతంలో వందలాది పర్యాటకులు వస్తుండేవారు. కాలక్రమీణా అది కనుమరుగు అయింది.

అడవి జంతువుల రక్షణ బాధ్యత వారిదే..



అడవి జంతువులను సంరక్షించాల్సిన బాధ్యత అటవీశాఖ అధికారులదే. వేసవిలో నీటిఎద్దడికి తాళలేక అడవి సమీపంలో ఉండే గ్రామాల్లోకి, రోడ్లపైకి వస్తూ జంతు వులు ప్రమాదాల బారిన పడుతున్నాయి. రానున్న వేసవికాలంలో అయినా జంతువుల జాడను గుర్తించి నీటితొట్టెలు, గుంతలు ఏర్పాటు చేసి వాటిని కాపాడాలి.

- ఎం.రాయుడు, జంతు ప్రేమికుడు, మర్రిపాడు

చుట్టూ కంచె ఏర్పాటు చేయాలి



ప్రమాదాలు జరిగినప్పుడు హడావుడి చేయడం కాదు. నీటి కోసం అప్పుడప్పుడు అడవి జంతువులు గ్రామంలోకి వస్తుంటాయి. కొన్ని కుక్కల బారిన పడుతున్నాయి. అడవి చుట్టూ కంచె ఏర్పాటు చేసి వాటిని రక్షించి, మాకు ధైర్యాన్ని ఇవ్వాలి.

- నాగేశ్వరావు, స్థానికుడు

హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశాం

రోడ్డుపై వెళ్లే వాహనాలు నిదానంగా వెళ్లాలని వాహనదారులకు సూచిస్తున్నాం. రహదారి వెంబడి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశాం. అయినా ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ఇక్కడ పరిస్థితిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

- శేఖర్, ఆత్మకూరు అటవీ రేంజర్

ఫోర్జరీపై కేసు నమోదు

- రూ.8 లక్షలు తీసుకొని దొంగ ప్రొసీడింగ్స్ తయారీ

నెల్లూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : జాయింట్ కలెక్టర్ సంతకం ఫోర్జరీ వ్యవహారంలో ఎట్టకేలకు పోలీసులు కేసు నమోదు చేశారు. తహసీల్దార్ ఫిర్యాదు మేరకు ముగ్గురిని నిందితులుగా చేరుస్తూ దర్గామిట్ట పోలీసులు ఎఫ్ఐఆర్ కట్టారు. 'ఇంత బరితెగింపా!?' శీర్షికన మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం కలకలం రేపింది. దీంతో మంగళవా రం పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే తహసీల్దార్ ఈ నెల 26వ తేదీన ఫిర్యాదు చేసినప్పటికీ ఎఫ్ఐఆర్‌లో మాత్రం 28వ తేదీన ఫిర్యాదు చేసినట్లు నమోదు చేయడం గమనార్హం. తహసీల్దార్ ఫిర్యాదు, పోలీసుల కేసు నమోదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. బల్లి జయప్రసాదరావు, వడియార సురేష్ అనే ఇద్దరు వ్యక్తులు జాయింట్ కలెక్టర్ సంతకంతో ఉన్న ప్రొసీడింగ్ కాపీని నెల్లూరు రూరల్ తహసీల్దార్‌కు ఈ నెల 17న అందజే శారు. ఆ ప్రొసీడింగ్స్‌లోని ఆర్డర్స్ మేరకు చందలూరు కేశవరావు పేరుపై ఉన్న కనుపర్తిపాడు రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 115-2-1లోని 4.25 ఎకరాల భూమి అడంగల్ కరెక్షన్ చేయాలని కోరారు. ఈ నెల 23వ తేదీన ఈ ప్రొసీడింగ్స్‌ను పరిశీలించిన తహసీల్దార్.. ఆ ప్రొసీడింగ్స్‌పై ఉన్న ఫైల్ నంబర్ మీద అనుమానంతో ప్రొసీడింగ్స్‌ను ఈ-డిస్ట్రిక్ మేనేజర్‌కు పంపి పరిశీలించమని కోరారు. కలెక్టరేట్‌లోని సంబంధిత సెక్షన్‌లో పరిశీలించగా ఆ ఫైల్ నంబర్‌తో అసలు ఏ ప్రొసీడింగ్స్ జారీ చేయలేదని నిర్ధారించారు. దీంతో అది ఫోర్జరీ ప్రొసీడింగ్ అని అంచనాకు వచ్చిన అధికారులు విష యాన్ని జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ నెల 24న వడియార సురేష్, బల్లి జయప్రసాదరావు, చందలూరు కేశవరావును కలెక్టరేట్‌కు పిలిపించి విచారించారు. వారి స్టేట్‌మెంట్ ఆధారంగా సదరు ఫోర్జరీ డాక్యుమెంట్ పీ ధనుంజయ అనే వ్యక్తి నుంచి వచ్చిందని తేల్చారు. అతడికి కోవూరుకు చెందిన కంద మహేంద్ర అనే వ్యక్తి పంపారని నిర్ధారించుకు న్నారు. ఇందుకు రూ.8 లక్షల నగదు తీసుకున్నట్లు కూడా విచారణలో వెల్లడైంది. అయితే మహేంద్ర అనే వ్యక్తి ఆ ఫోర్జరీ డాక్యుమెంట్‌తో తనకు సంబంధం లేదని ఈ నెల 25వ తేదీన కలెక్టరేట్‌లో అధికారులకు స్టేట్‌మెంట్ ఇచ్చారు. వీటన్నింటి నేపథ్యంలో నిజానిజాలు తేల్చి జాయింట్ కలెక్టర్ సంతకంతో ఫోర్జరీ డాక్యుమెంట్‌ను సృష్టించిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ లాజరస్ ఈ నెల 26న పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఏ1గా మహేంద్ర, ఏ2గా ధనుంజయ, ఏ3గా చందలూరు కేశవరావు, మరొకందరు అని ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

ఇంటర్ తత్కాల్ ఫీజు చెల్లింపునకు నేడే ఆఖరు

నెల్లూరు(విద్య), జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు ఇప్పటి వరకు ఫీజు చెల్లించని విద్యార్థుల సౌకర్యం కోసం తత్కాల్-2 పథకం కింద రూ.3వేలు అపరాధ రుసుముతో ఫీజు చెల్లించేందుకు బుధవారం తుది గడువుగా ఇంటర్‌బోర్డు అవకాశం కల్పించిందని ఆర్ఐవో డాక్టర్ ఏ శ్రీనివాసులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు ఈ సమాచారాన్ని విద్యార్థులకు తెలియచేసి చివరి అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

గొంతు చించుకోవద్దు.. మీ అక్రమాలు గుర్తుంచుకోండి

- కాకాణి, చంద్రశేఖర్‌రెడ్డికి కోటంరెడ్డి కౌంటర్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి

నెల్లూరు (వైద్యం), జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : 'గొంతు చించుకుని మీరు మాట్లాడటం విడ్డూరంగా ఉంది. గతంలో చేసిన అక్రమాలను గుర్తు తెచ్చుకోండి' అంటూ మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్సీ చంద్ర శేఖర్‌రెడ్డి నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి కౌంటర్ ఇచ్చారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నెల్లూరులోని బాలాజీ నగర్‌లో వైసీపీ నేత బాలకృష్ణారెడ్డికి చెందిన అక్ర మ కట్టడాన్ని అధికారులు కూల్చేశా రన్నారు. రూ.3కోట్ల విలువైన కాలువ పోరంబోకు స్థలాన్ని ఆక్రమించి బిల్డింగ్ నిర్మిస్తే సైలెంట్‌గా ఉండాలా... అని ఆగ్రహం వ్యక్తం చేశారు. భవనం కూల్చివేయడంపై కాకా ణి, చంద్రశేఖర్ రెడ్డి గొంతు చించుకుని మాట్లా డుతున్నారని ఎద్దేవా చేశారు. కోర్టు ఉత్తర్వుల ప్రకారం అక్రమ కట్టడాన్ని కూల్చేస్తే అధికారులను బెదిరించ డం తగదన్నారు. టీడీపీ నేత జహీర్ ఇళ్లు కూల్చేసి నప్పుడు కాకాణి, చంద్రశేఖర్‌రెడ్డి ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. పోలీసులను అడ్డు పెట్టుకుని మీలా విధ్వంసాలకు పాల్పడటం లేదని పాలనను గాడిలో పెడుతున్నామని చెప్పారు. కాకాణి అరాచకాలు సర్వేపల్లి నియోజకవర్గం మొత్తం తెలుసన్నారు. మంత్రి నారాయణను విమర్శించే స్థాయి ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డికి లేదన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నగర అధ్యక్షుడు మామిడాల మధు, నాయకులు ఉచ్చి భువనేశ్వరీ ప్రసాద్, కువ్వారపు బాలాజీ, అంచూరు శ్రీనివాసులు నాయుడు, జహీర్, కోకు మహేంద్రరెడ్డి, ఆకుల హనుమంతరావు, తంబి, సుజన్‌కుమార్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై ఫిర్యాదు

సంగం, జనవరి 28: మండలంలోని పెరమనకు చెందిన ఓ యువతి అదృశ్యమైనట్లు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు అందింది. యువతి డిగ్రీ పూర్తి చేసి, కొంత కాలంగా ఇంట్లో ఉంటుంది. సోమవారం మధ్యాహ్నం యువతి తండ్రి అన్నం తిని నిద్రపోయి లేచేటప్పటికి కనిపించలేదు. బం ధువులు, స్నేహితుల ఇళ్లను పరిశీలించారు. కానీ ఆచూకీ తెలియలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.



సింహపురి సాంస్కృతిక ఉత్సవాల కార్యక్రమంలో మాట్లాడుతున్న అఖిల భారత మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి రమాదేవి

బడాబాబులకు దేశ సంపదను దోచిపెడుతున్న ప్రభుత్వాలు

- అఖిల భారత మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి రమాదేవి

నెల్లూరు (వైద్యం), జనవరి 28 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామికవేత్తలకు దేశసంపదను దోచిపెట్టే విధంగా ప్రభుత్వాలు పాలన సాగిస్తున్నాయని అఖిల భారత మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి రమాదేవి విమర్శించారు. సీపీఎం 27వ రాష్ట్ర మహాసభలను పురస్కరించుకుని నెల్లూరులో రెండోరోజు మంగళవారం కూడా సింహపురి సాంస్కృతిక ఉత్సవాలు కొనసాగాయి. ఈ సందర్భంగా ఆమె నెల్లూరు నగరంలో ఫిబ్రవరి 1,2,3 తేదీల్లో ఎంతో వైభవంగా సీపీఎం రాష్ట్ర మహాసభలు జరగబోతున్నాయని పేర్కొన్నారు. పుచ్చలపల్లి సుందరయ్య వారసులుగా ఎంతో ఉత్తేజం పొందిన పార్టీ నేతలు, కార్యకర్తలు ఎన్నో ప్రజా పోరాటాలు నిర్వహిస్తున్నారన్నారు. దేశంలో ఉన్న సంపదను పారిశ్రామిక వేత్తలు అదానీ, అంబానీలకు దోచి పెట్టేలా ప్రస్తుత కేంద్ర ప్రభుత్వ పాలన సాగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. సంపద సృష్టిస్తామని, ప్రపంచ బ్యాంకుకు ఊడిగం చేస్తున్న నేతలు నేడు గద్దె నెక్కి ఉన్నారన్నారు. ఈ పరిస్థితిలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆమె కోరారు. మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ 45 ఏళ్ల క్రితం ఈ గడ్డ మీద జరిగిన సీపీఎం మహాసభను కళ్లారా చూశామన్నారు. మళ్లీ వచ్చేనెలలో నెల్లూరులో జరిగే మహాసభలను చూస్తామన్నారు. బాబ్రీ మసీదు పడగొట్టిన తర్వాత మతసామరస్యానికి విఘాతం కలిగించకూడదన్న ఉద్దేశంలో జక్కా వెంకయ్య పార్టీ జెండా పట్టుకుని జిల్లా అంతటా తిరగారన్నారు. సారాఉద్యమాన్ని జిల్లాలో వామపక్షాలే చేపట్టాయని గుర్తు చేశారు. రాబోయే కాలంలో ఎన్నో సవాళ్లు ఎదుర్కొవాల్సి వస్తుందని తెలియచేశారు. ఈ నేపథ్యంలో సీపీఎం మీద ఎన్నో బాధ్యతలు ఉన్నాయన్నారు. సభా అధ్యక్షురాలు రెహానాబేగం తదితరులు మాట్లాడారు. అనంతరం కళాకారులకు నేతలు మెమొంటోలు అందచేశారు. ఈ సంద ర్భంగా నెల్లూరు సిటీ జానపద కళాకారుల కోలాటం, యల్లాయపాళెం గిరిజనుల నృత్యం, డప్పుల విన్యాసం, బుజ బుజనెల్లూరు కళకారుల నృత్యాలు అందరినీ అలరించాయి. కార్యక్ర మంలో ప్రజా నాట్యమండలి జిల్లా అధ్యక్షుడు వేణు, ప్రముఖ రచయితలు ఈతకోట సుబ్బారావు, గంగిశెట్టి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌సీడీసీ సర్వేను వేగవంతం చేయండి

- అదనపు డీఎంహెచ్‌వో ఖాదర్‌వలి



పిడూరులో సర్వేను పరిశీలిస్తున్న అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ ఖాదర్‌వలి

మనుబోలు, జనవరి 28(ఆంధ్రజ్యోతి): ఎల్‌సీడీసీ (కుష్టు వ్యాధి) సర్వేను వేగవంతం చేయాలని జిల్లా అదనపు వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఖాదర్‌వలి అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎల్‌సీడీసీ సర్వే గురించి సిబ్బందిని ప్రశ్నించారు. మండలంలో ఇప్పటి వరకు 11వేల ఇళ్లు సర్వే చేశామని, ఇంకా 5వేల ఇళ్లు చేయాల్సి ఉందని వైద్యురాలు మొహసీనా సుల్తానా తెలిపారు. ఫిబ్రవరి 2 నాటికి నూరుశాతం సర్వే పూర్తి చేయాలని ఆయన సూచించారు. అనంతరం పిడూరు గిరిజన కాలనీలో సర్వేని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

దూబగుంటలో పొగాకు బ్యారన్ దగ్ధం



దూబగుంటలో దగ్ధం అవుతున్న పొగాకు బ్యారన్

కందుకూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని దూబగుంటకు చెందిన దామా మల్లేశ్వరరావు, దామా మాధవరావులకు చెందిన ఉమ్మడి బ్యారన్‌లో మంగళవారం అగ్ని ప్రమాదం జరిగింది. క్యూరింగ్ జరుగుతున్న సమయంలో అగ్నిప్రమాదం సంభవించి 1100 కర్రలు పొగాతో వాటిని ఏర్పాటుకు ఉపయోగించిన టైర్లు, కర్ర, గొట్టాలు, పైకప్పు కాలిపోయినట్లు చెప్పారు. బ్యారన్ పూర్తిస్థాయిలో పనికి రాకుండా మొండిగోడలు మాత్రమే మిగిలాయని బాధితులు వాపోయారు. విషయం తెలసుకున్న కందుకూరు అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి వెళ్లి మంటలు పక్క బ్యారన్లకు రాకుండా చర్యలు తీసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.8లక్షలు ఉంటుందని, ప్రభుత్వం స్పందించి ఆర్థికసాయం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

చెక్కనగిషీ కేంద్రం అభివృద్ధికి చర్యలు

- డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి

ఉదయగిరి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చెక్కనగిషీ కేంద్రం అభివృద్ధికి అన్నీ చర్యలు చేపడుతున్నట్లు డీఆర్‌డీఏ ప్రాజెక్టు అధికారి నాగరాజ కుమారి పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కో-ఆర్డినేటర్ అరుణకుమార్‌తో కలిసి ఆమె చెక్కనగిషీ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రంలో వసతులు, యంత్రాలు, మహిళా కళాకారులు తయారు చేసిన వస్తువులు పరిశీలించి నిర్వాహకులు జాకీర్‌హుస్సేన్, గౌసియాబేగంతో చర్చించారు. అనంతరం మాట్లాడుతూ వన్‌డిస్ట్రిక్-వన్ ప్రొడక్ట్‌లో భాగంగా చెక్కనగిషీ కేంద్రం అభివృద్ధికి ఏం చర్యలు చేపట్టాలి, మార్కెటింగ్ సౌకర్యం, ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం అందించాలనే అంశంపై ఉన్నతాధికారులతో చర్చించి తదుపరి చర్యలు చేపడతామన్నారు. ఈ కేంద్రంలో ఎక్కువమందికి ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు భవనం శిథిలావస్థకు చేరిందని, నూతన భవనం మంజూరు చేయాలని విన్నవించారు.



కళాకారులు తయారు చేసిన కొయ్య వస్తువులను పరిశీలిస్తున్న పీడీ నాగరాజకుమారి

నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని ఆమె పేర్కొన్నారు. మంగళవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో సీసీలు, వీవోఏలు, వలంటీర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శిక్షణ పొందిన వీవోఏలు, వలంటీర్లు క్రమం తప్పకుండా ప్రతినిత్యం కేంద్రాలను నిర్వహించాలన్నారు. పీఎం సూర్యఘర్ పథకాన్ని పొదుపు మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అప్పాజీ, సీసీలు తదితరులు పాల్గొన్నారు.

'సంక్షేమం'లో సాంకేతికత

(3వ పేజీ తరువాయి)

గృహాలు ఉండగా వాటిలో నాలుగు వేలమంది విద్యార్థులు వసతి పొందుతూ చదువుకుంటున్నారు. కాగా, తొలుత నాలుగు హాస్టళ్లలో డిజిటల్ బోధనా సెంటర్లు ఏర్పాటు చేయగా ఇది విజయవంతమైతే జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్నీ వసతి గృహాల్లో ఆ బోధనను అంచెలంచెలుగా అమలు చేయనున్నారు.

సొంత భవనాలకు మరమ్మతులు



రిసోర్సు సెంటర్‌లో ఏర్పాటు చేసి పెద్ద ఎల్‌ఈడీ స్ర్కీన్

జిల్లాలో గత వైసీపీ పాలనలో వసతి గృహాల్లో అభివృద్ధి మృగ్యమైంది. హాస్టళ్ల నిర్వహణను నాటి పాలకులు గాలికి వదిలేశారు. విద్యార్థులకు కాస్మెటిక్ చార్జీలు సైతం చెల్లించలేదు. 2018 నాటి ధరలతోనే మెనూను అమలు చేయటంతో ఆ ప్రభావం ఆహార నాణ్యతపై పడింది. వార్డెన్లకు బిల్లులు చెల్లించకపోవటంతో వారు మెనునూ సక్రమంగా పట్టించుకోలేదన్న ఆరోపణలున్నాయి. దీంతో వసతి గృహాల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గింది. కూటమి ప్రభుత్వం కొలువైన తరువాత వసతి గృహ భవనాల మరమ్మతులకు నివేదిక తెప్పించుకుంది. జిల్లాలో 34 ప్రభుత్వ వసతి గృహాల మరమ్మతులకు రూ.78 లక్షలు ఖర్చవుతుందన్న అధికారుల అంచ నాకు ఆమోదం తెలిపినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో వసతిగృహాలు త్వరలో కళకళలాడనున్నాయి.

రెండు రోజుల్లో ప్రారంభం



జిల్లాలో ప్రయోగాత్మకంగా నాలుగు బీసీ వసతి గృహాల్లో డిజిటల్ విద్యా బోధనకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఇందుకోసం హాస్టళ్లలో ఒక గదిని ప్రత్యేకంగా రూపొందించాం. ఆ గదిలో కంప్యూటర్, ఎల్‌ఈడీ స్ర్కీన్, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను ఏర్పాటు చేయించాం. ఇందుకు ప్రభుత్వం రూ.4.45 లక్షలు కేటాయించింది. రెండు రోజుల్లో బోధనా కార్యక్రమాలు ప్రారంభిస్తాం. దీనిని వసతిగృహ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి.

- వెంకట లక్ష్మమ్మ, జిల్లా బీసీ సంక్షేమాధికారి

ఇంకెక్కడి స్వచ్ఛభారత్?

● అల్లూరు నగర పంచాయతీలో చెత్త సేకరణ సమస్య

● ఎక్కడికక్కడి కుప్పలు పోసి తగలేస్తున్న పారిశుధ్య సిబ్బంది

అల్లూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ భారత్, స్వచ్ఛ ఆంధ్ర అంటూ ప్రభుత్వాలు, ప్రభుత్వ పెద్దలు కంటున్న కలలు క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. అల్లూరు నగర పంచాయతీలో చెత్త సమస్య తీవ్రతరం దాల్చుతోంది. గ్రామాల్లో పేరుకున్న చెత్తను స్వచ్ఛభారత్, స్వచ్ఛ ఆంధ్ర అంటూ ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అధికారులు విభిన్నంగా వ్యవహరిస్తున్నారు. వీధుల్లోని చెత్తను తొలగించి దూరప్రాంతంలోని డంపింగ్ యార్డుల్లో పడేయాల్సి ఉన్నప్పటికీ గ్రామాల శివార్లలో వేసి తగులబెట్టి చేతులు దులుపుకుంటున్నారు. దీంతో వాతావరణ కాలుష్యం తీవ్రం అవుతుంది. అటుగా వెళ్లే వాహనదారులు ముక్కులు, కళ్లు మూసుకొని వాహనాలు నడపాల్సి వస్తోంది. అదేవిధంగా నార్తుమోపూరులో ఏర్పడిన చెత్తను ప్రధాన కూడలిలో పడేస్తున్నారు. విపరీతంగా ఈగలు, దోమలు చేరి చుట్టుపక్కల వారు వ్యాధులబారిన పడేలా చేస్తోందంటూ గ్రామస్థులు వాపోతున్నారు. నగర పంచాయతీగా మారితే అభివృద్ధి జరుగుతుందని భావించిన అప్పటి పాలకులకు నేడు ప్రజలు పడుతున్న అవస్థలు కళ్లకు కట్టినట్టు కనిపిస్తున్నాయి. చెత్తను నియంత్రణలో నగర పంచాయతీ అధికారులు విఫలం అవుతున్నారని విమర్శిస్తున్నారు. వాతావరణ కాలుష్యంతో పాటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుందని.. ఇలా అయితే స్వచ్ఛభారత్ సాధ్యమేనా అంటూ ప్రజలు చర్చించుకుంటున్నారు.


నార్తుమోపూరులోని ప్రధాన కూడలిలో పడేసిన చెత్త

హెల్మెట్ లేనివారే.. ప్రమాదాల్లో మరణిస్తున్నారు


ఆత్మకూరు: ర్యాలీని ప్రారంభిస్తున్న మున్సిపల్ కమిషనర్


కందుకూరు : జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న ఆర్టీవో లక్ష్మి

కందుకూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలలో భాగంగా కందుకూరు ఆర్టీవో టీవీఎస్.లక్ష్మి ఆధ్వర్యంలో రవాణాశాఖ అధికారులు, సిబ్బంది మంగళవారం హెల్మెట్లు ధరించి పట్టణంలో బైకు ర్యాలీ నిర్వహించారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ పెట్టుకుంటే కలిగే ప్రయోజనాలు వివరిస్తూ దూబగుంట సమీపంలోని ఆర్టీఓ కార్యాలయం నుంచి ఆర్టీసీ డిపో, పోస్టాఫీసు సెంటర్ మీదుగా ఎన్టీఆర్ సర్కిల్ వరకు ర్యాలీ కొనసాగించారు. ఈ సందర్భంగా టీవీఎస్ లక్ష్మి మాట్లాడారు. రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువగా 18-30ఏళ్ల మధ్య యువకులే ఉంటున్నారని.. వీరిలో అత్యధిక శాతం హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడిపి వారే ఉన్నారని తెలిపారు. పరిమిత వేగంతో వెళ్తే మర ణాలను నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంవీఐ సీహెచ్ రాంబాబు, ఎన్ఫోర్స్‌మెంట్ ఎంవీఐ గోపినాయక్ పాల్గొన్నారు.

● ఆత్మకూరు: ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఆత్మకూరు సీఐ గంగాధర్ తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద నుంచి ర్యాలీని మునిపల్ కమిషనర్ గంగాప్రసాద్ జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ ప్రధాన రహదారి వెంబడి మున్సిపల్ బస్టాండ్ వద్దకు సాగింది. అనంతరం పట్టణ సమీపంలోని ఆంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు హెల్మెట్ ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో ఎస్ఐ షేక్ జిలాని, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లే అవుట్ల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి..

● సీహెచ్ శ్రీదేవి, కావలి ఎంపీడీవో



కావలి రూరల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులో లేఅవుట్లు వేసేవారు తప్పనిసరిగా పంచాయతీ, నుడా అనుమతి తీసుకోవాలని కావలి ఎంపీడీఓ సీహెచ్.శ్రీదేవి తెలిపారు. గత ప్రభుత్వంలో అక్రమ లే అవుట్లతో ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టారని, ఇపుడు అలాంటి పరిస్థితి ఉండదన్నారు.

? ఎన్ని అక్రమ లేఅవుట్లను గుర్తించారు.

! 17పంచాయతీల్లో 11పంచాయతీల్లో అక్రమ లేఅవుట్లు ఉన్నట్లు గుర్తించాం. నోటీసులు జారీ చేశారు. కొన్నిప్రాంతాల్లో లేఅవుట్లలో హద్దురాళ్లను తొలగించాం. సమస్యతో పంచాయతీలకు లక్షల ఆదాయంతో పాటు స్థలాలు కోల్పోతున్నారు.

? ప్రభుత్వ స్థలాలు ఉన్నట్లు ఫిర్యాదులు ఏమైనా వస్తున్నాయా.

! ఆముదాలదిన్నె, తుమ్మలపెంట లేఅవుట్లలో మఠం భూమి, పోచమ్మదొరువు ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురైనట్లు ఫిర్యాదు వచ్చాయి. వాటిపైనే విచారణ చేసి నిజమని నిర్ధారణ చేసుకుని ఆక్రమణలు తొలగిస్తున్నాం.

మూడు నెలలుగా సీసీ రోడ్డు వివాదం

● రహదారి వేసేందుకు ప్రయత్నం

● అడ్డుకున్న స్థలం యజమానులు


సంఘటన స్థలంలో ఉన్న పోలీసులు

ఉలవపాడు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): చాకిచర్ల పంచాయతీ సుబ్బరాయుడు సత్రం గ్రామంలో సిమెంట్ రోడ్డు వివాదం మూడు నెలలుగా కొనసాగుతోంది. మంగళవారం మరోమారు ఇదే రోడ్డు విషయమై స్థానిక అధికార పార్టీ నాయకులు ఎక్స్‌కవేటర్‌తో తెచ్చి మట్టి తవ్వేందుకు పోలీసుల బందోబస్తుతో వచ్చారు. ఈ స్థలంను తన తండ్రి 1985లోనే కొనుగోలు చేశాడని, ఇక్కడ సిమెంట్ రోడ్డు ఎలా వేస్తారని నారిశెట్టి మాల్యాద్రి కుటుంబ సభ్యులతో అడ్డుకున్నారు. ఈ సమయంలో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు, పంచాయతీ సిబ్బంది సంఘటనా స్థలం లేకపోవడం విశేషం. స్థానిక అధికార పార్టీ నాయకుడు ప్రోద్బలంతో స్థానికులు కొందరు ఇలా చేస్తున్నారని స్థలం బాధితుడు మాల్యాద్రి ఆరోపించాడు. సొంత స్థలాల్లో రోడ్లు వేయిస్తారా అంటూ బాధిత కుటుంబ సభ్యులు ఎస్ఐ అంకమ్మను నిలదీయడంతో వారికి చెందిన స్థలం పట్టా పత్రాలను పరిశీలించి సర్వేయర్‌తో కొలతలు వేయిస్తానని సిబ్బందితో వెనుదిరిగారు. ఈ విషయంలో తమకు న్యాయం చేయాలని బాధిత కుటుంబసభ్యులు ఎంపీడీవో విజయ, తహల్దారు లావణ్యకు వినతిపత్రాలు అందజేశారు. ఈ విషయంపై పంచాయతీ రాజ్ ఏఈ జేవీ మూర్తి, చాకిచర్ల కార్యదర్శి వంశీలను వివరణ కోరగా పనులు చేపట్టేందుకు పోలీసు బందోబస్తు, ఎక్స్‌కవేటర్ తీసుకెళుతున్నట్లు సమాచారం ఇవ్వలేదని అధికారులు చెప్పడం విశేషం. ఇది పూర్తిగా వ్యక్తిగత, రాజకీయకక్షలో భాగంగా పోలీసులను వెంటేసుకొచ్చారని గ్రామస్థులు గుసగుసలాడుకోవడం విశేషం.

నలందా విద్యార్థుల ప్రతిభ

కావలి టౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): భారత సంస్కృతి ప్రతిష్టాన్ నిర్వాహకులు రామాయణ అంశంపై నిర్వహించిన పోటీ పరీక్షల్లో గొల్ల మూడివారి వీధిలోని నలందా హైస్కూల్ విద్యార్థులు వీవీ.రాఘవి, యశశ్విని, హేమసృజన్‌లు ప్రతిభ చూపారు. మంగళవారం పాఠశాలలో డైరెక్టర్ ఎండీ వసీంతో అధ్యక్షతన జరిగిన అభినందన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎంఈవో గోవిందయ్య పాల్గొన్నారు. ప్రతిభా విద్యార్థులను మెమొంటోలతో పాటు ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. పాఠశాలలో రామాయణం, మహాభారతంలో ధర్మాన్ని బోధించడం వల్ల ఈ విజయం సాధ్యపడిందని ఎండీ వసీం తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తల్లితండ్రులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం మండలాధ్యక్షుడిగా వెంకట సుబ్బారావు


ఆర్యవైశ్య మండల నూతన కార్యవర్గం

లింగసముద్రం, జనవరి 28(ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్య సంఘం మండ నూతన అధ్యక్షుడిగా దేవకి వెంకట సుబ్బారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం రాత్రి స్థానిక కోదండరాముని ఆలయంలో జరిగిన సమావేశంలో కందుకూరు ఆర్యవైశ్య నాయకులు, జిల్లా మీడియా ఛైర్మన్ చక్కా వెంకట కేశవరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా దేవకి శేషగిరిరావు, ఉపాధ్యక్షుడిగా వేముల మాలకొండయ్య, ప్రధాన కార్యదర్శిగా దోర్నల కళ్యాణ చక్రవర్తి, కార్యదర్శిగా మలిశెట్టి శ్రీనివాసరావు, కోశాధికారి గొల్ల శ్రీనివాసులు, జిల్లా కార్యవర్గసభ్యులుగా దేవకి సుబ్బారావు, జల్దు హజరత్తయ్య, దేవకి లక్ష్మి, కొంజేటి వీరాంజనేయులు, కార్యవర్గసభ్యులు ఉన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు కోట కిషోర్‌బాబు, రమా శ్రీనివాసులు పాలొన్నారు.

రూ.26లక్షలతో రైతుబజారు అభివృద్ధి

● డైరెక్టర్ ఆఫ్ మార్కెటింగ్ విజయ సునీత


రైతుబజార్‌ను పరిశీలిస్తున్న విజయ సునీత

కావలి టౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రూ.26లక్షలతో పట్టణ రైతుబజార్‌లో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు డైరెక్టర్ ఆఫ్ మార్కెటింగ్ విజయసునీత తెలిపారు. మంగళవారం ఆమె రైతుబజార్‌ను పరిశీలించి ఇక్కడి పరిస్థితులపై అధికారులను ప్రశ్నించారు. పరిసరాల పరిశుభ్రత పాటించడం ఇలాగేనా మండిపడ్డారు. వ్యాపారుల ఏర్పాటు చేసిన రేకులు పరిశీలించి వాటి స్థానంలో వెంటనే కొత్తవి ఏర్పాటు చేయాలన్నారు. ప్రతిమూడో శనివారం విధిగా క్లీన్ అండ్ గ్రీన్ పాటించాలని ప్రభుత్వం చెబుతున్నా ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆగ్రహించారు. రాష్ట్రవ్యాప్తంగా రైతు బజార్‌ల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తుందని అందులో భాగంగా కావలి రైతుబజార్ అభివృద్ధి పనులకు ఈ నిధులు విడుదల చేస్తామన్నారు. కార్యక్రమంలో జేడీ శ్రీనివాసరావు, ఏఎంసీ కార్యదర్శి శ్రీనివాసులు, ఏడీ అనంతకుమారి, ఎస్టేట్ ఆఫీసర్ మధు పాల్గొన్నారు.

వాహనాల దారి మళ్లింపు


వాహనాలను నిలిపేస్తున్న పోలీసులు

కావలి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఉదయగిరికి వెళ్లే రైల్వే ఓవర్ బ్రిడ్జి మరమ్మతులను నేషనల్ హైవే అధికారులు చేపట్టడంతో పోలీస్‌లు వన్‌వే ట్రాఫిక్‌ను ఏర్పాటు చేశారు. సోమవారం పట్టణ వాహన చోదకులతో పాటు ఉదయగిరి, పెద్దపవని మార్గాల నుంచి వచ్చే వాహనాలకు రైల్వే ఓవర్ బ్రిడ్జికి రెండు వైపులా కొంత సేపు ఆపి విడిలేయంతో ట్రాఫిక్ సమస్య మరింత రద్దీగా మారింది. మంగళవారం ట్రాఫిక్‌ను మార్చారు. జనతాపేట వైపు నుంచి వచ్చే వాహనాలను కొన్నింటిని దారి మళ్లిస్తున్నారు. బుడంగుంట గేటు మీదుగా చిన్న వాహనాలు, ఆటోలను అటు వైపు మళ్లిస్తూ ద్విచక్రవాహనాలను, పెద్ద వాహనాలను పెద్దపవనిరోడ్డులో అన్నపుగుంట వద్ద ఉన్న అండర్‌పాస్ మీదుగా మళ్లిస్తున్నారు. వంతెన మరమ్మతులను రాత్రిసమయంలో కూడా చేపట్టి త్వరగా పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఈసీ సభ్యులకు శిక్షణ ప్రారంభం

సంగం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక వెలుగు కార్యాలయంలో పొదుపు సంఘాల ఈసీ సభ్యులకు మంగళవారం శిక్షణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏపీఎం రవిశంకర్‌రెడ్డి మాట్లాడుతూ పొదుపు సంఘాల లావాదేవీలు, పుస్తక నిర్వహణ, జీవనోపాధికి శిక్షణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ట్రాన్స్‌కో ఏఈ మన్మథరావు పీఎం సూర్య ఘర్ పథకంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల సమైఖ్య, ఈసీ సభ్యులు పాల్గొన్నారు. ఈ శిక్షణ మూడురోజులపాటు జరగనున్నది.

ఎర్రచందనం దుంగల నరికివేతపై కేసు

కలిగిరి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): తూర్పుదూబగుంట సమీపంలోని అగ్రిగోల్డ్ భూముల్లో గుర్తుతెలియని వ్యక్తులు ఎర్ర చందనం దుంగలను అక్రమంగా కొట్టివేయడంపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఉమాశంకర్ తెలిపారు. కొట్టిన వాటిలో కొన్నింటిని అక్కడే వదిలేసి వెళ్లారని కంపెనీ సూపర్‌వైజర్ నాగయ్య ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు. సిబ్బందితో దుంగలను పరిశీలించి స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

పాడి రైతులకు చేయూత


పశువులకు వైద్యం చేస్తున్న వైద్యాధికారి సుజని

సంగం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): పాడి రైతులకు ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి చేయూతను అందిస్తున్నదని వెటర్నరీ వైద్యాధికారి డాక్టర్ సుజని తెలిపారు. మంగళవారం మండలంలోని అన్నారెడ్డిపాళెంలో పశు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. పశువులను పరీక్షించి సీజనల్‌గా వచ్చే వ్యాధులకు టీకాలు వేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ 90 శాతం రాయితీతో ప్రభుత్వం పాడి రైతులకు గోకులం షెడ్లు మంజూరు చేస్తున్నదన్నారు. ఉపాధి నిధులతో పశుగ్రాసం పెంపకానికి ప్రోత్సాహకాలు అందచేస్తుందని తెలిపారు. పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలిన కోరారు. కార్యక్రమంలో టీడీపీ నేత బండా హరికిషోర్‌రెడ్డి, పలువురు పాడి రైతులు పాల్గొన్నారు.

● రామాపురంలో పశు వైద్యశిబిరం

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్): రామాపురం రైతు సేవా కేంద్రంలో మంగళవారం పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్యశిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మూగజీవాలకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ రావెళ్ల నాగేంద్రబాబు, నక్కలగండి రిజర్వాయర్ ఛైర్మన్ వేమూరి మధుసూదన్, పశు వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

చీఫ్ సెక్రటరీని కలిసిన అరవ


పుష్పగుచ్ఛం అందజేస్తున్న రవీంద్ర యాదవ్

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), జనవరి 28(ఆంధ్రజ్యోతి): పెద్దిరెడ్డిపల్లికి చెందిన నెల్లూరు పార్లమెంట్ టీడీపీ బీసీ సెల్ సెక్రటరీ అరవ రవీంద్రయాదవ్ మంగళవారం వెలగపూడిలో ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ విజయానంద్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. తొలిసారి యాదవ సామాజికవర్గానికి చెందిన వ్యక్తిని కూటమి ప్రభుత్వం చీఫ్ సెక్రటరీగా నియమించడంపై సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు.

శనగరైతులు ఏడాదికోసారైనా పంట మార్పిడి చేయాలి


ఆత్మకూరు: మాట్లాడుతున్న ఏడీఏ దేవసేనమ్మ

కందుకూరు, జనవరి 28(ఆంధ్రజ్యోతి): గత కొన్నేళ్లుగా శనగ సాగులో వస్తున్న వేరుకుళ్లు, మొదలుకుళ్లు తెగులు వస్తున్నాయని రైతులు విధిగా పంట మార్పిడి చేయాలని మండల వ్యవసాయాధికారి రాము సూచించారు. మంగళవారం ఓగూరులో పొలంపిలుస్తోందిలో శనగ పైరును పరిశీలించి మాట్లాడారు. శనగ సాగుకు కనీసం ఒక్క ఏడాదైనా విరామం ఇచ్చి జొన్న, సజ్జ, కొర్ర లాంటి పంటలు సాగుచేయాలన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం మోడల్‌మేకర్ మాధవ, గ్రామ వ్యవసాయ సహాయకులు శరత్‌కుమార్, పశువైద్య సహాయకుడు షేక్ షాజహాన్ పాల్గొన్నారు.

ఎలుకల నివారణకు చర్యలు చేపట్టాలి

ఆత్మకూరు: వరి పొలాల్లో ఎలుక నివారణకు రైతులు తగిన చర్యలు చేపట్టాల్సి ఉందని ఆత్మకూరు ఏడీఏ దేవసేనమ్మ తెలిపారు. అప్పారావుపాళెం, బట్టేపాడులో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మాట్లాడారు. వరిలో ఎలుకల నివారణకు బ్రోమోడయోలిన్ వాడాలన్నారు. మందును రైతులకు ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖాధికారి కిషోర్‌బాబు, వీఏఏలు ఏ ఝన్సీరాణి, డీ అర్చన, రైతులు పాల్గొన్నారు.

● మర్రిపాడు: సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడి పొందవచ్చని జిల్లా వ్యవసాయాధికారిణి సత్యవాణి తెలిపారు. ఇర్లపాడులో పంటలను పరిశీలించారు. సచివాలయం వద్ద రైతులతో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి రామ్మోహన్, రైతులు పాల్గొన్నారు.

● సీతారామపురం: పబ్బులేటిపల్లిలో మండల వ్యవసాయాధికారి చెన్నారెడ్డి ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో సాగులో ఉన్న వరిపైరును పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈవో సాంబశివయ్య, వీపీఏ స్వప్ననరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన స్థలం ఆక్రమణ అడ్డగింపు

● సచివాలయాల్లో జంగం, వడ్డిపాలెం వాసుల ఫిర్యాదు


శ్మశాన స్థలంలో గట్లు వేసిన ఆక్రమణదారులు

బిట్రగుంట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): జంగంపాలెం, వడ్డిపాలెంలో తాతముత్తాలకాలం నుంచి ఉన్న శ్మశాన స్థలాన్ని స్థానికులు కొందరు మంగళవారం ఆక్రమణకు పాల్పడ్డారు. విషయం తెలుసుకున్న రెండు గ్రామాల్లోని జంగం, వడ్డేర కులస్థులు అక్కడకు వచ్చి వారిని అడ్డుకున్నారు. ప్రజలు అక్కడకు వస్తున్నారి తెలిసి ఆక్రమణదారులు అక్కడినుంచి ఉడాయించారు. విషయంపై సచివాలయాల్లో వినతిపత్రం అందజేశారు. ఆక్రమణదారుల నుంచి స్థలం రక్షణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఎంపీడీవోకి సన్మానం


ఎమ్పీడీవోను సన్మానిస్తున్న పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది

ఉదయగిరి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో విశిష్ట సేవలంది కలెక్టర్ ఆనంద్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్న ఎంపీడీవో అప్పాజీని స్థానిక మండల కార్యాలయంలో మంగళవారం కార్యదర్శులు, సిబ్బంది సన్మానించారు. భవిష్యత్తులో మరెన్నో అవార్డులు పొందాలని ఆకాంక్షిస్తూ జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ కరీముల్లా, కార్యదర్శులు నాగూర్ వీరేంద్ర, జూనియర్ అసిస్టెంట్లు సమద్, రంగనాయకులు, డీఈవో ఇమ్రాన్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

సంగం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): తరుణవాయిలో మంగళవారం తుంగా ఇందాదర్‌రెడ్డి జ్ఞాపకార్థం నారాయణ వైద్యశాల సౌజన్యంతో సర్పంచి శోభ బాలనాయుడు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని తుంగా కార్తీక్‌రెడ్డి ప్రారంభించారు. డాక్టర్లు గ్రామస్థులకు రక్తం, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందచేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు నెల్లూరు కోటరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

సంపద కేంద్రం పరిశీలన

సీతారామపురం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): పంచాయతీలోని సంపద సృష్టి కేంద్రాన్ని ఈవోపీఆర్డీ భార్గవి మంగళవారం పరిశీలించారు. తొట్టెల్లో తయారవుతున్న వర్మీకంపోస్టు సేంద్రియ ఎరువును పరిశీలించి మాట్లాడారు. ప్రజలు సామాజిక బాధ్యతగా ఇంటి నుంచి తడి,పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి గ్రీన్ అంబాసిడర్లకు అందించాలన్నారు. వర్మీ కంపోస్ట్ తయారు చేసుకోవడం ద్వారా పంచాయతీ ఆదాయం సృష్టించుకోవాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శులు రాంనాథరెడ్డి, జీవన్ కుమార్, అంబాసిడర్లు, పాల్గొన్నారు.

ఘనంగా కాశినాయన జయంతి

సీతారామపురం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి):బెడుసుపల్లెలో మంగళవారం అవధూత కాశినాయనస్వామి జ్యోతిక్షేత్రంలో కాశినాయన జయంతిని వైభవంగా నిర్వహించారు. భక్తులు వేలాదిగా పాల్గొని ప్రత్యేక పూజలు, అభిషేకలు నిర్వహించారు. రాత్రి దివ్యజ్యోతి దర్శనం, కాశినాయన అలయం నుంచి రథోత్సవం, 108మంది మహిళలతో జ్యోతి కార్యక్రమం నిర్వహించారు.



న్యూస్ బాక్స్

రేపు మండల సమావేశం

వలేటివారిపాలెం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మండల కార్యాలయంలో గురువారం మధ్యాహ్నం 3గంటలకు ఎంపీపీ పొనుగోటి మౌనిక అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నరేంద్రదేవ్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ప్రజా ప్రతినిధులు, మండలస్థాయి అధికారులు సమగ్ర సమాచారంతో రావాలన్నారు.

రేషన్ అందించాలి


మాట్లాడుతున్న తహసీల్దారు సీతామహాలక్ష్మి

లింగసముద్రం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రేషన్ సరుకులను ప్రతిఒక్క లబ్ధిదారుడికి అందేలా చూడాలని తహసీల్దారు సీతామహాలక్ష్మి తెలిపారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో జరిగిన డీలర్ల సమావేశం జరిగింది. కందుకూరు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ చెంచురామయ్యతో కలిసి ఆమె మాట్లాడారు. ఎండీయూ ఆపరేటర్లు ప్రతిరోజూ ఉదయం 7గంటల నుంచే నిర్దేశించిన రేట్లకే సరుకులు ఇవ్వాలన్నారు. షాపు బయట బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. రేషన్ సరుకుల పంపిణీలో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో డీటీ శ్రీనివాసులు, ఆర్ఐ రమణయ్య పాల్గొన్నారు.

పోలేరమ్మకు పొంగళ్లు

బిట్రగుంట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): కోవూరుపల్లి పోలేరమ్మకు మంగళవారం కడనూతల దళితవాడ చెందిన ప్రజలు మేళతాళాలు, మంళవాయిద్యాలతో నైవేద్యాలను తీసుకొచ్చి అమ్మవారి దర్శించుకున్నారు. అనంతరం నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించి పూజలు చేశారు.

సీసీ రోడ్డు పనుల ప్రారంభం

ఉదయగిరి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): స్థానిక పంచాయతీ కార్యాలయ ఆవరణలో మంగళవారం సిమెంట్‌రోడ్డు పనులను సర్పంచ్ స్వామ్రాజ్యం, ఉప సర్పంచి షేక్ ముర్తుజా హుస్సేన్ ప్రారంభించారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో ఈ నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వార్డుసభ్యులు ఉప్పుటూరి శ్రీనివాసులు, రియాజ్, ఉప్పుటూరి హరి,మాబాషా, యస్థాన్, ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

సీతారామపురం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి):స్థానిక ఎంపీపీ కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో భాస్కర్ తెలిపారు. ఎంపీపీ అధ్యక్షతన జరిగే సమావేశంలో శాఖలవారీ అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షిస్తామన్నారు. ప్రజాప్రతినిధులు, అన్నిశాఖల అధికారులు హాజరవాలన్నారు.

క్రికెట్ కిట్ అందజేత

దుత్తలూరు(ఉదయగిరి), జనవరి 28 (ఆంధ్రజ్యోతి): జడ్పీ ఉన్నత పాఠశాలకు మంగళవారం మనోహర్‌రావు, కేజియమ్మల జ్ఞాపకార్థం వారి కుమారుడు మనోజ్ క్రికెట్ కిట్‌ను అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్ఎం వెంకటేశ్వర్లు, పీఈటీ వెంకటేశు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బెల్టు దుకాణాలపై దాడులు

కావలి రూరల్, జనవరి28 (ఆంధ్రజ్యోతి): సిరిపురంలోని రెండు బెల్టు దుకాణాలపై మంగళవారం రాత్రి ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. మద్యం అమ్మకాలు సాగిస్తున్న పరుసు సుకుమార్, సురేష్‌లను అదుపులోకి తీసుకుని 18మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. దాడుల్లో ఎస్ఐ దేవిక సిబ్బంది పాల్గొన్నారు.

బహుమతుల ప్రదానం


బహుమతులు అందజేస్తున్న బ్యాంకు మేనేజర్ శోభన్‌బాబు

ఉదయగిరి రూరల్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): గండిపాళెం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు స్వచ్ఛతా పక్వాడ్‌లో భాగంగా మంగళవారం నిర్వహించిన పరిసరాల పరిశుభ్రత, చిత్రలేఖనం పోటీల విజేతలకు ఏపీజీబీ మేనేజర్ శోభన్‌బాబు బహుమతులు అందజేశారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన మనోజ్ఞ, షేక్ అఫీఫా, భవ్యశ్రీలకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రమేష్, అజయ్, చిన్న ఖాసిం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

30మంది ఎంపిక

కందుకూరు, జనవరి 28(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాలో 33మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. కళాశాల చివరి సంవత్సర విద్యార్థులతో పాటు పూర్వ విద్యార్థులు, నిరుద్యోగులు 61మంది పాల్గొనగా.. కంపెనీల హెచ్ఆర్‌లు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపికైన వారికి నియామకపత్రాలు అందజేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ మస్తానయ్య తెలిపారు.